
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

చంద్రబాబు.. శక్తిమంతమైన ముఖ్యమంత్రి



టాప్ టెన్ నేతల్లో ఐదో స్థానం.. 'ఇండియా టుడే' కథనం

మొదటి 4 ర్యాంకుల్లో మోదీ, భాగవత్, షా, రాహుల్

బాబు తర్వాత నితీశ్, యోగి, స్టాలిన్, మమత, అఖిలేశ్

రాజకీయ అనిశ్చిత స్థితి నుంచి ఉన్నతస్థాయికి

ఫీనిక్స్ పక్షిలా చంద్రబాబు పునర్జన్మ

'హాలీవుడ్'లో మాత్రమే ఇలాంటివి చూస్తామని కితాబు

2

రిలయన్స్ భారీ పెట్టుబడి

ఏపీలో రూ. 65 వేల కోట్లతో 500 బయోగ్యాస్ ప్లాంట్లు

బుధవారం | 13-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 225

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి మ. 1.02 తదుపరి త్రయోదశి; నక్షత్రం: రేవతి తె. 3.11 తదుపరి అశ్విని; వర్జ్యం: సా. 4.25-5.51; దుర్ముహూర్తం: ఉ. 11.36-12.21; అమృతఘడియలు: రా. 1.01-2.27; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.22; సూర్యాస్తమయం: 5.35 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అనుమతి ఆపడానికే!

రెండు రోజులుగా ఢిల్లీలో కేటీఆర్ ప్రయత్నాలు

ఆయనను విచారించేందుకు ఏసీబీ సిద్ధం

15 రోజులుగా గవర్నర్ వద్ద ఫైలు పెండింగ్

17ఏ కింద అనుమతి ఇచ్చి తీరాల్సిందే

కేటీఆర్ ఢిల్లీకి.. ఇప్పుడు గవర్నర్‌నూ పిలిచారట

బయటపడనున్న బీఆర్ఎస్, బీజేపీ చీకటి బంధం

అందుకే మహారాష్ట్రలో కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారం

సృజన్‌కు బీఆర్ఎస్ హయాంలోనే వేల కోట్ల పనులు

పదేళ్ల తర్వాత మారనున్న రాజకీయ సమీకరణాలు

టెస్టు ఫార్మాట్‌లో కాంగ్రెస్.. ట్వంటీ-20 ఆడాలి

ప్రజల సమస్యలు నేరుగా తెలిసే యాప్ అవసరం

పదేళ్లు అధికారంలో ఉండి దాడులను సమర్థిస్తారా?

నిందితులు, ప్రోత్సహించిన వారిని శిక్షిస్తాం

ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడ్డా కార్యక్రమం, మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఢిల్లీలో నెదర్లాండ్స్ రాయబారికి జ్ఞాపిక అందజేస్తున్న సీఎం రేవంత్


కేసీఆర్‌కు ఫైనాన్స్ చేశా

నేను ఎన్నడూ టీఆర్ఎస్‌లో పని చేయలేదు. కానీ, తెలంగాణ ఉద్యమ సమయంలో చాలా మందితోపాటు నేను కూడా కేసీఆర్‌కు ఫైనాన్స్ చేశాను. అప్పట్లో విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. దానిని కేసీఆర్ తన పెట్టుబడిగా మార్చుకున్నారు.

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): "మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు ఏసీబీ సిద్ధంగా ఉంది. 17ఏ కింద గవర్నర్ అనుమతి కోరాం. ఈ నిబంధన కింద గవర్నర్ అనుమతి ఇచ్చి తీరాలి. కానీ, 15 రోజులుగా గవర్నర్ వద్దే పెండింగ్‌లో ఉంది. రెండు రోజుల కిందట కేటీఆర్ ఢిల్లీ వచ్చారు. ఇప్పుడు గవర్నర్‌ను ఢిల్లీకి పిలిపించారని తెలుస్తోంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. గవర్నర్ అనుమతి రాకుండా.. ఈ రేస్ స్కామ్ నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్ ఢిల్లీ వచ్చారని ఆరోపించారు. దాంతో, బీజేపీ, బీఆర్ఎస్ చీకటి బంధం బయటపడుతుందన్నారు. బీజేపీ అవినీతి పార్టీ అని, దానిని అంతం చేస్తామని కేటీఆర్ అన్నారని, మరి, ఇప్పుడు వినతి పత్రాలు పట్టుకుని ఆ పార్టీ నేతలను ఎలా కలుస్తున్నారని ప్రశ్నించారు. ఢిల్లీలో సోమవారం జరిగిన 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడ్డా' కార్యక్రమంలోనూ, అక్కడే మీడియాతోనూ రేవంత్ రెడ్డి మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ చేసిన అవినీతిపై విచారణ మొదలైందని, దానికి జవాబు చెప్పకుండా ఎదురుదాడి చేయాలని అనుకుంటున్నారని విమర్శించారు. "తెలంగాణ, ఏపీలో ఏ రెడ్డి అయినా నాకు దగ్గరో, దూరపు బంధువో అవుతాడు. సృజన్ రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి అల్లుడే. సృజన్ రెడ్డికి బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు

మిగతా 13వ పేజీలో...



హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో బాపు ఘాట్

సింగపూర్ ప్లాన్ సిద్ధం!

అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా బాపు ఘాట్

212 ఎకరాల్లో అభివృద్ధి.. సర్కారుకు కన్సార్షియం ప్లాన్

ప్రపంచంలోనే అతి పెద్ద గాంధీ విగ్రహం ఏర్పాటు!

మల్లన్న సాగర్ నుంచి స్వచ్ఛమైన జలాల తరలింపు

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాపు ఘాట్‌ను అంతర్జాతీయ పర్యాటక, విజ్ఞాన, వినోద కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలను సింగపూర్ కన్సార్టియం మెయిన్ హార్ట్ తాజాగా ప్రభుత్వానికి అందజేసింది. మూసీ ప్రాజెక్టు పునరుజ్జీవం, సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా సుమారు 55 కిలోమీటర్ల మేర పరీవాహక ప్రాంతాన్ని పర్యాటక, ఉపాధి కల్పన అవకాశాల కేంద్రంగా మారుస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా తొలుత మూసీ ఒడ్డునున్న బాపుఘాట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును నమూనాగా చూపి.. మూసీ పొడవునా ఉన్న ప్రజల విశ్వాసాన్ని పొందేలా నిర్మాణ ప్రతిపాదనలు చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 'మెయిన్ హార్ట్' ఈ ప్రణాళికలను సిద్ధం చేసి, ప్రభుత్వ పెద్దలకు చూపినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. సుమారు 212 ఎకరాల మేర ఈ అభివృద్ధి ప్రణాళికను సింగపూర్ కన్సార్షియం రూపొందించింది. సుమారు 115 ఎకరాల ప్రభుత్వ భూమి, 30 ఎకరాల పైన ప్రైవేటు భూమి, 50 ఎకరాలకు పైగా రక్షణ శాఖ భూమిని

మిగతా 13వ పేజీలో...

13

గోల్కొండ - కుతుబ్‌షాహీ టూంబ్స్‌కు రోప్‌వే!



రేవంత్, పొంగులేటి పదవులు

ఊడతాయ్

అమృత్ టెండర్లలో అవినీతిపై కేంద్రం చర్యలేవీ?

ఈ ఫిర్యాదు తొలి ఎపిసోడే.. త్వరలో స్కాంలపై సీరియల్స్

పొంగులేటి.. అదానీ కాళ్లు పట్టుకున్నది నిజం కాదా?

ఆర్ఆర్ ట్యాక్స్‌పై ప్రధాని మోదీ మౌనం ఎందుకు?

ఏ విచారణకైనా నేను సిద్ధం.. ఏం చేస్తారో చేసుకోండి

కలెక్టర్‌పై దాడి జరగడం ఎప్పుడైనా చూశామా?: కేటీఆర్

అల్లుడి కోసం ప్రజల భూముల్ని లాక్కుంటారా.. అని ట్వీట్

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పదవులు త్వరలో ఊడిపోవడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమృత్ టెండర్లలో అక్రమాలపై కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ కేసులో రేవంత్, పొంగులేటి పదవులు పోతాయని తెలిపారు. ఇది కేవలం మొదటి ఎపిసోడ్ మాత్రమేనని, త్వరలో వివిధ కుంభకోణాలపై ధారావాహికలు ఉంటాయని చెప్పారు. అమృత్ పథకం టెండర్ల కేటాయింపులో అక్రమాలు జరుగుతుంటే

మిగతా 14వ పేజీలో...

14

అమృత్ టెండర్లు బీఆర్ఎస్ హయాంవే!

కేటీఆర్ తెచ్చింది నకిలీ ఫార్ములా ఈ రేస్.. అదో కుంభకోణం

తప్పించమని షాను కోరేందుకే ఢిల్లీ వెళ్లారు: మంత్రి కోమటిరెడ్డి

12

మహారాష్ట్ర ఎన్నికలకు సీఎం డబ్బు మూటలు

రాష్ట్రంలో వడ్ల లోడెత్తడం లేదు

మూసీకంటే రేవంత్ నోరే కంపు

మాజీ మంత్రి హరీశ్ ధ్వజం



జన సంచారం లేని లగచర్ల గ్రామం

లగచర్లలో అర్ధరాత్రి అరెస్టులు

అదుపులోకి 55 మంది.. 16 మందికి రిమాండ్

లగచర్ల, మరో రెండు గ్రామాలు నిర్మానుష్యం

ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయిన గ్రామస్థులు

కొడంగల్ నియోజకవర్గంలో ఇంటర్నెట్ బంద్

వికారాబాద్ జిల్లాలో రెవెన్యూ సిబ్బంది పెన్‌డౌన్

రాజకీయ కుట్ర కోణంపై పోలీసుల దృష్టి

డీజీపీకి ఉద్యోగుల జేఏసీ నేతల ఫిర్యాదు

'లగచర్ల' బాధ్యులను వదలం: శ్రీధర్‌బాబు

కలెక్టర్‌పై దాడి చేసినా ఊరుకోవాలా?: పొన్నం

విద్రోహ శక్తుల్లారా.. ఖబడ్దార్!

వికారాబాద్ కలెక్టరేట్ వద్ద జేఏసీ నేతల ధర్నా

12

కొడంగల్/బొంరాస్‌పేట, వికారాబాద్, హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ కోసం జరిగిన అభిప్రాయ సేకరణలో అధికారులపై దాడి అనంతరం లగచర్ల, పరిసర గ్రామాల ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. మంగళవారం లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల్లో నిర్మానుష్యం రాజ్యమేలింది. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని దుద్యాల మండలం, లగచర్ల గ్రామంలో ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్ (క్లస్టర్) ఏర్పాటుకు భూసేకరణలో భాగంగా సోమవారం ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, తహసీల్దార్ విజయకుమార్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిపై రైతులు, గ్రామస్థులు రాళ్లు, కర్రలతో దాడులు చేసిన విషయం తెలిసిందే..! అర్ధరాత్రి నుంచి పోలీసుల అరెస్టుపర్వం

మిగతా 12వ పేజీలో...

10 ఫార్మా విలేజ్‌లు.. 20వేల ఎకరాలు.. వెయ్యి సంస్థలు!

జాబితా తయారీలో సర్కార్.. భూసేకరణకు ముందే పెట్టుబడులపై స్పష్టత

500 కంపెనీల ఆసక్తి.. పెట్టుబడులు రూ.లక్ష కోట్లు దాటొచ్చని అంచనా!



'సీతారామ' అంచనా..

19,800 కోట్లకు పెంపు

సవరణకు వీలుగా కొత్తగూడెం సీఈ ప్రతిపాదనలు

హైదరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సవరించాలని, రూ.19,800 కోట్లకు పెంచాలని కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్(సీఈ) ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. 2016 ఫిబ్రవరి 18న రూ.7926.14 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం పరిపాలన అనుమతినివ్వగా.. 2018 ఆగస్టు 2న రూ.13,057 కోట్లకు సవరించారు. తాజాగా అంచనా వ్యయాన్ని రూ.19,800 కోట్లకు పెంచాలని కోరుతూ ప్రతిపాదనలు సమర్పించారు. 3,28,853 ఎకరాల కొత్త

మిగతా 3వ పేజీలో...

విదేశాలకు

తెలంగాణ బియ్యం



దిగుమతుల మీద ఆధారపడే దేశాలపై సర్కారు నజర్

ఇండోనేషియా, మలేసియా, ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి

ఈ దేశాల నుంచి డిమాండ్ లేఖలు తెప్పించే కసరత్తు

కేంద్రం అనుమతితో కార్పొరేషన్ ద్వారా ఎగుమతి

3

వాణిజ్యం ఆకాశాన్ని తాకేలా!

కోకాపేటలో 50 అంతస్తుల కమర్షియల్ భవనం

దక్షిణ భారత దేశంలోనే ఇదే అతి పెద్దది

హెచ్ఎండీఏకు ప్రముఖ నిర్మాణ సంస్థ దరఖాస్తు

రూ.5.29 లక్షల కోట్లు ఫట్

భారీగా పడిపోయిన స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 821 పాయింట్ల పతనం



మళ్లీ ధరల మంట

అక్టోబరులో 6 శాతం దాటిన ద్రవ్యోల్బణం


14 నెలల గరిష్ఠ స్థాయి

బిజినెస్‌లో..

ఉగ్రవాదుల్లో పాక్‌వాసులే అధికం

కశ్మీర్‌లో తగ్గుతున్న స్థానిక టెర్రరిస్టుల సంఖ్య

చురుగ్గా ఇంకా 119 మంది ఉగ్రవాదులు!




శ్రీనగర్, నవంబరు 12: జమ్మూ-కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి నిశితంగా కృషి చేస్తున్న భద్రత బలగాలు క్షేత్రస్థాయి సమాచారాన్ని క్షుణ్ణంగా సేకరిస్తున్నాయి. ప్రస్తుతం మొత్తంగా 119 మంది ఉగ్రవాదులు చురుగ్గా వ్యవహరిస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. ఇందులో 79 మంది పీర్ పంజాల్ ఉత్తర భాగంలో ఉన్నారు. వీరిలో 18 మంది స్థానికులు కాగా, 61 మంది పాక్ జాతీయులు. దక్షిణ భాగంలో 40 మంది ఉండగా వారిలో 34 మంది విదేశీయులు. ఆరుగురు స్థానికులు. ఈ ఏడాదిలో ఇంతవరకు 25 ఉగ్రవాద సంబంధిత సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన ఎదురు కాల్పుల్లో 24 మంది జవాన్లు, అధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఎన్‌కౌంటర్లలో మొత్తం 61 మంది ఉగ్రవాదులు హతం కాగా, వారిలో 21మంది పాక్ జాతీయులు. ఉగ్రవాద ముఠాల్లో చేరడానికి స్థానికులు ఆసక్తి చూపించకపోవడంతో పాకిస్థాన్‌లోని నిరుద్యోగ, నిరక్షరాస్య యువతపై అవి దృష్టి పెట్టాయి. కాగా, పొరుగు దేశం నుంచి ఉగ్రవాద ముప్పు ఇంకా సవాలేనని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

మతమార్పిళ్లకు పాల్పడే ఎన్జీవోలపై కన్నెర్ర

న్యూఢిల్లీ, నవంబరు 12: బలవంతపు మతమార్పిళ్లకు పాల్పడటం, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడే స్వచ్ఛంద సంస్థల(ఎన్జీవో) రిజిస్ట్రేషన్లను విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ)-2010 ప్రకారం రద్దు చేస్తామని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దీనికి సంబంధించి ఎఫ్‌సీఆర్‌ఏ డైరక్టర్ కె.సంజయన్ ఈ నెల 8న నోటీసు విడుదల చేశారు. విదేశీ వ్యక్తులు, సంస్థల నుంచి విరాళాలు పొందే స్వచ్ఛంద సంస్థలు సామాజిక, మతపరమైన సామరస్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడితే ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ కోల్పోతాయని స్పష్టం చేశారు. ఉగ్రవాద, రాడికల్ సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నా, కుట్రపూరితంగా నిరసనలు, అవాంఛనీయ కార్యకలాపాలతో అభివృద్ధి నిరోధక చర్యలకు పాల్పడినా ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామన్నారు. అంతేకాదు ఎఫ్‌సీఆర్‌ఏ చట్టం ప్రకారం ఆయా స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. విదేశీ వ్యక్తులు, సంస్థల నుంచి విరాళాలు పొందే స్వచ్ఛంద సంస్థలు తాము పెట్టుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టకపోయినా ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ కోల్పోతాయి. విదేశాల నుంచి విరాళాలు పొందాలనుకునే స్వచ్ఛంద సంస్థలు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి. లైసెన్సులు కోల్పోతే విదేశీ నిధులు రావు.

లోకం తీరు



తెలుగువారు వలస వచ్చిన వాళ్లు కాదు

- తమిళనాడు అభివృద్ధిలో వారిది క్రియాశీలక పాత్ర
- నటి కస్తూరి వ్యాఖ్యలపై మద్రాస్ హైకోర్టు

చెన్నై, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలుగువారు తమిళనాడుకు వలసవచ్చిన వారు కాదని, రాష్ట్రాభివృద్ధిలో వారి క్రియాశీలకమైన భాగస్వామ్యం ఉందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. చెన్నపట్నంలో తెలుగువారి ప్రాబల్యం ఎక్కువగా ఉందని, అలాంటి వారిని ఎలా వేరుచేసి చూడగలమని న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ నేతృత్వంలోని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్నించింది. ఇటీవల ఓ సభలో నటి కస్తూరి తెలుగువారినుద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై పలు తెలుగు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనలు వ్యక్తం చేయగా, చెన్నై, మదురై, సేలం తదితర ప్రాంతాల్లో పోలీసులు కస్తూరిపై ఆరు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఆమెను అదుపులోకి తీసుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలు కూడా ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోరుతూ కస్తూరి మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేయగా దానిపై మంగళవారం విచారణ జరిగింది. కస్తూరి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కస్తూరి తన వ్యాఖ్యలపై క్షమాపణ తెలిపారని, అయినా రాజకీయ దురుద్దేశంతో కేసులు నమోదు చేశారని చెప్పారు. ధర్మాసనం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

నీటి భద్రతకు జలవనరుల నిర్వహణ అథారిటీ

న్యూఢిల్లీ, నవంబరు 12: గ్రామాల నుంచి నగరాల వరకు నీటి భద్రతకు ప్రణాళికలు, భూగర్భ జలాలు, ముంపు ప్రాంతాల నిర్వహణకు బాధ్యత వహించే ఏకీకృత జలవనరుల నిర్వహణ అథారిటీ (ఐడబ్ల్యూఆర్‌ఎం) ఏర్పాటును ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక ముసాయిదా నమూనా బిల్లును రూపొందించింది. దీన్ని మంగళవారం అన్ని రాష్ట్రాలకూ పంపించింది. వికసిత్ భారత్ విజన్‌లో భాగంగా దేశంలో అందరికీ నీటి భద్రతను సాధించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఐడబ్ల్యూఆర్‌ఎంను ప్రతిపాదించిందని జలవనరుల శాఖ అదనపు కార్యదర్శి రాకేశ్ కుమార్ వర్మ తెలిపారు. ఇది ముంపు ప్రాంతాలను పర్యవేక్షిస్తుందని, నదీ పరిరక్షణ మండలాలను అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

చైనాలో స్పోర్ట్స్ సెంటర్‌లోకి దూసుకెళ్లిన కారు

35 మంది మృతి..43 మందికి గాయాలు

బ్యాంకాక్, నవంబరు 12: దక్షిణ చైనాలోని జుహయ్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. డ్రైవర్ అదుపు కోల్పోవడంతో.. కారు అతి వేగంగా స్పోర్ట్స్‌సెంటర్‌లో వ్యాయామం చేస్తున్న వారిపైకి దూసుకువెళ్లింది. సోమవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో 35 మంది మరణించగా, 43 మంది గాయపడ్డారు. కారు డ్రైవర్(62)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఉద్దేశపూర్వకంగా దాడి చేశాడా? లేక నిజంగానే ప్రమాదమా? అనేది దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జుహయ్‌లో ప్రతి ఏటా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఎయిర్‌షోకు ఒక్కరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకుంది. కాగా, నిందితుడి పేరు ఫ్యాన్‌గా పోలీసులు గుర్తించారు. తీవ్ర గాయాలైన కారణంగా అతను ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నాడని చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

'మల్లూ హిందూ ఆఫీసర్స్' గ్రూప్ సృష్టికర్త

ఐఏఎస్ గోపాలకృష్ణన్‌పై సస్పెన్షన్ వేటు

న్యూఢిల్లీ, నవంబరు 12: కేరళలో కేవలం హిందూ ఐఏఎస్ అధికారుల నంబర్లతో ప్రత్యేకంగా "మల్లూ హిందూ ఆఫీసర్స్" పేరుతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసిన ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణన్‌ను కేరళ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆ వాట్సాప్ గ్రూప్ రాష్ట్రంలోని అఖిల భారత సర్వీసు అధికారుల మధ్య ఐక్యతను దెబ్బతీసి, విభజన సృష్టించేలా ఉందని సస్పెన్షన్ ఆర్డర్‌లో పేర్కొంది. అందుకే గోపాలకృష్ణన్‌పై చర్యలు తీసుకొన్నట్లు తెలిపింది. వాట్సాప్ గ్రూప్ వివాదం అక్టోబరులో బయటకు వచ్చింది. అయితే, తన ఫోన్‌ను ఎవరో హ్యాక్ చేశారని, తనకు తెలియకుండా ఆ గ్రూప్‌ను క్రియేట్ చేసి తనను అడ్మిన్‌గా పెట్టారని గోపాలకృష్ణన్ అప్పుడే వివరణ ఇచ్చారు. ఈ వ్యవహారంపై విజయన్ ప్రభుత్వం సీఎస్ శారదా మురళీధరన్ నేతృత్వంలో విచారణ బృందాన్ని నియమించింది. దర్యాప్తు సందర్భంగా గోపాలకృష్ణన్ తన ఫోన్‌ను ఫోరెన్సిక్ పరీక్షకు ఇచ్చేప్పుడు పలుమార్లు రీసెట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో, ఆయనను సస్పెండ్ చేశారు.

విజయవంతంగా దీర్ఘశ్రేణి క్షిపణి ప్రయోగం



న్యూఢిల్లీ, నవంబరు 12: డీఆర్‌డీవో మంగళవారం విజయవంతంగా దీర్ఘ శ్రేణి క్షిపణి-లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ విస్సైల్ (ఎల్ఆర్ఎల్ఏసీఎం)ను ప్రయోగించినట్టు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఒడిశాలోని చండీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో సంచార ఆర్టిక్యులేటెడ్ లాంచర్ ద్వారా ప్రయోగించినట్టు పేర్కొంది. ఈ తరహా క్షిపణిని ప్రయోగించడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. సుదూరంలో నేలపైన ఉన్న లక్ష్యాలను గురిపెట్టి దీన్ని ప్రయోగిస్తారు. దీన్ని లాంచర్ సాయంతో భూమిపై నుంచి, యుద్ధ నౌకల ద్వారా సముద్రంపై నుంచి కూడా ప్రయోగించే వెసులుబాటు ఉంది. దీని నిర్మాణంలో బెంగళూరులోని ఎరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎక్విప్‌మెంట్ సంస్థ, భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ, హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థలు పాలు పంచుకున్నాయి.

కెనడాలో భారతీయులకు గండం!

పాక్ ఉగ్ర గ్రూపులతో ఖలిస్థానీ నేతల సమావేశం.. త్వరలో నిరసనలు హింసాత్మకంగా మారే ప్రమాదం

- ఈ ఏడాది చివరికి పరిస్థితి తీవ్రం
- నిఘా వర్గాల ఆందోళన



అట్టవా, నవంబరు 12: కెనడాలో నివసిస్తున్న భారతీయులు ఖలిస్థానీ తీవ్రవాదుల నుంచి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నారు. వాట్సా్ప్‌లో గ్రూపులను ట్రాక్ చేయడం నుంచి భౌతిక ఘర్షణలు, నిరసనలు, బెదిరింపుల వరకూ ఖలిస్థానీ అనుకూల సంస్థలు (పీకేఈ) అక్కడి భారతీయ సమాజాన్ని టార్గెట్ చేస్తున్నాయి. ఈ నెల మొదటి వారంలో కొందరు పాకిస్థాన్ నాయకులతో పాటు ఆ దేశానికి చెందిన ఉగ్ర గ్రూపులతో సమావేశమైన తర్వాత ఖలిస్థానీ నాయకత్వం నిరసనల దూకుడును తీవ్రతరం చేసిందని భారత నిఘా వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి భారతీయులు అధిక సంఖ్యలో నివసించే ప్రాంతాల్లో దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నాయి. ఈ నిరసనలు త్వరలోనే హింసాత్మకంగా మారి, పీకేఈకి చెందిన వారు భారతీయులను బెదిరించడంతో పాటు దాడులకు పాల్పడవచ్చని, వారిపై కేసులు కూడా నమోదు చేసే అవకాశం ఉందని ఆ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. స్థానిక పోలీసులు, అధికారుల సహకారంతో కెనడాలోని వివిధ ప్రాంతాల్లో ఖలిస్థాన్‌కు వ్యతిరేకంగా గళం విప్పుతున్న భారతీయుల వివరాలను ఈ సంస్థలు సేకరిస్తున్నాయి. వారి చిరునామా, ఫోన్ నంబర్లు తదితర కీలక సమాచారాన్ని గ్రూపుల్లో షేర్ చేస్తుండటంతో ఆయా కుటుంబాలు ప్రస్తుతం తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. వివిధ భారతీయ కమ్యూనిటీలకు చెందిన సోషల్ మీడియా గ్రూపుల్లో ఖలిస్థానీ సంస్థల సభ్యులు చొరబడ్డారని, ఖలిస్థానీ మద్దతుదారులను రెచ్చగొట్టడానికి వీరు చాట్‌లు, సందేశాలను ఉపయోగిస్తున్నారని ఓ అధికారి వివరించారు. ఖలిస్థాన్‌కు మద్దతివ్వాలని, లేకుంటే కెనడా నుంచి వెంటనే వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ భారతీయులను బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కెనడాలో నివసిస్తున్న చాలామంది భారతీయులు ఇప్పటికే తమ ఆస్తులను అమ్ముకోవడం ప్రారంభించారు. వారంతా స్వదేశానికి తిరిగి రావాలని యోచిస్తున్నారు. ఈ ఏడాది చివరికి పరిస్థితి మరింత తీవ్రమవుతుందని, కెనడాలో నివసిస్తున్న భారతీయులకు మరింత ప్రమాదకరంగా మారుతుందని భారత నిఘా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఎన్‌డీపీకి ఖలిస్థాన్ విరాళాలు

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మాజీ మిత్రుడు జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని న్యూ డెమొక్రటిక్ పార్టీ (ఎన్‌డీపీ)కి ఖలిస్థానీ ఉగ్రవాదుల నుంచి నిధులు సమకూరాయని తెలిపోయింది. కెనడాలో హత్యకు గురైన ఖలిస్థానీ తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ 2014 నుంచి 2019 వరకూ ఎన్‌డీపీకి విరాళాలు ఇచ్చినట్లు రుజువు చేసే కీలక పత్రాలు వెలుగులోకి వచ్చాయి. అదేవిధంగా ఖలిస్థానీ ఉగ్రవాదులు మో దలివాల్, తేహల్ సింగ్, భగత్ బ్రార్, మల్కీత్ సింగ్, దులాయ్ తదితరులు కూడా ఎన్‌డీపీకి విరాళాలు ఇచ్చినట్లు వెల్లడైంది. కాగా, భారత కాన్సులేట్ ఆధ్వర్యంలో బ్రాంప్టన్‌లోని త్రివేణి మందిరంలో ఈ నెల 17న నిర్వహించాల్సిన లైఫ్ సర్టిఫికెట్ల జారీ కార్యక్రమం రద్దయింది. అత్యంత హింసాత్మక నిరసనలు జరిగే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆలయ వర్గాలు మంగళవారం ప్రకటించాయి.

కెనడా వీసా నిబంధనలు కఠినతరం

- బహుళ ప్రవేశ వీసా జారీకి కొత్త నిబంధనలు విడుదల

కెనడా ప్రభుత్వం బహుళ ప్రవేశ వీసాల జారీ నిబంధనలను కట్టుదిట్టం చేసింది. ఆ మేరకు కొత్త నిబంధనలను మంగళవారం విడుదల చేసింది. సింగిల్ ఎంట్రీ వీసా పొందిన వ్యక్తులు ఆ వీసాతో ఒక్కసారి మాత్రమే కెనడాలోకి ప్రవేశించగలరు. బహుళ ప్రవేశ వీసా పొందిన వ్యక్తులు అది చెల్లుబాటయ్యే గడువు వరకు ఎన్నిసార్లు అయినా కెనడాకు రావొచ్చు. తాజా నిబంధనల ప్రకారం.. గరిష్ఠ కాలానికి జారీ చేసిన బహుళ ప్రవేశ వీసాలను ఇకపై ప్రామాణిక పత్రంగా పరిగణించబోరు. ఏదేని వ్యక్తికి వీసాను సింగిల్ ఎంట్రీకి జారీ చేయాలా? లేక బహుళ ఎంట్రీకి జారీ చేయాలా? అనేది ఇకపై కెనడా ఇమ్మిగ్రేషన్ విభాగం ఐఆర్‌సీసీ నిర్ణయిస్తుంది. వీసా చెల్లుబాటు గడువును కూడా ఐఆర్‌సీసీనే నిర్ణయిస్తుంది. బహుళ ప్రవేశ వీసాలు గరిష్ఠంగా పదేళ్ల వరకు లేదా ట్రావెల్ డాక్యుమెంట్, బయోమెట్రిక్‌ల చెల్లుబాటు గడువు ముగిసే వరకు(ఏది ముందు అయితే అదే) చెల్లుబాటు అవుతాయి. గరిష్ఠంగా ఎంతకాలానికి బహుళ ప్రవేశ వీసాను జారీ చేయాలనేది అధికారులే నిర్ణయిస్తారు. ఏ కారణంతో కెనడాకు వస్తున్నారు? వారి ఆరోగ్య పరిస్థితి, కెనడాలో నివసించే కాలానికి అయ్యే వ్యయానికి సరిపడా నిధులు ఉన్నాయా? తదితర కారణాలను పరిశీలించి సింగిల్ ఎంట్రీ వీసా ఇవ్వాలా? లేక బహుళ ఎంట్రీ వీసా ఇవ్వాలా? అనేది నిర్ణయిస్తారు.

బలికోరుతున్న రోడ్లు

10 ఏళ్లలో 15.3 లక్షల మంది మృతి

న్యూఢిల్లీ, నవంబరు 12: దేశంలో రహదారులు బలికోరుతున్నాయి..! రహదారులు.. వనరులు అభివృద్ధి చెందుతున్నా.. ఏటా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయే తప్ప.. తగ్గడం లేదు. చట్టాలు కఠినంగా లేకపోవడం.. జరిమానాలు సాధారణంగా ఉండడంతో నిర్లక్ష్య డ్రైవింగ్, రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడడం లేదని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. 2014-23 మధ్యకాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య 15.3 లక్షలుగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. రోడ్లు, వనరులను ప్రభుత్వాలు అభివృద్ధి చేస్తున్నా.. డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగానే ఘోర ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2012లో దేశవ్యాప్తంగా 48.6 లక్షల కిలోమీటర్ల మేర రోడ్లు ఉండగా.. 2019 కల్లా.. 63.3 లక్షల కిలోమీటర్లకు పెరిగాయి. అదే సమయంలో.. 2012లో 15.9 కోట్లుగా ఉన్న వాహనాలు.. 2024 అక్టోబరు కల్లా.. 38.3 కోట్లకు చేరుకున్నాయి. వాహనాలు రెండింతల కంటే ఎక్కువ పెరిగినా.. అందుకు తగ్గట్లు వనరులు అభివృద్ధి కావట్లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బుల్డోజర్ న్యాయంపై నేడు తీర్పు

న్యూఢిల్లీ, నవంబరు 12: నిబంధనలకు విరుద్ధంగా ఒక్క ఇల్లును కూల్చివేసినా అది రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొన్న సుప్రీంకోర్టు 'బుల్డోజర్ న్యాయం'పై బుధవారం తీర్పు వెలువరించనుంది. ఇలాంటి సందర్భాల్లో వ్యవహరించాల్సిన విషయమై దేశం మొత్తానికి వర్తించే విధంగా మార్గదర్శకాలను సూచించనుంది. నేరాల్లో ప్రమేయం ఉందన్న నెపంతో రాష్ట్ర ప్రభుత్వాలు పలువురి ఇళ్లను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం తుది తీర్పు ఇవ్వనుంది.

కాంట్రాక్టు పనుల్లో ముస్లింలకు

4శాతం రిజర్వేషన్

- ప్రతిపాదన మాత్రమే: కర్ణాటక సీఎంవో

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పనుల్లో ముస్లింలకు 4% రిజర్వేషన్ కల్పించాలనే ప్రతిపాదన కర్ణాటకలో వివాదాస్పదమవుతోంది. ఇప్పటికే వక్ఫ్ భూముల అంశం ప్రభుత్వానికి తీరని చెడ్డపేరు వచ్చింది. మూడు నాలుగు తరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని వక్ఫ్‌కు చెందినదంటూ రైతులకు నోటీసులు ఇవ్వడంతో రాష్ట్రమంతటా ఆందోళనకు కారణమైంది. తాజాగా కాంట్రాక్టు పనుల్లో నాలుగుశాతం రిజర్వేషన్ ముస్లింలకు కేటాయించాలనే ప్రతిపాదన చర్చనీయాంశమైంది. ఈ అంశంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం 24శాతం రిజర్వేషన్ ఉంది. కేటగిరీ -1 కింద ఓబీసీలకు 4శాతం, కేటగిరీ-2ఏ కింద 15శాతం ఇలా మొత్తం 43 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. ముస్లింలకు 4శాతం కల్పిస్తే.. 47శాతానికి పెరుగుతుంది. శాసనసభ శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. అయితే, ప్రస్తుతానికి ఇది ప్రతిపాదన మాత్రమేనని, ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సీఎం కార్యాలయం(సీఎంవో) స్పష్టం చేసింది.

వక్ఫ్ ఆస్తులు పెరిగితే దేశానికి ముప్పు

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తులు గడిచిన పదేళ్లలో 30 శాతం పెరిగాయని, ఇదే తరహాలో కొనసాగితే దేశ వ్యతిరేక శక్తులు కుమ్మక్కవుతాయని, దేశానికి పెనుప్రమాదం తలెత్తవచ్చని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. దావణగెరెలో మంత్రి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, వక్ఫ్ ఆస్తులను ముస్లిం సమాజం వినియోగం కోసం కేటాయిస్తారని అన్నారు. అక్కడ ఎటువంటి వ్యవహారాలు జరుగుతాయనేది విడమరచి చెప్పాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ప్రత్యేక హోదా కల్పించినందుకు కశ్మీర్ ఉగ్రవాదుల కేంద్రంగా మారలేదా అని ప్రశ్నించారు.

ఆ వినాశనం మీకే తెలుసు ఖర్గే!

- మీ గ్రామాన్ని రజాకార్లు కాల్చేశారు
- మీ తల్లిని, సోదరిని చంపేశారు
- అయినా,ముస్లిం ఓట్లు పోతాయన్న భయంతో మీరెక్కడా ప్రస్తావించరు
- కాంగ్రెస్ అధ్యక్షుడిపై యోగి విమర్శలు



ముంబై, నవంబరు 12 : రజాకార్లు తన గ్రామాన్ని కాల్చివేసి, తల్లిని, సోదరిని హత్యచేసిన విషయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎలా విస్మరిస్తారని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రశ్నించారు. బుజ్జగింపు రాజకీయాల కోసం ఖర్గే తన బాల్యంలో జరిగిన ఈ విషాదాన్ని మరిచిపోతున్నారని విమర్శించారు. మహారాష్ట్రలోని అచల్‌పూర్‌లోని ఎన్నికల ప్రచారంలో మంగళవారం ఖర్గేపై యోగి పెద్దఎత్తున విమర్శల దాడి చేశారు. భారత యూనియన్‌లో చేరడానికి నిరాకరించి హైదరాబాద్ సంస్థానం తిరుగుబాటు చేయగా, సంస్థానం, నిజాం తరఫున రజాకార్లు పోరాడారు. అప్పట్లో హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్న కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. 1948లో జరిగిన ఈ ఘర్షణల్లో బీదర్ ప్రాంతంలోని ఖర్గే గ్రామం రజాకార్ల దాడికి గురైంది. ఇటీవల ఎన్నికల సభలో ఖర్గే మాట్లాడుతూ.. కొందరు ఒకవైపు కాషాయ దుస్తులు ధరిస్తూనే, మరోవైపు 'విడిపోతే మన దేహాలు ముక్కలవుతాయి' అంటూ విద్వేష వ్యాఖ్యలు చేస్తుంటారంటూ యోగిపై ధ్వజమెత్తారు. "కొందరు కాషాయ దుస్తులు ధరిస్తారు. జుట్టు లేని నున్నటి తలతో ఉంటారు. సాధువుల వేషంలో ఉంటారు. కానీ, వాళ్లు రాజకీయ నాయకులు, ముఖ్యమంత్రులు కూడా అవుతారు. నిజమైన యోగి రాజకీయాలకు దూరంగా ఉంటాడు" అని ఖర్గే వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన యోగి.. నిజాం కాలం నాటి విషయాలను తన ఎన్నికల ప్రసంగంలో గుర్తుచేస్తూ.. ఖర్గేపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. విడిపోవడం ఎంత భయానకమో..వాళ్లు (రజాకార్లు) ఎన్ని అకృత్యాలకు పొడిగడతారనేందుకు ఖర్గే బాల్యంలో చోటు చేసుకున్న విషాదమే నిదర్శనమని యోగి అన్నారు. కానీ, ముస్లిముల ఓట్లు పోతాయనే భయంతో అప్పటి విషయాలూ, దేశం కోసం తన కుటుంబం చేసిన త్యాగం గురించి ఖర్గే ఎక్కడా ప్రస్తావించరని దుయ్యబట్టారు. తనపై కాకుండా.. ఖర్గే తన గ్రామాన్ని, కుటుంబాన్ని, హిందువులను తగలబెట్టిన రజాకార్లపై ఆగ్రహించాలన్నారు. కాగా, మహా వికాస్ అఘాడి అధికారంలో ఉండగా.. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌కు అడ్డాగా మహారాష్ట్రగా మారిందని యోగి అన్నారు. .

హిందువులు ఏకం కావాలి

శాఖాపరంగా ఎన్ని తేడాలు ఉన్నప్పటికీ హిందువులంతా ఏకం కావాల్సిందేనని జగద్గురు రామభద్రాచార్య అన్నారు. 'విడిపోతే మన దేహాలు ముక్కలవుతాయి' అంటూ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ చేసిన వ్యాఖ్యలను తాను సమర్థిస్తానన్నారు. 'యోగి చెప్పింది వాస్తవమే. మనమెన్నటికీ విడిపోరాదు. మనం ఒక్కటిగా ఉంటే ఎవరూ మనకు హాని తలపెట్టలేరు' అని వ్యాఖ్యానించారు.

నేడే వయనాడ్ ఉప ఎన్నిక

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నిక బుధవారం జరుగనుంది. ఇక్కడ మొత్తం 16 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ ప్రియాంకా గాంధీ, లెఫ్ట్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్)కు చెందిన సీపీఐ అభ్యర్థి సత్యన్ మొకేరీ, బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ మధ్యే నెలకొంది. ఎన్నికల్లో ప్రియాంకకు అనుభవం లేకపోవడం తమకు కలిసి వస్తుందని ఈ ఇద్దరూ భావిస్తున్నారు. సత్యన్ 2014లో ఇక్కడి నుంచి పోటీచేసి కాంగ్రెస్ మెజారిటీని 20 వేలకు తగ్గించారు. 2019లో 4.3 లక్షలకు పైగా మెజారిటీతో గెలిచిన రాహుల్‌కు.. 2024 ఎన్నికల్లో 3.6 లక్షల ఓట్ల ఆధిక్యం మాత్రమే వచ్చింది. 2019లో ఇక్కడ మొదటిసారి గెలిచిన రాహుల్.. నియోజకవర్గానికి అడపాదడపా మాత్రమే వస్తుండేవారు. ఆయన ప్రధాని అవుతారన్న ఉద్దేశంతోనే నియోజకవర్గ ప్రజలు మొన్నటి ఎన్నికల్లో భారీ ఆధిక్యంతో గెలిపించారని.. కానీ ఆయన ఈ సీటుకు రాజీనామా చేశారని.. రాజకీయానుభవం లేని ప్రియాంక కూడా గెలిస్తే కనిపించరని సీపీఐ, బీజేపీ అభ్యర్థులు ప్రచారం చేశారు. అయితే తాను 1989 నుంచి రాజకీయంగా క్రియాశీలంగా ఉన్నానని.. అప్పట్లో తన తండ్రి తరఫున ప్రచారం కూడా చేశానని ప్రియాంక చెప్పుకొన్నారు.



బాబు.. పవర్‌ఫుల్ సీఎం!

అత్యంత శక్తిమంతులైన టాప్ టెన్ నేతల్లో ఐదో స్థానం

'ఇండియా టుడే' కథనం.. మొదటి 4 ర్యాంకుల్లో మోదీ, భాగవత్, షా, రాహుల్

ఫీనిక్స్ పక్షిలా చంద్రబాబు పునర్జన్మ.. మీడియా సంస్థ కితాబు

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబును అత్యంత శక్తిమంతుడైన ముఖ్యమంత్రిగా జాతీయ మీడియా సంస్థ 'ఇండియాటుడే' అభివర్ణించింది. దేశవ్యాప్తంగా శక్తిసంపన్నులైన వ్యక్తుల్లో ఆయన ఐదో స్థానంలో ఉన్నట్లు తెలిపింది. ఆయనకు ముందు తొలి నాలుగు స్థానాల్లో ప్రధాని మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ అగ్రనేత-లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఉండగా.. ఆయన తర్వాత బిహార్, యూపీ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ సీఎంలు నితీశ్‌కుమార్, యోగి ఆదిత్యనాథ్, ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ అధ్యక్షుడు, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. జనసేన, బీజేపీతో పొత్తుతో.. టీడీపీని పతనావస్థ నుంచి విజయతీరానికి చేర్చారని మంగళవారం నాటి ప్రత్యేక కథనంలో ఆకాశానికెత్తింది. జైలుకెళ్లడం ద్వారా రాజకీయంగా అనిశ్చిత పరిస్థితి నుంచి ఫీనిక్స్ పక్షిలా పునర్జన్మ ఎత్తి.. అధికారం చేజిక్కించుకున్నారని, భారతీయ రాజకీయాల్లో కీలక నేతగా మారారని వెల్లడించింది. ఇవాళ చంద్రబాబు భారత్‌లోనే అత్యంత సీనియర్ ముఖ్యమంత్రి అని పేర్కొంది. హాలీవుడ్ థ్రిల్లర్ సినిమాల్లో మాత్రమే ఇలాంటి చరిత్రాత్మక పునరాగమనాలు చూస్తామని, అయితే చంద్రబాబు వాస్తవంగా చేసి చూపించారని వ్యాఖ్యానించింది. 'లోక్‌సభలో టీడీపీకి ఉన్న 16 మంది ఎంపీలను మినహాయిస్తే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రమాదకర పరిస్థితుల్లో పడిపోతుంది. మెజారిటీ మార్కుకు దూరమవుతుంది. దీంతో పాలక ఎన్‌డీఏలో చంద్రబాబు పట్టు పెరిగింది. నాలుగోసారి సీఎం అయిన ఆయన.. తన చిరకాల స్వప్నమైన స్వర్ణాంధ్ర సాధన, రాజధాని అమరావతి నిర్మాణం లక్ష్యాలను చేరుకునే అవకాశం ఉంది. కార్పొరేట్లకు మిత్రుడిగా ఉండే చంద్రబాబు.. ఉమ్మడి రాష్ట్రానికి రెండోసారి సీఎం అయినప్పుడు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఏర్పాటుకు చొరవ చూపారు. ఇటీవల విజన్-2047 డాక్యుమెంట్ ఆవిష్కరించారు. 15 శాతం వృద్ధి రేటుతో 2047కల్లా ఆంధ్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్లకు, తలసరి ఆదాయాన్ని 43 వేల డాలర్లకు తీసుకెళ్లడం ఆయన లక్ష్యం. ప్రజల భాగస్వామ్యం ఉండే వ్యూహాన్ని అభివృద్ధి చేసే విజన్ కావాలని ఆయన ఎప్పుడూ అంటుంటారు' అని పేర్కొంది.

ఏపీలో రిలయన్స్ భారీ పెట్టుబడి!

- 65 వేల కోట్లతో 500 బయోగ్యాస్ ప్లాంట్లు
- చంద్రబాబు సమక్షంలో అవగాహన ఒప్పందం

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మూడేళ్లలో కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్రాజెక్టుల్లో రూ.65 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ సంస్థ రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. మంగళవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో ఇంధన శాఖ అధికారులు, రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ ప్రతినిధులు అవగాహనా ఒప్పందా(ఎంవోయూ)లు కుదుర్చుకున్నారు. 8 జిల్లాల్లో ఒక్కొక్కటీ రూ.130 కోట్ల విలువతో 500 సీబీజీ ప్లాంట్లను రిలయన్స్ నెలకొల్పుతుంది. వీటిని మూడేళ్లలో స్థాపించి రెండున్నర లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ పేర్కొనడాన్ని చంద్రబాబు స్వాగతించారు. రిలయన్స్‌తో ఒప్పందం చరిత్రాత్మకమన్నారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు క్లీన్ ఎనర్జీ-2024 పాలసీ తీసుకొచ్చామని గుర్తుచేశారు. ఏపీలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు స్పీడ్ ఆఫ్ బిజినెస్ విధానం అమలు చేస్తున్నామని.. పారిశ్రామిక సంస్థలు స్పీడ్ ఆఫ్ ఎగ్జిక్యూషన్ విధానం అమలు చేయాలని సూచించారు. ఈ విధంగా ప్రభుత్వం, పెట్టుబడిదారులు సమాంతరంగా పరుగులు తీస్తే.. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్న తమ ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. 'ప్రభుత్వం పెట్టుబడుల రంగంలో తీసుకొచ్చిన నూతన విధానాలు సత్ఫలితాలిస్తున్నాయి. రూ.65 వేల కోట్లతో సీబీజీ ప్లాంట్లు స్థాపిస్తే రాష్ట్రానికి రూ.57,650 కోట్ల ఆదాయం లభిస్తుంది. రెండున్నర లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. రాష్ట్రప్రభుత్వం తరఫున ఘన వ్యర్థాలను ఈ ప్లాంట్లకు ఇస్తాం. వాటి ద్వారా కూడా గ్యాస్ ఉత్పత్తి చేయండి' అని రిలయన్స్‌కు సీఎం సూచించారు. క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 ద్వారా రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు.. ఏడున్నర లక్షల మందికి ఉద్యోగాల కల్పనను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 'ఇంటికో పారిశ్రామికవేత్త' విధానాన్ని తాము అమలు చేస్తున్నామని వెల్లడించారు.

2 వేల ప్లాంట్లలో నాలుగో వంతు మనకే: లోకేశ్

రిలయన్స్‌తో ఒప్పందంపై ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తంచేశారు. తాము నిర్దేశించుకున్న 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ఇది దోహదపడుతుందన్నారు. కొద్దిరోజుల కిందట ముంబైలో రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ, రిలయన్స్ క్లీన్ ఎనర్జీకి సారథ్యం వహిస్తున్న అనంత్ అంబానీతో జరిపిన చర్చల్లో వచ్చిన ప్రతిపాదనలపై ప్రభుత్వం ఇప్పుడు ఒప్పందం చేసుకుందన్నారు. దేశవ్యాప్తంగా 2 వేల సీబీజీ ప్లాంట్లను పెట్టాలని రిలయన్స్ లక్ష్యంగా పెట్టుకుందని.. వాటిలో నాలుగో వంతు.. అంటే 500 ప్లాంట్లను మన రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సంతోషంగా ఉందని తెలిపారు.

నీటి తరలింపు ఆపండి!



» శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో విద్యుదుత్పత్తి నిలిపివేయండి

» తెలంగాణ, ఏపీలకు కేఆర్ఎంబీ లేఖ

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోతిరెడ్డిపాడు ద్వారా జరుపుతున్న నీటి తరలింపును తక్షణం నిలిపివేయాలని, శ్రీశైలం కుడి, ఎడమ వైపుల నిర్వహిస్తున్న జలవిద్యుత్ ఉత్పత్తిని ఆపివేయాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆదేశించింది. జల విద్యుదుత్పత్తి కోసం నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాల్వల నుంచి జరుపుతున్న నీటి తరలింపును ఆపాలని పేర్కొంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ఆగిపోయినా.. నీటి తరలింపు, జల విద్యుదుత్పత్తిని కొనసాగిస్తుండటంతో జలాశయాల్లో నీటి నిల్వలు శరవేగంగా అడుగంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి, తెలంగాణ నీటి పారుదల శాఖ కార్యదర్శికి కేఆర్ఎంబీ సభ్యుడు డాక్టర్ ఆర్.ఎన్.శంఖువ మంగళవారం లేఖ రాశారు. ఈ విషయంపై ఇది వరకే ఆయన ఒక లేఖ రాయగా.. ఇది రెండోది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని షెడ్యూల్-11 ప్రకారం ఉమ్మడి జలాశయాల్లో జలవిద్యుత్‌కు అత్యల్ప ప్రాధాన్యం ఇచ్చారని తాజా లేఖలో ఆయన గుర్తు చేశారు. రానున్న వర్షాకాలం దాకా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నీటి నిల్వలను సాగు, తాగు అవసరాల కోసం సంరక్షించాలని సూచించారు.

46 టీఎంసీల తరలింపు

శ్రీశైలం రిజర్వాయరు పూర్తి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం 169.87 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. 46 టీఎంసీల నీటిని తెలుగు రాష్ట్రాలు పోటీ పడి తరలించడంతో జలాశయంలో నిల్వలు శరవేగంగా తగ్గుతున్నాయి. ఇక పోతిరెడ్డిపాడు నుంచి 15 వేల క్యూసెక్కుల నీటిని తరలించగా.. రెండు జల విద్యుత్ కేంద్రాలతో 25,940 క్యూసెక్కులను దిగువకు తరలించారు. నాగార్జునసాగర్‌కు 17,593 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. కుడి, ఎడమ కాల్వల ద్వారా తరలిస్తున్నారు. శ్రీశైలంలో వదిలే నీటిని నిల్వ చేసుకునే పరిస్థితి సాగర్‌లో లేదు. దాంతో అనివార్యంగా బయటికి తరలించాల్సిన పరిస్థితి.

6 నెలల పాటు కనీస నిల్వలు తప్పనిసరి

వచ్చే ఏడాది జూలై లేదా ఆగస్టులో కృష్ణా బేసిన్‌కు వరదలు వస్తాయి. అప్పటి వరకూ కనీసం 6 నెలల పాటు శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలను కాపాడుకోవాల్సి ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల తాగునీటి అవసరాలకు శ్రీశైలం ప్రాజెక్టే పెద్ద దిక్కు. రాయలసీమతో పాటు చెన్నయ్ తాగునీటి అవసరాలకూ ఈ ప్రాజెక్టు కీలకం. ఈసారి వానాకాలం సీజన్ ఇప్పటికే పూర్తయింది. కొత్తగా వరదలు వచ్చే అవకాశమే లేదు. అయినప్పటికీ తెలంగాణ, ఏపీ పోటాపోటీగా వ్యవహరిస్తున్నాయి.

చిన్న తప్పులకే మా ఉద్యోగాలు తీసేశారు

» మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

» సీఎంకు ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికుల వినతి

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిన్న తప్పులకే తమను ఉద్యోగం నుంచి తొలగించారని, సీఎం రేవంత్ కల్పించుకుని తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని టీజీఎస్ ఆర్టీసీలో ఉద్యోగాలు కోల్పోయిన ఉద్యోగులు, కార్మికులు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో చిన్న కారణాలతో ఉద్యోగం కోల్పోయిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 90 డిపోల్లో సుమారు 450 మందికిపైగా ఆర్టీసీ కార్మికులు చిన్న తప్పులకే ఉద్యోగం కోల్పోయారని వారి కుటుంబాల నేపథ్యాలను దృష్టిలో పెట్టుకొని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వారంతా ఆత్మహత్యలు చేసుకోకముందే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, సీఎం రేవంత్ తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని విన్నవించారు. కార్మికుల సమస్యలు పట్టని సంస్థ ఎండీ సజ్జనార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

నలుగురు మహిళలను ఢీకొట్టిన కారు

» ఇద్దరి మృతి.. ఒకరి పరిస్థితి విషమం.. పెద్దపల్లిలో ఘటన

» మానుకోట జిల్లాలో ప్రమాదం.. తల్లీ కుమారుడి మృతి

పెద్దపల్లిటౌన్/పెద్దవంగర, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న నలుగురు మహిళలను కారు ఢీకొట్టడంతో ఇద్దరు చనిపోయారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పెద్దపల్లిలోని ఉదయ్‌నగర్‌కు చెందిన కుక్క భాగ్యలక్ష్మి, కుక్క అమృత, కుక్క పద్మ, కుక్క కాంతమ్మ సమీప బంధువులు. వీరంతా సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పనికి వెళ్లారు. పని అయిపోయాక మంగళవారం తెల్లవారుజామున ఇంటికి వెళ్లేందుకు బయలుదేరారు. ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న రాజీవ్ రహదారిని దాటుతుండగా కరీంనగర్ వైపు నుంచి వస్తున్న కారు మహిళలను ఢీకొట్టింది. దీంతో భాగ్యమ్మ(50), అమృత(49) అక్కడికక్కడే మృతిచెందారు. పద్మ పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ తరలించారు. మహబూబాబాద్ జిలా పెద్దవంగర మండలం అమర్‌సింగ్ తండాకు చెందిన జాటోతు శాంతమ్మ(63), వెంకన్న(48) మంగళవారం బంధువుల అంత్యక్రియలకు వెళ్లి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి శివారులో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తల్లీ కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు.



భాగ్యమ్మ, అమృత (ఫైల్)

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ చేతివాటం

» ప్రయాణికురాలి బ్యాగు నుంచి బంగారం అపహరణ

» వీడియో తీసిన ప్రయాణికుడు

» విధుల నుంచి తొలగించిన అధికారులు

సుభాష్‌నగర్(నిజామాబాద్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ తన చేతివాటాన్ని ప్రదర్శించాడు. ప్రయాణికురాలి బ్యాగులో నుంచి బంగారం ఉన్న బాక్సును దొంగిలించి ప్రయాణికులకు దొరికిపోయాడు. నిజామాబాద్‌కు చెందిన రామ్మోహన్‌రెడ్డి నిజామాబాద్ ఆర్టీసీ - 1 డిపోలో అద్దె బస్సు డ్రైవర్‌గా కొంతకాలంగా పని చేస్తున్నాడు. గత ఆదివారం నిజామాబాద్ -1 డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి నిజామాబాద్‌కు బయలుదేరింది. మార్గం మధ్యలో కరీంనగర్ వద్ద ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో.. ముగ్గురు మహిళా ప్రయాణికులను డ్రైవర్ బ్యానెట్ మీద కూర్చోబెట్టాడు. ఓ మహిళా ప్రయాణికురాలు తన బ్యాగును డ్రైవర్ పక్కన పెట్టడంతో.. రామ్మోహన్‌రెడ్డి ఒక చేత్తో డ్రైవింగ్ చేస్తూ.. మరో చేత్తో బ్యాగులో ఉన్న సంచిని బయటకు తీసి జేబులో పెట్టుకున్నాడు. దీన్నంతా బస్సులో ప్రయాణిస్తున్న మరో ప్రయాణికుడు వీడియో తీశాడు. అది గమనించని డ్రైవర్ తనకేమీ తెలియదని బుకాయించాడు. దీంతో ఆ ప్రయాణికుడు వీడియోను చూపించడంతో.. తనను క్షమించాలని ప్రయాణికులను వేడుకున్నాడు. ఈ విషయమై ఆర్టీసీ ఉన్నతాధికారులు రామ్మోహన్‌రెడ్డిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ మంగళవారం నిర్ణయం తీసుకున్నారు.



డ్రైవర్ రామ్మోహన్ రెడ్డి, బ్యాగు నుంచి సంచిని తస్కరిస్తున్న దృశ్యం

19,800 కోట్లకు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఆయకట్టుకు, 3,45,534 ఆయకట్టును స్థిరీకరించడానికి వీలుగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాజెక్టులో కీలకమైన మూడు పంప్‌హౌస్‌లను ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి పలువురు మంత్రులతో కలిసి ప్రారంభించిన విషయం విదితమే. అయితే ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కింద శరవేగంగా నీటిని అందించడానికి వీలుగా పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును 16 ప్యాకేజీలుగా విడగొట్టింది. ప్రధాన కాలువను 1 నుంచి 8 ప్యాకేజీలుగా, సత్తుపల్లి ట్రంక్‌ను 9, 10, 11,12 ప్యాకేజీలుగా, పాలేరు లింక్ కెనాల్‌ను 13, 14, 15, 16 ప్యాకేజీలుగా వర్గీకరించారు. ఇక డిస్ట్రిబ్యూటరీలను 8 ప్యాకేజీలుగా విభజించి.. దీనికి రూ.3,858.93 కోట్లు అవసరమని అంచనా వేశారు. అయితే, మంత్రులు ఆదేశించారనే కారణంతో కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్ రూ.1,842 కోట్ల పనులకు టెండర్లు పిలవగా.. అందులో రూ.768కోట్లకే పరిపాలన అనుమతి తీసుకోవడం కలకలం రేపింది. ఇది రాజకీయ వివాదానికి దారితీసింది. దీంతో, కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్ సీతారామ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సవరిస్తూ పరిపాలనాపరమైన అనుమతుల కోసం ప్రభుత్వానికి సమర్పించారు.

ఎక్సైజ్ సిబ్బందిపై సారా తయారీదారుల దాడి

» ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లకు స్వల్ప గాయాలు

చందంపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సారా తయారీదారుల దాడిలో ముగ్గురు ఎక్సైజ్ సిబ్బందికి గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా చందంపేట మండలం గువ్వలగుట్టలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన రమావత్ హనుమ ఇంట్లో సారా తయారుచేస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ సిబ్బంది ఉదయం తనిఖీకి వెళ్లారు. వారిపై హనుమ కుటుంబ సభ్యులు, కొందరు గ్రామస్తులు దాడి చేశారు. ఈ దాడిలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ హారిక, కానిస్టేబుళ్లు రమాదేవి, ప్రవీణ్ రెడ్డికి స్వల గాయాలయ్యాయి. దాడిలో జీపు అద్దం ధ్వంసమైంది. మధ్యాహ్నం ఎక్సైజ్ అధికారులు, పోలీసుల సాయంతో హనుమను అరెస్ట్ చేశారు. 1,140 కిలోల నల్లబెల్లం, 40 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. తమ సిబ్బందిపై దాడిపై దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

విదేశాలకు తెలంగాణ బియ్యం!

దిగుమతుల మీద ఆధారపడే దేశాలపై రాష్ట్ర సర్కారు నజర్.. ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేసే యోచన

» బంగ్లాదేశ్‌లో వరదల ప్రభావంతో తగ్గిపోయిన బియ్యం ఉత్పత్తి

» అక్కడి ప్రభుత్వాల నుంచి డిమాండ్ లేఖలు తెప్పించేలా కసరత్తు

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయటానికి కేవలం భారత ఆహార సంస్థపైన, రైస్ మిల్లర్లపైనే ఆధారపడకుండా.. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. విదేశాలకు మన బియ్యాన్ని ఎగుమతి చేసే కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది. బియ్యం కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడే మలేషియా, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా దేశాలతోపాటు.. భారీవర్షాలు, వరదల ప్రభావంతో వరి పంట దెబ్బతిన్న బంగ్లాదేశ్‌పైనా సర్కారు దృష్టిసారించింది. కేంద్రం అనుమతి తీసుకుని, ఆయా దేశాలకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నుంచే నేరుగా బియ్యం ఎగుమతి చేయాలనే ప్రాథమిక నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు కోటిన్నర టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోంది. ఇంత భారీ ఎత్తున ఉత్పత్తి అయ్యే ధాన్యాన్ని రాష్ట్రంలో నిల్వచేయడం సాధ్యం కాదు. రాష్ట్ర ప్రజల ఆహార అవసరాలు పోగా మిగిలిన బియ్యంలో ఎంత వీలైతే అంత.. బయటకు పంపించాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా.. రైస్ మిల్లర్లకు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) అప్పగించడానికి బ్యాంకు గ్యారెంటీని తప్పనిసరి చేస్తూ సర్కారు ఈ ఖరీఫ్‌లో కొత్తగా ధాన్యం సేకరణ పాలసీని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై రైస్‌మిల్లర్లు విముఖత వ్యక్తంచేస్తున్నారు.



కష్టమేమీ కాదు...

మధ్యంతర గోదాములకు 30 లక్షల టన్నులు, అంతకంటే తక్కువ వచ్చినా.. మిల్లింగ్ చేయించాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. రైస్ మిల్లర్ల అంచనా ప్రకారం మధ్యంతర గోదాములకు 10-15 లక్షల టన్నుల దాకా ధాన్యం వచ్చే అవకాశాలున్నాయి. ఇండోనేషియాలో బియ్యం డిమాండ్ 20 లక్షల మెట్రిక్ టన్నులు, ఫిలిప్పీన్స్‌లో 30 లక్షల టన్నులు, మలేషియాలో 5 లక్షల టన్నులుగా ఉందని.. జాతీయ బియ్యం ఎగుమతిదారుల సంఘం అధ్యక్షులు బీవీ కృష్ణారావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల 50 వేల మెట్రిక్ టన్నుల బియ్యానికి టెండర్లు పిలిచారని ఆయన వెల్లడించారు. తెలంగాణ నుంచి పలువురు రైస్‌మిల్లర్లు ఇప్పటికే విదేశాలకు బియ్యం ఎగుమతులు చేస్తున్నారు. ఇదే క్రమంలో పౌరసరఫరాల సంస్థ నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతి చేయాలనే ప్రతిపాదన వచ్చింది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉత్తమ్ ఇటీవల ఫిలిప్పీన్స్ అధికారులతో దీనిపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బియ్యం ఎంతకావాలో ఇండెంట్ పంపిస్తే.. తెలంగాణ నుంచి ఎగుమతి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర భారీ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రెండు రోజుల క్రితమే మలేషియాలో పర్యటించారు. అక్కడి బియ్యం దిగుమతిదారులతో సమావేశమై.. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే బియ్యం నాణ్యత గురించి వారికి వివరించారు. దీంతో మన బియ్యం దిగుమతి చేసుకోవడానికి వారు అంగీకారం తెలిపారు.

ధాన్యం మధ్యంతర గోదాములకు

రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రారంభమైనా.. ఇప్పటికీ కొందరు మిల్లర్లు ధాన్యం దించుకోవట్లేదు. దీంతో.. రైస్ మిల్లర్ల విషయంలో కఠినంగా వ్యవహరించాలని భావించిన సర్కారు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారించింది. రైస్ మిల్లర్లు మొండికేసిన చోట.. అక్కడి ధాన్యాన్ని మధ్యంతర గోదాములకు తరలించాలని నిర్ణయించింది. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో ఉన్న గోదాముల్లో 30 లక్షల మెట్రిక్ టన్నుల ఖాళీ జాగాను పౌరసరఫరాల సంస్థ అధీనంలోకి తీసుకుంది. ఇప్పటివరకూ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంలో.. అధిక భాగాన్ని ప్రభుత్వ గోదాములకే తరలించటం గమనార్హం. అయితే.. బ్యాంకు గ్యారెంటీ ఇచ్చి, ధాన్యం తీసుకొని, సకాలంలో మిల్లింగ్ చేసి బియ్యం సరఫరా చేసిన మిల్లర్లకు మళ్లీ కేటాయింపులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఒకవేళ నిల్వలు అలాగే ఉంటే.. ధాన్యాన్ని మిల్లింగ్ చేయించాలని నిర్ణయం తీసుకున్నారు.

స్నేహం నటించి.. చంపేస్తాడు!

» మెదక్ జిల్లా చిన్నశంకరంపేటలో సైకో కిల్లర్

» ఒంటరివాళ్లే లక్ష్యం.. 14 రోజుల్లో 2 హత్యలు

మెదక్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్నవారితో మాటలు కలుపుతాడు. స్నేహం పేరుతో పూటుగా మద్యం తాగించి బండారాయితో కొట్టి చంపుతాడు. తర్వాత దొరికిన వస్తువులు, డబ్బు తీసుకొని ఉడాయిస్తాడు. మెదక్ జిల్లాలో ఓ సైకో కిల్లర్ నైజమిది! ఇలా 14 రోజుల వ్యవధిలో ఇద్దరిని దారుణంగా హత్యచేసిన ఆ కిల్లర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు చిన్న శంకరంపేట మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఓట్టేల మల్లేశం అలియాస్ గొల్ల మల్లేశం. కేసు వివరాలను జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. మల్లేశానికి నేర చరిత్ర ఉంది. రైళ్లలో అటూ ఇటూ తిరుగుతూ దొంగతనాలు చేస్తూ రైల్వే ప్లాట్‌ఫాంపై పడుకుంటాడు. గతనెల 22న నిజామాబాద్‌లో లేబర్ అడ్డా వద్ద కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేటకు చెందిన నవీన్(24)తో స్నేహం నటించాడు. ఇద్దరూ చిన్నశంకరంపేట వైన్స్‌లో మద్యం తీసుకుని తాగారు. మద్యం మత్తులో ఉన్న నవీన్‌ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనక వైపు తీసుకెళ్లి బండరాయితో కొట్టి చంపాడు. ఈనెల 3న నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం కుర్నపల్లికి చెందిన కొమ్మే స్వామి(39)తో పరిచయం చేసుకొని మీర్జాపల్లి స్టేషన్‌కు తీసుకొచ్చాడు. మద్యం తాగించి చిన్నశంకరంపేటలో పద్మనాభస్వామి గుట్టవద్ద బండరాయితో కొట్టి దారుణంగా హతమార్చాడు. ఈ రెండు హత్యలను పోలీసులు సవాలుగా తీసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం మల్లేశాన్ని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలు ఒప్పుకొన్నాడు. మల్లేశం 2013లో చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో పదేళ్లు జైలులో ఉన్నాడు. 2022లో జైలు నుంచి వచ్చాక హత్యలు చేసి, దొంగిలించిన నగదు, వస్తువులను సోదరుడు రమేశ్‌కు ఇచ్చేవాడని పోలీసులు తెలిపారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

హనుమకొండ ఆస్పత్రిలో ఎలుకల స్వైరవిహారం

» ఇబ్బంది పడుతున్న గర్భిణులు

వరంగల్ మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఎలుకల బెడద తీవ్రమవుతోంది. ఏ వార్డులో చూసినా మూషికాలు స్వైరవిహారం చేస్తుండటంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2022 మార్చిలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగిని ఎలుకలు కొరుకగా... తీవ్ర రక్తస్రావం జరిగి అతను ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ బదిలీకి కూడా కారణమైంది. అదేవిధంగా అక్కడి సీకేఎం ఆస్పత్రిలో మృతిచెందిన శిశువును ఎలుకలు కొరికిన ఘటన పెను దుమారం రేపింది. ఈ రెండు ఘటనలపై అప్పటి అధికారులు స్పందించి ఎలుకల నివారణకు చర్యలు తీసుకున్నారు. తాజాగా హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఎలుకల సంచారం ఎక్కువైంది. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తూ... అనేక క్రిటికల్ కేసులకు సైతం పురుడు పోసిన ఆస్పత్రికి ప్రస్తుతం గర్భిణులు వెళ్లాలంటే జంకుతున్నారు. రోగుల ఎదుటే ఎలుకలు మట్టిని తోడుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అందెశ్రీకి లోక్ నాయక్ పురస్కారం

» ఖాదర్ మొహియుద్దీన్‌కు కూడా...


విశాఖపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన ప్రముఖ కవి అందెశ్రీకి ఈ ఏడాది లోక్ నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారం ఇవ్వనున్నట్టు ఆ ఫౌండేషన్ ప్రకటించింది. గత 20 ఏళ్లుగా లోక్‌నాయక్ ఫౌండేషన్ తరఫున ఏటా జనవరి 18న అవార్డులు ఇస్తున్నారు. ఈ ఏడాది అందెశ్రీకి అవార్డుతో పాటు రూ.2 లక్షల నగదు, ప్రముఖ ముస్లిం కవి ఖాదర్ మొహియుద్దీన్‌కు సాహిత్య పురస్కారంతో పాటు రూ.లక్ష నగదు ఇస్తున్నామని తెలిపింది. వైద్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న గ్లోబల్ ఆస్పత్రి గ్రూపు చైర్మన్ డాక్టర్ హరనాథ్ పొలిచర్లకు జీవన సాఫల్య పురస్కారం ఇస్తున్నట్లు పేర్కొంది. నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల్లో యువతకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, సొంత కాళ్లపై నిలబడేలా చేస్తున్న స్వర్ణ భారతి ట్రస్ట్‌కు చెందిన దీపా వెంకట్‌కు సేవా పురస్కారంతో పాటు రూ.లక్ష నగదు, స్వచ్ఛ భారత్ నినాదాన్ని అందిపుచ్చుకొని కృష్ణా జిల్లా చల్లపల్లిలో పదేళ్లుగా శ్రమదానం చేస్తూ పారిశుధ్యం కోసం కృషి చేస్తున్న డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, పద్మావతి దంపతులకు సమాజసేవ పురస్కారం అందజేస్తున్నట్లు ఫౌండేషన్ పేర్కొంది.

వాణిజ్యం ఆకాశాన్ని తాకేలా!

కోకాపేటలో 50 అంతస్తుల కమర్షియల్ భవనం.. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దది

» హెచ్ఎండీఏకు ప్రముఖ నిర్మాణ సంస్థ దరఖాస్తు

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు పశ్చిమాన అతి పెద్ద కమర్షియల్(వాణిజ్య) భవనం రాబోతుంది. దక్షిణ భారతదేశంలోనే తొలిసారి 50 అంతస్తులతో ఓ వాణిజ్య భవనాన్ని నిర్మించేందుకు ప్రముఖ నిర్మాణ సంస్థ ముందుకొచ్చింది. కోకాపేట నియోపోలిస్ లేఅవుట్‌లో ఈ నిర్మాణం జరగనుంది. హైదరాబాద్ సహా దక్షిణ భారతదేశం మొత్తంలో 30 అంతస్తుల వాణిజ్య భవనాలే ఇప్పటిదాకా పెద్దవి. ఈ 50 అంతస్తుల భవన నిర్మాణం జరిగితే హైదరాబాద్ అరుదైన ఘనతను సొంతం చేసుకోనుంది. కోకాపేట, నానక్‌రాంగూడ, పుప్పాలగూడ, ఖాజాగూడ, నార్సింగి, నల్లగండ్ల, కొల్లూరు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో ఇప్పటికే అనేకబహుళ అంతస్తుల భవనాలు వస్తున్నాయి. ఐటీ కారిడార్‌లో ఆఫీస్ స్పేస్, నివాస సముదాయాలకు ఉన్న డిమాండ్ మేరకు నిర్మాణ సంస్థలు ఆయా ప్రాంతాల్లో ఆకాశహర్మ్యాలకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఐటీ కారిడార్‌లో 40 అంతస్తుల నుంచి 58 అంతస్తుల వరకు రెసిడెన్షియల్ భవన నిర్మాణాలు చేపడుతుండగా 50అంతస్తుల కమర్షియల్ భవనం రానుండడం విశేషం. కాగా, హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన కోకాపేట నియో పోలీస్ లేఅవుట్ బహుళ అంతస్తుల భవనాలకు కేంద్రంగా మారింది. ఇక్కడ ఎకరం రూ.100 కోట్లు పలికిన సంగతి తెలిసిందే. ఈ లేఅవుట్‌లో గ్రౌండ్ ప్లస్ 50 అంతస్తులతో రెండు రెసిడెన్షియల్ టవర్ల నిర్మాణ పనులను ఇప్పటికే ఓ నిర్మాణ సంస్థ ప్రారంభించింది. ఈ ప్రాజెక్టుకు సమీపంలోనే గ్రౌండ్ ప్లస్ 50 అంతస్తులతో కమర్షియల్ భవనాన్ని నిర్మించేందుకు ఓ నిర్మాణ సంస్థ హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసింది. మరో 20 రోజుల్లో ఈ సంస్థ బ్రోచర్ విడుదల చేసే అవకాశముంది.



పార్కింగ్‌కు 5 అంతస్తులు

కోకాపేట నియోపోలీస్ లేఅవుట్‌లో వచ్చే ఈ 50 అంతస్తుల భవనంలో 80శాతానికి పైగా ఓపెన్ స్పేస్ ఉండనుంది. ఇందులో వాహనాల పార్కింగ్ కోసం ఐదు అంతస్తుల మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తారు. గ్రౌండ్ నుంచి ఆరో అంతస్తు వరకు షాపింగ్ మాల్, ఆరో అంతస్తులో డైనింగ్ ఏరియా, సినిమా థియేటర్లు ఉండనున్నాయి. ఇక, 7నుంచి 29వ అంతస్తు వరకు వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు కేటాయించనుండగా.. బహుళ జాతి సంస్థ(ఎంఎన్‌సీ)లు తమ కార్యాలయాలను ఏర్పాటు చేస్తాయి. ఇక 30 నుంచి 50వ అంతస్తు వరకు ఇంటర్‌కాంటినెంటల్ హోటల్ నిర్మాణానికి రిజర్వు చేశారు.


సీలింగ్ ఫ్యాన్లకు యాంటీ సూసైడ్ రాడ్ !

» విద్యార్థి ఉరికి యత్నిస్తే స్ప్రింగ్ సాగి నేలకు

» బాసర ట్రిపుల్ ఐటీలో విషాదాలను ఇలా అరికట్టొచ్చు

» రెండేళ్లలో 9 ఆత్మహత్యలు.. 8 ఫ్యాన్‌కు ఉరేసుకున్నవే

బాసర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు అడ్డుకట్ట పడకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమవుతోందన్న విమర్శలున్నాయి. రెండేళ్లలో 9 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇటీవల స్వాతిప్రియ బలవన్మరణానికి పాల్పడింది. తొమ్మిది మందిలో 8 మంది సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. అయితే 'యాంటీ సూసైడ్ ఫ్యాన్ రాడ్'లను బిగించడం ద్వారా ఫ్యాన్‌కు ఉరివేసుకొనే ఘటనలను నివారించవచ్చునన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీలింగ్ ఫ్యాన్‌కు పై భాగంలో ఈ స్ప్రింగ్ రాడ్‌ను అమరుస్తారు. ఇది 20 కిలోల కంటే ఎక్కువ బరువు ఉన్న వస్తువును భరించదు. ఒకవేళ అంతకన్నా ఎక్కువ బరువును వేలాడదీస్తే ఆ స్ప్రింగు విస్తరిస్తుంది. అంటే.. ఫ్యాన్‌కు ఉరివేసుకునేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే వెంటనే వారు నెలకు తాకి ఆగిపోతారు. ప్రస్తుతం ఈ పరికరాన్ని విద్యాకేంద్రమైన రాజస్థాన్ కోటాలోని ప్రతి కళాశాల, హాస్టల్‌లో అధికారులు అమలు చేస్తున్నారు. ఈ విధానాన్ని ట్రిపుల్ ఐటీ అధికారులు కూడా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రిపుల్ ఐటీలోని హాస్టల్, తరగతి గదుల్లో 1500 ఫ్యాన్ల వరకు ఉంటాయి. ఒక్కోదానికి 200 ఖర్చు అయినా రూ. 5 లక్షల్లో యూనివర్సిటీలోని అన్ని ఫ్యాన్‌లకు యాంటీ సూసైడ్ ఫ్యాన్ రాడ్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు.



యాంటీ సూసైడ్ స్ప్రింగ్ రాడ్

గురుకులంలో పురుగుల అన్నం

» ప్రశ్నించిన విద్యార్థిని కొట్టిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

» పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి తండ్రి ఫిర్యాదు

» సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ఘటన

తుంగతుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీళ్ల చారు, పురుగుల అన్నం పెడుతున్నారంటూ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థిని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొట్టిన ఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల జరిగింది. ఘటనపై విద్యార్థి తండ్రి గుగులోతు భాస్కర్ ఉన్నతాధికారులతో పాటు పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ రుద్రక్రాంతితోపాటు రాష్ట్ర గురుకుల పాఠశాలల ప్రతినిధి రాజు గురుకులానికి వచ్చి సమాచారం సేకరించారు. సరైన మెనూ అందడం లేదని ప్రశ్నించినందుకే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీశ్ కొట్టాడని విద్యార్థులు చెప్పారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతానని విచారణకు వచ్చిన రాజు తెలిపారు.



సూర్యాపేట జిల్లా తుంగతుర్తి గురుకులంలో అన్నంలో పురుగులు

ముద్దలుగా అన్నం.. విద్యార్థులకు అస్వస్థత

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ముద్దలుగా మారిన అన్నం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జీర్ణం కాక కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారు. విషయం బయటకు పొక్కకుండా విద్యార్థులకు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట రమణతో, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పిల్లలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పాత బియ్యం అయిపోవడంతో కొత్త బియ్యం పంపించారని, సమస్యలు తలెత్తిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ప్రిన్సిపల్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వెలుగు నీడలు

భారత 50వ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన ధనంజయ యశ్వంత్ చంద్రచూడ్ 41 సంవత్సరాల వయస్సు లోపే హైకోర్టు జడ్జి అయిన ప్రతిభామూర్తి. 2016లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది, నవంబర్ 2022లో భారత ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. ఇటీవలి దశాబ్దాలలో రెండేళ్ల పదవీకాలం పొందిన ప్రధాన న్యాయమూర్తులలో ఆయనే మొదటివారు. జడ్జిగా, చీఫ్ జస్టిస్‌గా ఉన్న ఎనిమిదేళ్ల కాలంలో ఆయన 1200కు పైగా ధర్మాసనాలలో సభ్యుడు. దాదాపు 600 తీర్పులను స్వయంగా రాశారు. తొలినాటి తీర్పులలో పౌరుల వైయక్తిక హక్కులకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యం, బహిరంగ వేదికలపై వెలువరించిన ఉపన్యాసాలు ఆయనకు 'ఉదారవాద ధర్మ యోధుడు'గా పేరు ప్రతిష్ఠలు సమకూర్చాయి. సీజేఐగా, కార్యనిర్వాహక వర్గం నుంచి పూర్తి స్వతంత్రతతో సుప్రీంకోర్టు వ్యవహరించేలా చేయగలరని అందరూ ఆశించారు. అయితే పదవీ విరమణ నాటికి జస్టిస్ చంద్రచూడ్ 'కొత్త మితవాద ఉదారవాది' అనే అప్రతిష్ఠను మూటగట్టుకున్నారు. ముఖ్యంగా అయోధ్య వివాదం, అధికరణ 370 రద్దు కేసులలో ఆయన తీర్పులు విస్తృతామోదం పొందలేక పోయాయి. న్యాయకోవిదులు, ప్రజానీకం చంద్రచూడ్ న్యాయపాలన పట్ల అసంతృప్తికి లోనయ్యారు.

న్యాయవిహిత నిర్ణయాలు తీసుకోకపోవడం కాదు, తీసుకునేందుకు పూనుకోకపోవడమే విషాదం. ఎన్నికల సంఘంలాంటి రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తిని పునరుద్ధరించేందుకు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల బుల్‌డోజర్ దురాగతాలను నిరోధించేందుకు, పౌరులపై చట్ట విరుద్ధ నిఘా నిలిపివేసేందుకు, జమ్మూకశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించేందుకు, మహారాష్ట్రలో ప్రజాస్వామ్య విరుద్ధంగా కూల్చివేసిన ప్రభుత్వానికి చట్టబద్ధత పునరుద్ధరించేందుకు, ఎన్నికల ప్రక్రియలో ప్రజల విశ్వసనీయతను పెంపొందించేందుకు జస్టిస్ చంద్రచూడ్ సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోలేదని చెప్పక తప్పదు. ఆయన న్యాయ పర్యవేక్షణలో వేలాది సామాజిక కార్యకర్తలు, పాత్రికేయులు, ప్రభుత్వ విధానాలపై భిన్నాభిప్రాయాలు కలవారు విచారణ లేకుండా, కనీసం బెయిల్ పొందే వెసులుబాటు కూడా లేకుండా జైళ్లలో మగ్గిపోతున్నారు. ఎనభై ఏళ్ల పైబడిన స్టాన్‌స్వామి మరణం, 90 శాతం అవిటితనంతో బాధపడుతున్న ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతి జైళ్లలో ఖైదీలు ఎటువంటి అమానుష పరిస్థితులలో కునారిల్లిపోతున్నారో విశదం చేస్తున్నాయి. జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం 370 అధికరణను ప్రభుత్వం రద్దు చేయడాన్ని సమర్థించింది. కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని తొలగించడాన్ని ఆక్షేపించనప్పటికీ దాని పునరుద్ధరణకు ధర్మాసనం ఆదేశించలేదు కనుకనే ఈ కేసులో న్యాయమూర్తులు న్యాయానికి విఘాతం కలిగించారని దుష్యంత్ దవే వంటివారు గట్టిగా అభిప్రాయపడ్డారు. కశ్మీర్ ప్రత్యేకప్రతిపత్తిని రద్దుచేస్తామని 2014లో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని ఆ పార్టీ ప్రభుత్వం అమలుపరిచేందుకు చంద్రచూడ్ ఇతర న్యాయమూర్తులు సహకరించారన్నది విమర్శకుల అభిప్రాయం. ఇక అయోధ్యకేసులో తీర్పు వెలువరించిన ధర్మాసనంలో (అప్పటికింకా ఆయన సీజేఐ కాలేదు) చంద్రచూడ్ సభ్యుడు. ఆ తీర్పును ఆయనే రాశారన్నది ఒక బహిరంగ రహస్యం. ఆ తీర్పు ఒక వైరుధ్యాల పుట్ట అని దవే విమర్శించారు. చట్టాలు, న్యాయసూత్రాల ప్రాతిపదికన కాకుండా అధికసంఖ్యాక వర్గ ప్రజల మతపరమైన భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకుని న్యాయనిర్ణయం జరిగిందన్నది ఆరోపణ. దీనికితోడు, ఈ తీర్పుకు సంబంధించి ఇటీవల చంద్రచూడ్ చేసిన ఒక వ్యాఖ్య ఆయన ప్రతిష్ఠను మరింత మసకబార్చింది. రామజన్మభూమి కేసు విచారణ సందర్భంలో తాను దేవుణ్ణి ప్రార్థించానని, ఆ ప్రార్థన ఫలితంగానే ఆ కేసుకు ఒక పరిష్కారం లభించిందని ఆయన అన్నారు. రాజ్యాంగం కంటే కానరాని ఒక అమూర్తమూర్తికి ప్రాధాన్యమివ్వడమేమిటని ఆ వ్యాఖ్యపై విమర్శలు వెల్లువెత్తాయి ఈ ఏడాది వినాయక చవితి పండుగ సందర్భంగా తన నివాసానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించడం కూడా చంద్రచూడ్ న్యాయనిబద్ధతను ప్రశ్నార్థకం చేసింది. హిందువుగా గుర్తింపు పొందేందుకు ఆయన బాహాటంగా చేస్తున్న ప్రయత్నాలను రాజ్యాంగ విలువలను సంరక్షించుకునేందుకు ఆరాటపడుతున్నవారు హర్షించలేకపోతున్నారు. 'న్యాయ వ్యవస్థ అధికారం కేసులను పరిష్కరించడంలో గానీ, శిక్షలు విధించడంలో గానీ, కోర్టు ధిక్కారానికి పాల్పడిన వారిని దండించే పద్ధతిలో గానీ లేదు; న్యాయ నిర్ణయాలు, న్యాయపాలనలో సగటు మనిషి నమ్మకం, విశ్వాసం, భరోసాలో ఉందన్నది అమెరికా నాల్గవ ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్ అభిప్రాయం. ఆ ప్రకారంగా సీజేఐ చంద్రచూడ్ తన విధ్యుక్త ధర్మనిర్వహణలో విఫలమయ్యారని ఆరోపణ.

ఏ న్యాయమూర్తీ పరిపూర్ణ ధర్మమూర్తి కాడు, కాలేడు. చంద్రచూడ్ సైతం ఇందుకు మినహాయింపు కాదు. న్యాయపాలనలో ఆయన చేపట్టిన కొన్ని మంచి చర్యలనూ ప్రస్తావించవలసిందే. న్యాయవ్యవస్థలో ఈ–న్యాయస్థానాల పద్ధతిని సమర్థంగా నిర్వహించడం, విస్తరింప చేయడం ద్వారా స్వాతంత్ర్యానంతర భారత న్యాయవ్యవస్థలో ఆయన ఒక విప్లవాన్ని తీసుకువచ్చారు. న్యాయమూర్తిగా ఆయన నెలకొల్పిన ప్రమాణాలు ఎప్పటికీ గుర్తుంచుకోదగ్గవి. ఆయన తీర్పులు నిశిత విశ్లేషణలతో తర్కబద్ధంగా సరళరీతిలో సామాన్య విద్యావంతులు సైతం చదవగలిగేవిగా ఉంటాయి. న్యాయవాదనలు విశ్లేషణాత్మక మేధకు ప్రతిబింబాలు. సరళ, సుందర, శక్తిమంతమైన భాషలో తీర్పులు రాయడంలో జస్టిస్ కృష్ణ అయ్యర్‌తో చంద్రచూడ్‌ను పోల్చుతారు. మౌలిక చింతకుడు అయిన చంద్రచూడ్ భారత న్యాయవ్యవస్థ పునాదులను మార్చివేసేందుకు సమకట్టి ఆ కృషిలో ఎన్నో తప్పులు చేశారు.

రాహుల్... ఒకసారి వెనుతిరిగి చూడండి!

ఆర్టికల్ మొదట్లోనే రాహుల్‌గాంధీ గారు "చరిత్ర నాకు తెలియదు" అని ఒప్పుకున్నందుకు సంతోషం (ఆంధ్రజ్యోతి – 06.11.2024). నిజమే, రాహుల్‌గాంధీ గారికీ, వారి కుటుంబానికీ భారతదేశ నిజమైన, సంస్కృతి సంప్రదాయాలతో కూడిన చరిత్ర తెలియదు.

ఈస్ట్ ఇండియా కంపెనీ భారత్‌ను అణిచివేసిందంటూ బ్రిటిష్ పెత్తనాన్ని కేవలం వాణిజ్య దోపిడీగా మాత్రమే చూపెట్టువంటి ప్రయత్నం చేశారు. కానీ భారతదేశాన్ని ఆర్థికంగానే కాదు, సామాజికంగా సాంస్కృతికంగా తీవ్రంగా ధ్వంసం చేసిన చరిత్ర ఈస్ట్ ఇండియా కంపెనీది. భారతదేశ సాంప్రదాయ బ్యాంకింగ్ వ్యవస్థలను బ్రిటిష్ పాలన చిన్నాభిన్నం చేసిందని రాహుల్‌గాంధీ అంటున్నారు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎక్కువ కాలం పరిపాలించింది మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న మీ కాంగ్రెస్ పార్టీ– అలాగే మీ నాన్న, మీ నానమ్మ, మీ ముత్తాత ఇట్లా మీ కుటుంబంవాళ్లే! మరి వీరందరి పరిపాలనలో బ్రిటిష్ వారికి ధారాదత్తం కాబడిన సంస్కృతీ సాంప్రదాయాలని, భారతీయ ఆత్మను పునరుద్ధరించడంలో కాంగ్రెస్ పార్టీ దారుణంగా విఫలమైందని కూడా మీరు ఒప్పుకున్నట్టే!

కాంగ్రెస్ పార్టీకి రుచించని 'వందేమాతరం', 'భరతమాత' వంటి పదాలను రాహుల్‌గాంధీ తన రాతలలో చూపించడం శుభ పరిణామం, దాన్ని స్వాగతిస్తున్నాను. ఎందుకంటే మీ పార్టీ ద్వారా గెలిపించబడిన ఉపరాష్ట్రపతి వందేమాతరం గీతాన్ని ఆలపించడానికి మనసు ఒప్పక జాతీయ పతాకానికి నమస్కారం చేయడానికి మనసు రాక నిల్చుంటే భరతజాతి యావత్తు సిగ్గుతో తలవంచుకొని బాధపడినటువంటి ఘటన మీకు గుర్తు చేయాల్సినటువంటి సందర్భం ఇది. అలాగే దేశంలో గుత్తాధిపత్యాలు, కుబేరులు కేవలం 2014 తర్వాత మాత్రమే ఉద్భవించినటువంటి బ్రహ్మపదార్థాలుగా రాహుల్ గాంధీ అభివర్ణించడం శోచనీయం. భారతదేశంలో రాజకీయంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా మొట్టమొదటి గుత్తాధిపత్యం ఎవరు చెలాయించారన్నది ఆయన ఆత్మావలోకనం చేసుకోవాలి. 'లైసెన్స్ రాజ్యం' పేరుతో భారతదేశాన్ని అధోగతి పాలు చేస్తూ దేశీయ పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందకుండా అభాసుపాలు చేసిన చరిత్ర మీ ప్రభుత్వానిది కాదా?



రాహుల్ గాంధీ చెప్పినట్టుగా సమాజంలో అట్టడుగున ఉన్న చిట్టచివరి బడుగు జీవిని ఉద్ధరించడమే మన ధ్యేయం కావాలన్నది గాంధీజీ లక్ష్యం కాదు. అది భారతీయ జనతా పార్టీ స్ఫూర్తి ప్రదాత, సిద్ధాంతకర్త స్వర్గీయ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవతా సిద్ధాంతం. సమాజంలో చిట్టచివర ఉన్న వ్యక్తికి ప్రభుత్వం తొలి ఫలాలు అందించాలనేది బీజేపీ ప్రథమ ఆశయం.

మీరు చెప్పిన 'మార్కెట్ శక్తులు', లేదా 'బడా వ్యాపారులు', వారితో అధికార సంబంధాలు మీ ప్రభుత్వ పాలనలోనే మొదలయ్యాయి. మీ ముత్తాత ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు టాటా సంస్థల వ్యవస్థాపకులు ఈ దేశంలో వ్యాపారం చేయడానికి మీ ముత్తాతను సంప్రదిస్తే వారి నుంచి వచ్చిన సమాధానం ఏమిటో టాటా వ్యవస్థాపకులు అనేక సందర్భాల్లో దేశ ప్రజలకు చెప్పిన ఉదంతం మీకు తెలియకుండా ఉండదు. ఇక దేశంలో అత్యధిక కాలం ప్రభుత్వాన్ని నడిపిన మీ కుటుంబం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అధికారాన్ని మొత్తం మీ చెప్పు చేతుల్లో పెట్టుకొన్నది. బడా వ్యాపార సంస్థల అధినేతలతో లంచ్ పార్టీలు, డిన్నర్ పార్టీలలో ఎవరు ఎలాంటి లబ్ధి పొందారో చరిత్ర మనకు అనేక సాక్ష్యాలను ఇచ్చింది. దయచేసి వెనక్కి తిరిగి చూస్తే అవి మీకు కనపడతాయి.

అలాగే– రాహుల్‌గాంధీ చెప్పినట్టుగా సమాజంలో అట్టడుగున ఉన్న చిట్టచివరి బడుగు జీవిని ఉద్ధరించడమే మన ధ్యేయం కావాలన్నది గాంధీజీ లక్ష్యం కాదు. అది భారతీయ జనతా పార్టీ స్ఫూర్తి ప్రదాత, సిద్ధాంతకర్త స్వర్గీయ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవతా సిద్ధాంతం. సమాజంలో చిట్టచివర ఉన్న వ్యక్తికి ప్రభుత్వం తొలి ఫలాలు అందించాలనేది బీజేపీ ప్రథమ ఆశయం.

ఇక మీరు ఆదివాసీల తరఫున నిలబడడం, మణిపూర్ ప్రజల బాధలు వినడం, రైతుల బాధలు వినడం... ఇవన్నీ మీ పార్టీకీ, మీకూ సరిపడని మాటలు! ఎందుకంటే మణిపూర్ ఘటన మీ ముత్తాత మొదలుపెట్టిన రావణ కాష్టానికి పరాకాష్ఠే! అత్యధిక కాలం అధికారంలో ఉన్న మీరు, మీ కుటుంబం, మీ పార్టీ గిరిజనులకు కానీ ఆదివాసీలకు కానీ, రైతులకు కానీ చేసిందేమీ లేదు.

గత పదేళ్ళ పైచిలుకు కాలంలో ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులకు, వ్యాపారస్తులకు భారతదేశం ఒక స్వర్గధామంగా మారింది. నరేంద్ర మోదీ సారథ్యంలో నడుస్తున్నటువంటి ప్రభుత్వంలో ఎటువంటి దళారుల ప్రమేయం లేకుండా ఏకగవాక్ష విధానంలో పారిశ్రామిక అభివృద్ధి జరుగుతున్నది. భారతదేశంలో తొలిసారిగా ఏ బడా వ్యాపారవేత్తలకు తొత్తులుగా మారకుండా నాయకుల పాలన సాగుతున్నది. ఒకపక్క చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వాళ్లకు ముద్ర లోన్ ఇచ్చి ప్రోత్సహిస్తూ మరోవైపు కొత్తగా వ్యాపార రంగంలో వచ్చేవాళ్లకు బ్యాంకింగ్ రంగంలో సరళమైన విధానంలో ప్రోత్సాహకాలు ఇస్తూ నరేంద్ర మోదీ పాలన భారతదేశాన్ని ఇవాళ ప్రపంచంలో ఐదవ ఆర్థిక శక్తి నిలబెట్టగలిగింది! మీ పేరు చివరన 'గాంధీ' అన్న తోక ఉన్నందుకు తప్ప మరెందుకూ ఈ దేశ ప్రజలు మిమ్మల్నీ, మీ కుటుంబాన్నీ గౌరవించడం లేదు అనే విషయాన్ని ఇప్పటికైనా మీరు గ్రహిస్తే మంచిది.

• ఎం. రఘునందన్ రావు
మెదక్ పార్లమెంట్ సభ్యులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

కుల, మత ఎజెండాల 'మహా' ప్రశ్నలు



మళ్లీ మళ్లీ వెనుకబడిన వర్గాల రాజకీయాలను భుజాన వేసుకుంటున్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని బీజేపీ భావిస్తోందా? బీసీలు, ఆదివాసీలు, దళితులు హిందూత్వ ప్రభావం నుంచి నిజంగా జారిపోయే అవకాశాలు ఉన్నాయా? ఈ వర్గాలు మైనారిటీలతో కలిసి మళ్లీ కాంగ్రెస్, ప్రతిపక్షాల ఓట్ బ్యాంకును సంఘటితం చేయడం సాధ్యమవుతుందా? కుల ఆధారిత రాజకీయాలను దెబ్బతీసి హిందూ ఓటర్లను బీజేపీ సంఘటితం చేయగలుగుతుందా? మహారాష్ట్ర, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఈ ప్రశ్నలకు సమాధానం లభించే అవకాశాలున్నాయి.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల నుంచి రిజర్వేషన్లను లాక్కొని మైనారిటీలకు కేటాయించే యోచనలో కాంగ్రెస్ ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం మహారాష్ట్రలో అన్నారు. 'కాంగ్రెస్ పార్టీ మీ మంగళ సూత్రాలను లాక్కొని ముస్లింలకు పంచిపెడుతుందని' గత లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్‌లో ప్రధాని మోదీ ఉద్ఘాటనకు, ఇప్పుడు అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు పెద్ద తేడా లేదు. మహారాష్ట్రలో ఎన్నికల ఘట్టం సమీపిస్తున్నకొద్దీ నరేంద్రమోదీ, అమిత్ షాల్లో ఎవరో ఒకరు ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారానికి కూడా అమిత్ షా హాజరు కాకపోవడం మహారాష్ట్ర ఎన్నికలకు బీజేపీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తోంది.

లోక్‌సభ ఎన్నికల తర్వాత కులం, రిజర్వేషన్లు, మతం మళ్లీ మహారాష్ట్ర ఎన్నికల్లో విస్తృతంగా చర్చనీయాంశాలు అవుతున్నాయి. రాహుల్‌గాంధీ కుల జనగణనను మరోసారి ప్రధాన అంశంగా చేస్తున్నారు. దీన్ని అడ్డుకోవడానికి మోదీ, అమిత్ షాలతో సహా సమస్త బీజేపీ శ్రేణులు యథా ప్రకారం మత ప్రాతిపదికన ప్రచారాన్ని మొదలుపెట్టాయి. 'మీరు విడిపోతే వేరవుతారు' అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటిస్తే ఏకే హైతో సేఫ్ హై (కలిసి ఉంటే సురక్షితంగా ఉంటాం) అని మోదీ ప్రకటించారు.

భారతదేశ రాజకీయాల్లో మతం పాత్ర ఏ మేరకు ఉన్నదో మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో వెల్లడవనున్నదా? గత లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో మాదిరి ప్రజలు కుల ప్రాతిపదికగా ఏకమై తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తారా? అన్న ఆసక్తికరమైన చర్చ ఇప్పుడు జాతీయ స్థాయిలో జరుగుతోంది. ప్రజలు మత ప్రాతిపదికన ఏకం కాకుండా కుల సమస్యను ప్రధానంగా ఎజెండాపైకి తీసుకురావడానికి గత లోక్‌సభ ఎన్నికల నుంచీ కాంగ్రెస్ తీవ్రంగా యత్నిస్తోంది. రాహుల్‌గాంధీ స్వయంగా తెలంగాణకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కుల సర్వే గురించి పార్టీ నేతలతో చర్చించారు.

90 సీట్లున్న హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడానికి స్వయంకృతాపరాధాలే అధికంగా కారణమయ్యాయి. అక్కడ మత ప్రాతిపదికన ప్రజలు ఓట్లు వేశారని చెప్పడానికి వీల్లేదు. అందువల్ల 288 సీట్లున్న మహారాష్ట్రను, తమ ఎజెండాను నిరూపించుకోవడానికి ఒక ప్రయోగశాలగా బీజేపీ పరిగణిస్తుందనడంలో సందేహం లేదు. 2014లో భారతీయ జనతా పార్టీ దేశ వ్యాప్తంగా అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మతపరమైన భావోద్వేగాలు పెరిగిపోయాయి. ఒక పద్ధతి ప్రకారం బీజేపీ ప్రజలను మత ప్రాతిపదికగా ఏకం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. అందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కూడా తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తోంది. పది సంవత్సరాల నాటి పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు దేశంలో మతపరమైన భావనలు విస్తరిస్తున్నాయి. మతాన్ని తమ అస్తిత్వానికి నిదర్శనంగా భావించేవారు పెరిగిపోతున్నారు. కాని మతం ఒక ఓటు బ్యాంకుగా మారుతుందా అన్న సందేహాలు లేకపోలేదు. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ సీట్లు సగానికి పడిపోవడం, రామమందిరం నిర్మించిన అయోధ్యలో కూడా బీజేపీ పరాజయం చెందడం ఈ సందేహాలకు కారణం. అంతటితో ఆ పరాజయాన్ని అంగీకరించడానికి బీజేపీ సిద్ధంగా లేదు. ఎందుకంటే భారతీయ జనతా పార్టీ వద్ద మరో ఆయుధం లేదనే చెప్పాల్సి ఉంది. ఎన్నికల సమయం వచ్చినప్పుడల్లా బీజేపీ నేతలు ప్రభుత్వ పనితీరు, ప్రజల సమస్యలు, అభివృద్ధి లాంటి వాటికన్నా మత ప్రాతిపదికన ప్రచారం చేసేందుకు మొగ్గు చూపడమే ఇందుకు నిదర్శనం.

మరో వైపు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలకు కూడా కులాన్ని ఒక ఎజెండాగా మార్చడం కంటే వేరే గత్యంతరం లేదు. హర్యానాలో ఓడిపోయినప్పటికీ కాంగ్రెస్ వెనుకబడిన వర్గాల రాజకీయాలనే ఎజెండాగా మార్చుకుంది. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగంపై దాడిచేస్తున్నాయని గతవారం నాగపూర్‌లో జరిగిన సంవిధాన్ సమ్మేళన్‌లో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. బుద్ధుడు, అంబేడ్కర్, పూలే తదితరుల ఆలోచనలకు ప్రతిఫలమైన రాజ్యాంగాన్ని భారతీయ జీవన విధానానికి దర్పణంగా అభివర్ణించారు. కులజనగణన చేస్తే కాని దేశంలో వెనుకబడిన, అణగారిన వర్గాల వారు ఏ మేరకు ఉన్నారో, వారికి 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించాలో లేదో తెలుస్తుందని రాహుల్ అన్నారు. దీనికి ప్రధానమంత్రి మోదీ నుంచీ దేవేంద్ర ఫడ్నవీస్ దాకా బీజేపీ నేతలందరూ తీవ్రంగా స్పందించారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి వంద సీట్లు కూడా తేలేకపోయిన, హర్యానాలో పార్టీకి అధికారం సాధించలేకపోయిన రాహుల్‌గాంధీ చేస్తున్న వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ ఇంకా సీరియస్‌గా ఎందుకు తీసుకుంటోంది? పట్టువదలని విక్రమార్కుడులా మళ్లీ మళ్లీ వెనుకబడిన వర్గాల రాజకీయాలను భుజాన వేసుకుంటున్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని బీజేపీ భావిస్తోందా? బీసీలు, ఆదివాసీలు, దళితులు హిందూత్వ ప్రభావం నుంచి నిజంగా జారిపోయే అవకాశాలు ఉన్నాయా? ఈ వర్గాలు మైనారిటీలతో కలిసి మళ్లీ కాంగ్రెస్, ప్రతిపక్షాల ఓట్ బ్యాంకును సంఘటితం చేయడం సాధ్యమవుతుందా? కుల ఆధారిత రాజకీయాలను దెబ్బతీసి హిందూ ఓటర్లను బీజేపీ సంఘటితం చేయగలుగుతుందా?

మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఈ ప్రశ్నలకు సమాధానం లభించే అవకాశాలున్నాయి. హిందువుల ప్రయోజనాలకోసం పోరాడిన బాల్ ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రేతో పాటు వివిధ శక్తులు కాంగ్రెస్‌తో చేతులు కలపడం వల్ల హిందువుల ఓట్లు చీలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా హిందువుల ఓట్లను సంఘటితం చేయడం మాత్రమే కాదు, ఓబీసీ ఓటు బ్యాంకును కాపాడుకోవడం బీజేపీకి కీలకంగా మారింది. మహారాష్ట్రలో 175 సీట్లలో ఓబీసీలు నిర్ణాయక స్థితిలో ఉన్నారని బీజేపీ నేతలు సైతం అంగీకరిస్తున్నారు. విదర్భలో కూడా 62 సీట్లలో 36 సీట్ల ఫలితాలను ఓబీసీలు నిర్ణయించే అవకాశాలు ఉన్నాయి. అక్కడ ఓబీసీల్లో 60శాతం పైగా ఉన్న కుంబీల ఓట్లు తమకే లభిస్తాయని కాంగ్రెస్ నేతలు ఆశిస్తున్నారు. మరో వైపు మరాఠా రిజర్వేషన్ ఉద్యమం మూలంగా అసాధారణమైన స్థాయిలో ఓబీసీలు సంఘటితమవుతున్నారని ప్రకాశ్ అంబేడ్కర్ లాంటి వారు చెబుతున్నారు. జారంగే పటేల్ వంటి మరాఠా కోటా ఉద్యమకారులను చేరదీసినందుకు ఓబీసీలు ఆగ్రహంతో ఉన్నారని, మరో వైపు మరాఠా కోటాను డిమాండ్ చేసినవారు కూడా మద్దతునీయడం లేదని విశ్లేషణలు వినపడుతున్నాయి. తాజాగా జారంగీ పటేల్ తన అభ్యర్థులందర్నీ ఉపసంహరించుకోవడం ప్రతిపక్షాలకే సహాయపడుతుందని విశ్లేషకుల అంచనా.

జార్ఖండ్‌లో ఆదివాసీలను ఉమ్మడి పౌర స్మృతి పరిధిలోకి తేబోమని బీజేపీ పదే పదే ప్రకటించడం ద్వారా ఆదివాసీల ఓట్లు చీలకుండా ప్రయత్నాలు చేస్తోంది. మరో వైపు ఆదివాసీలకు ప్రత్యేక స్మృతిని అమలు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గడచిన కొద్ది దశాబ్దాలుగా ఆర్‌ఎస్‌ఎస్ ఆదివాసీల ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు బీజేపీకి ఎంత ప్రయోజనం చేకూర్చగలవో ఈ ఎన్నికల్లో తేలనున్నది.

ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న ఉప ఎన్నికలు కూడా వెనుకబడిన వర్గాల రాజకీయాలకు ఒక పరీక్ష అని చెప్పక తప్పదు. అక్కడ కూడా సార్వత్రిక ఎన్నికల్లో కోల్పోయిన ఓట్లను బీజేపీ సాధించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. విడిపోతే వేరవుతాం అన్న నినాదం ఒకవైపు, విడిపోము, వేరు కాము, కలిసికట్టుగా ఉందాము అన్న నినాదం మరోవైపు పోస్టర్ల రూపంలో అంతటా వెలిశాయి. రాహుల్ గాంధీ నినాదం నఫ్రత్ కే బజార్ మే మొహబ్బత్ కే దుకాణ్ (విద్వేష మార్కెట్‌లో ప్రేమ దుకాణం) అన్న నినాదాలు కూడా పోస్టర్లుగా మారుతున్నాయి. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేయకుండా బీజేపీకి వ్యతిరేకంగా కేవలం ఎస్పీనే దించడం మూలంగా కుల రాజకీయాలకు, మత రాజకీయాలకూ మధ్య ప్రధాన పోటీ ఏర్పడింది. సమాజ్ వాదీ పార్టీ యథా ప్రకారం పీడీఏ (పిఛ్డా, దళిత్, అల్పసంఖ్యాక్) ఫార్ములాను ప్రయోగిస్తోంది.

నరేంద్రమోదీ 2014లో భారతీయ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత బీజేపీ రథం చాలా చోట్ల కుల రాజకీయాలను ఛేదించగలిగింది కానీ మండల్ అనంతర రాజకీయాలను పూర్తిగా ఓడించలేకపోయింది. గడచిన పదేళ్లలో తనకు లభించిన అవకాశాలను బీజేపీ సమర్థంగా ఉపయోగించుకుని ఉంటే ప్రతిపక్షాలు కుల రాజకీయాలను ఎజెండాగా మార్చుకునేందుకు అవకాశం లభించి ఉండేది కాదు. రాజ్యాంగం, సామాజిక న్యాయం చర్చనీయాంశాలుగా మారేవి కావు. మత అస్తిత్వానికి పోటీగా కుల అస్తిత్వం పెరిగేందుకు ఆస్కారం లభించి ఉండేది కాదు. దానికి తోడు మైనారిటీలు కూడా బీజేపీకి వ్యతిరేకంగా సంఘటితమయ్యే పరిస్థితులు వచ్చేవి కావు.

భారతదేశ రాజకీయ చిత్రపటాన్ని మోదీ కొంతమేరకు మార్చగలిగారు. కాని కుల సమీకరణలను రూపుమాపడంలో ఆయన పూర్తిగా సఫలం కాలేకపోయారు. బీజేపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఓబీసీలను, దళితులను, ఆదివాసీలను హిందూత్వ పరిధిలోకి తీసుకురావడం అంత సులభం కావడం లేదు. మోదీ లాంటి బలమైన నాయకుడి ఆధ్వర్యంలో జాతీయవాదం ఒకశక్తిగా మారగలదనే అభిప్రాయం చాలా మందిలో ఉన్నప్పటికీ ఆ అభిప్రాయాన్ని మార్చుకుంటున్న వారు కూడా కనపడుతున్నారు. ఒక ఆధునిక ప్రజాస్వామ్య దేశంగా అభివృద్ధి చెందాల్సిన దేశంలో కులం, మతం ఇంకా ఎన్నికల ప్రధాన ఎజెండాగా కొనసాగుతుండడం, ప్రజల నిజమైన సమస్యలకు ప్రాధాన్యం లభించకపోవడం ఎంత విషాదకరం?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

మూసీ ప్రాజెక్టు పట్నంకే పరిమితమా?

కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టు గురించి అవునని, కాదని అన్ని రాజకీయ పార్టీలు, రకరకాల సంస్థలు, వ్యక్తులు గత రెండు నెలలుగా మాట్లాడుతూనే ఉన్నారు. ప్రభుత్వమేమో ఎట్టి పరిస్థితిలో అయినా మూసీ ప్రాజెక్టు విషయంలో వెనక్కిపోయేది లేదు, మేము ముందుకే వెళ్తాం అని ప్రకటిస్తూనే ఉంది. ఎప్పుడూ లేంది ఎందుకో రాజకీయ పార్టీలకు మూసీ బస్తీలలో ఎంతో కాలంగా ఉంటున్న ప్రజలపై అకస్మాత్తుగా ప్రేమ పుట్టుకొచ్చింది. ప్రజలను రెచ్చగొడుతున్నారు, వాళ్లను మురికి వాతావరణంలో ఉన్న బస్తీలలోనే ఉంచుతారా, మీరు వాళ్లుండే బస్తీల ప్రక్కన ఉంటారా అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తే, ఉంటాము అని ప్రతిపక్ష పార్టీలు జవాబు చెప్పుతున్నాయి.

అసలు ఇంత కాలంగా నది పక్కన ఉన్న మురికిని శుభ్రం చేసుకొని చిన్న చిన్న గృహాలు నిర్మించుకొని ఉంటున్న ప్రజలు ఏమంటున్నారు అన్న విషయం రాజకీయ పార్టీల నాయకులు పట్టించుకోవడం లేదు. ఆ ప్రజలు గత నలభై సంవత్సరాలుగా మాకు మెరుగైన గృహాలు నిర్మించి ఇవ్వండి, మేముండే ప్రదేశాలను సమీక్షించి వీలైతే మేముండే స్థలాలకు చట్టపరంగా నివాస హక్కులు కల్పించండి అని అడుగుతున్నారు. ఇదే ప్రశ్న కొన్ని పౌర సంస్థలు ప్రజల తరఫున ఎన్నికల సమయంలో, ప్రభుత్వంలో ఉన్న పార్టీ ముందు, అధికారంలోకి రావాలనుకున్న పార్టీ ముందు పెడుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మూసీ ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ వస్తున్నాయి. చంద్రబాబునాయుడు మూసీ మురికి కాలువ లాగా ఉంది. దాన్ని కుదించి, కుదించగా ఏర్పడే స్థలాన్ని వ్యాపార కేంద్రాలు, పార్కులు, తదితర వినోద కేంద్రాలుగా తయారుచేస్తానని ప్రయత్నించి భంగపడ్డాడు. 2000 సంవత్సరంలో భారీ వర్షాల వల్ల, మూసీకి వరదలొచ్చి ఆయన చేసిన ప్రయత్నాన్ని భంగపరిచాయి. 2004లో వైఎస్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే మూసీని సుందరీకరిస్తాం అని ప్రకటించి, మీరాలం చెరువు నుండి నాగోల్ వరకు గల 21 కిలోమీటర్ల మూసీ ప్రాంతాన్ని మూడు భాగాలుగా విభజించి వాటికి అందమైన పేర్లు పెట్టి, ఆ ప్రాజెక్టు కోసం కొంత డబ్బు ఖర్చు పెట్టింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ రెండు సంవత్సరాలకు కేసీఆర్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కోసం ఒక సంస్థను ఏర్పరచి కొంత బడ్జెట్ కేటాయించి, గతంలో కాంగ్రెస్ ప్రకటించిన పథకాన్నే దాదాపుగా ఖరారు చేసి, సర్వే నిర్వహించి మూసీలో అక్రమ నిర్మాణాలు అని ఒక జాబితా ప్రకటించింది. ఆ ప్రభుత్వంలోని నాయకులే ఇప్పుడు మూసీనది చుట్టు ప్రక్కల ఉన్న బస్తీల లోంచి ప్రజలను తరలివెళ్లవద్దని ఉపన్యాసాలు ఇస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కొన్ని మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మించింది, కొంత మేరకు రిటైనింగ్ గోడను నిర్మించింది. గత 28 సంవత్సరాలలో పాలనలో ఉన్న మూడు ప్రభుత్వాలు మూసీ అభివృద్ధి కోసం రూ.348 కోట్లు ఖర్చు చేయడం జరిగింది.

గత ఏడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది మాసాలకు ముఖ్యమంత్రి, తన క్యాబినెట్‌లో చర్చించి మూసీ ప్రక్షాళన పేరుతో భారీ నిధుల ఖర్చుతో చేపట్టే ప్రాజెక్టు గురించి ప్రకటన చేసారు. ఒకసారి మూసీ ప్రక్షాళన అని, నది పునరుద్ధరణ అని, నదిలో ప్రవహించే నీటిని శుద్ధి చేయడం అని రకరకాల ప్రకటనలు ప్రభుత్వ అధినేతలు చేస్తూ వస్తున్నారు. చాలా హడావిడిగా సర్వే చేసి నదిగర్భంలో ఉన్న కుటుంబాలను గుర్తించి, వాళ్లను ఇదివరకే నిర్మాణం అయి ఉన్న రెండు పడకల గృహాల్లో పునరావాసం కల్పిస్తామని, చట్టపరమైన పక్కా హక్కుల పత్రాలు అందజేస్తామని ప్రకటించి కొంతవరకు అమలు కూడా చేసింది. పౌర సంస్థలు, సంఘాలు నిర్వాసిత కుటుంబాలకు అండగా ఉండి వివిధ దశల్లో ప్రభుత్వాధికార్లతో చర్చలు జరుపుతున్నారు. చాలా బలంగా పౌర సంస్థలు తమ గొంతులు కలిపి నిర్వాసితుల పక్షాన ఉండటంతో ప్రభుత్వం, నదీగర్భంలో ఉన్న కుటుంబాలను బలవంతంగా తరలించమని, ఎట్టి పరిస్థితిలోనూ పోలీసులను, నిర్బంధ పద్ధతులను ప్రయోగించమని, హైడ్రా సంస్థను అసలే వాడమని హామీ ఇచ్చి, ఇప్పటికి ఆ హామీకి కట్టుబడి ఉంది. అయితే ఆ కుటుంబాలను దూరంగా తరలిస్తే జీవనోపాధి సమస్య తలెత్తుతుంది కాబట్టి, జీవనోపాధికి సంబంధించిన ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టే విషయం, గృహాల స్వంతదార్లే కాకుండా అందులో కిరాయికి ఉండే కుటుంబాలకు ఇండ్లు కేటాయింపు లాంటి తదితర సమస్యలను ప్రభుత్వం పౌర సమాజ సంస్థలను చర్చలకు ఆహ్వానించి పరిష్కార దిశగా ఆలోచించే దిశలో ఉంది. ఇదివరకే ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్లు మాత్రమే కాక ఇంకా కొన్నింటిని నిర్మించి మురుగునీటిని సంపూర్ణంగా శుద్ధి చేస్తామని ప్రభుత్వం చెప్పుతుంది. కాని మామూలు నీటి కాలుష్యం కాకుండా ఆర్సెనిక్, సైనేడ్ లాంటి విషపదార్థాలు కూడా కలిసిపోయిన నదిలోని రసాయన నీరును శుభ్రపరిచే సమర్థత కలిగిన ప్రక్రియ గల ప్లాంటు నిర్మించగలదా, అంత సమర్థమైన సాంకేతిక పరిజ్ఞానం మనకు అందుబాటులో ఉందా అనే ప్రశ్నలు వస్తున్నాయి.



మూసీ పరివాహక ప్రాంతాలలో ముఖ్యంగా పిలాయిపల్లి, కప్పరాయిపల్లి, రెడ్రెల్లి, బ్రాహ్మణపల్లి, హయత్‌నగర్ మండలాలలోని గ్రామాలలో గత పదేళ్లలో అనేక పరిశ్రమలు ఏర్పడ్డాయి. అవన్నీ వ్యర్థ పదార్థాలను నేరుగా మూసీలోకే వదులుతున్నాయి. నది ఎగువ ప్రాంతాన్ని శుభ్రపరిస్తే దిగువ ప్రాంతాలలో పరిశ్రమల కారణంగా కలుషితమవుతున్న నదీజలాలను ఏం చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తలపెట్టిన మూసీ ప్రాజెక్టులో తమ ప్రాంతాలనూ చేర్చాలని మూసీ తీర గ్రామాల వారు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం ముందుగా నదిలో కలిసే మురుగునీటి వ్యర్థాలను, ఫ్యాక్టరీల నుంచి వచ్చే రసాయనిక వ్యర్థాలను కట్టడి చేసే ప్రయత్నం, మురుగుశుద్ధి ప్లాంట్ల నిర్మాణాలు, ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర కార్యక్రమాలు చేపట్టకుండా, ముందు ప్రజలను వాళ్ల నివసిస్తున్న గృహాల నుంచి తరలించే కార్యక్రమమే ప్రధానంగా చేపట్టిందన్న ప్రశ్నకు సంతృప్తికరమైన వివరణ ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఇదివరకే నదిలోకి వచ్చే చిన్న పెద్ద 36 నాలాలను గుర్తించి వాటిని ఇంటర్‌సెప్టివ్ పైప్‌లైన్లకు అనుసంధానం చేయడం జరిగింది. అయితే అది లోపాలతో ఉందని నిపుణులు చెపుతున్నారు. అంతే కాకుండా కొత్తగా నగరంలో ఇంకా కొన్ని ప్రదేశాల నుండి మురికి నీరు నదిలోకి వచ్చి కలుస్తుంది. ముందుగా ఈ వ్యవస్థను పటిష్ఠపరచాలని ఆ రంగంలో ఉన్న నిపుణులు అంటున్నారు.

మూసీ బఫర్ జోన్‌లో అయిదారు రకాల భూములున్నాయి. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు ప్రజల దగ్గర ఉన్నాయి. నిజాం కాలం నుండి ప్రజలు అనుభవిస్తున్న దస్తగర్దాన్, ఇనాం భూములు, ఖాస్రా భూములు, చెస్సాల భూములు, లావాణీ పట్టాలు, ఏక్‌సాల్ పట్టా భూములు ఉన్నాయి. వీటి గురించి వివరాలు సేకరించి, ఆ భూముల్లో ఉన్న వారిని తొలగించదలచుకుంటే ఆ కుటుంబాల పునరావాసం, వారికి నష్టపరిహారం, ఇంకా వేరే ప్రదేశాల్లో భూములు ఇవ్వడం లాంటి అంశాల గురించి ప్రభుత్వం పని మొదలుపెట్టలేదు. నదిగర్భంలో ఉన్న ప్రజల గృహాలకు మాత్రమే గుర్తులు పెట్టి వారిని తరలించడమే ప్రాధాన్యత అంశంగా ప్రభుత్వం పెట్టుకుంది.

మూసీ నది ఉప్పల్ దాటిన తర్వాత దాదాపు 100 కిలోమీటర్లు సూర్యాపేట ప్రాజెక్టు వరకు ప్రవహించి, అక్కడ నుంచి 74 కి.మీ ప్రవహించి నల్లగొండ జిల్లాలో కృష్ణానదిలో కలుస్తుంది. ఉప్పల్ నుండి సూర్యాపేట వరకు ఉన్న దాదాపుగా 200 గ్రామాల ప్రజలు, ప్రభుత్వం మూసీ నదిని శుభ్రపరచడం లక్ష్యంగా పెట్టుకున్నందుకు చాలా సంతోషిస్తున్నారు. అయితే తమ గ్రామాలలో మూసీ కాలుష్యం వల్ల నెలకొన్న పరిస్థితుల గురించి, తమ జీవితాలు విధ్వంసం తీరుతెన్నుల గురించి మాట్లాడడం లేదని, అసంతృప్తితో ఆగ్రహంతో ఉన్నారు. మా హక్కుల బృందం ఆ గ్రామాలు పర్యటించినప్పుడు చాలా విషయాలు తెలిపారు. మూసీ ప్రాజెక్టు గురించి ప్రతి రోజు మాట్లాడుతున్న, ప్రశ్నిస్తున్న పౌర సంస్థల ప్రతినిధులు గాని, ప్రతిపక్ష పార్టీలు గాని, ప్రభుత్వ అధికారులు గాని ఇంతవరకు తమ గ్రామాలను సందర్శించలేదని తెలిపారు. వారు ప్రభుత్వం తలపెట్టిన మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టులో మూసీ పరివాహక ప్రాంతాన్ని కూడా భాగం చేయాలని బలంగా కోరుతున్నారు. మూసీ సాగునీరు పారుదల కోసం ఒక బ్రహ్మాండమైన, (నిజాం నిర్మించిన) కత్వాల వ్యవస్థ ఉంది. ఉప్పల్ నుండి సూర్యాపేట వరకు ఉనికిలో ఉన్న 24 కత్వాల సాగునీరు పారుదల వ్యవస్థ ద్వారా దాదాపు 200 గ్రామాలకు, ఆ గ్రామాల చెరువులకు నీరు పారుతుంది. అప్పుడు 25 వేల ఎకరాల సాగుకోసం ఏర్పరచిన ఈ సాగునీటి వ్యవస్థ వల్ల ఇప్పుడు 1,25,000 ఎకరాల భూమి సాగవుతోంది. అయితే ఆ కత్వాలు కొన్ని రాళ్లు ఊడిపోయి ఛిద్రం అయినాయి. వాటిని మరమ్మతులు చేసి ఆధునికీకరించాలి. కత్వాల నుండి నీటిని తీసుకెళ్లే ప్రధాన కాలువలు, వాటికి అనుసంధానంగా ఉండి గ్రామాలలోకి నీరు సరఫరా చేసే చిన్న కాలువలకు ఉన్న తూములు తుప్పు పట్టి పాడైపోయాయి. వాటిని బాగుచేయాలి. గత 20 సంవత్సరాలుగా గ్రామ చెరువులన్నీ పూడికతో నిండిపోయాయి. మిషన్ కాకతీయ ప్రాజెక్టులో గత ప్రభుత్వం కొన్ని చెరువుల్లో పూడిక పనులు చేపట్టింది. అవి సరిగ్గా చేయలేదు. ఇప్పుడు శుద్ధి చేసిన నీరు చెరువుల్లోకి వస్తే కాలుష్యంతో నిండిన పూడికవల్ల, మళ్లీ శుభ్రమైన నీరు కాలుష్యమవుతుంది. అందుకని చెరువులలో పూడిక తీయాలి. హయత్‌నగర్, పోచంపల్లి, ఆలేరు ప్రాంతాల్లోని గ్రామాలలో మూసీ నీటి సరఫరా కోసం కాలువలు తవ్వే పని మొదలయింది. కొన్ని గ్రామాల్లో గ్రామపంచాయితీల సహకారంతో ప్రజలే మూసీ నీటి కోసం కాలువలు తవ్వడం ప్రారంభించారు. అవి అసంపూర్తిగా ఉన్నాయి. ఇప్పుడు శుభ్రపరచిన నీళ్లు వస్తాయని ఆ కాలువల నిర్మాణం పూర్తి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

గత పదేళ్లలో కింది పరివాహక ప్రాంతాల్లో రకరకాల పరిశ్రమలు వెలిసాయి. అవినీతిమయమైన కాలుష్య నియంత్రణ మండలి వాటికి అనుమతులిచ్చింది. ఆ పరిశ్రమలన్నీ కాలుష్య పదార్థాలను నేరుగా మూసీలోకి వదులుతున్నాయి. పిలాయిపల్లి, కప్పరాయిపల్లి, రెడ్రెల్లి, బ్రాహ్మణపల్లి, హయత్‌నగర్ మండలాల్లోని గ్రామాల దగ్గర ఈ ఫ్యాక్టరీలు వెలిశాయి. ఇవన్నీ కూడా వ్యర్థపదార్థాలను మూసీలోకే వదులుతున్నాయి. పైన శుభ్రపరిస్తే కింది ప్రాంతంలో కలుషితమవుతున్న మూసీ నీటి సంగతి ఏం చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అందువల్ల మూసీ పరివాహక గ్రామాల ప్రజలు మూసీ ప్రాజెక్టులో తమ ప్రాంతాలను కూడా చేర్చాలని అంటున్నారు. ఆలోచనాపరులుగా మనం కూడా ఈ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ గ్రామాల ప్రజలకు సంఘీభావంగా ఉందామా?

■ ఎస్. జీవన్‌కుమార్
మానవ హక్కుల వేదిక



కాంటాలు.. తంటాలు..

- తూకానికి నోచుకోని ధాన్యం బస్తాలు
- తూతూ మంత్రంగానే కేంద్రాల ప్రారంభం
- వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- కేంద్రాలకు మిల్లులను కేటాయించకపోవడమే కారణం
- రోజూ కేంద్రాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- అలస్యం కావడంతో దళారుల చేతుల్లోకి ధాన్యం

6



ఇక్కడ పనులు యమ లేటు గురూ..

- 10 వేలకు పైగా పేరుకుపోయిన పెండింగ్ ఫైళ్లు
- అనుమతుల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- పనులు చేయడంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల చేతివాటం
- బ్రోకర్ల మధ్యవర్తిత్వంతో ఇంటి అనుమతులు జారీ
- మూడు నెలలుగా ఇన్‌చార్జి సీపీ పాలన
- సిబ్బంది ఇష్టారాజ్యం.. కొరవడిన అధికారుల పర్యవేక్షణ

అధ్వానంగా బల్దియా 'టౌన్‌ప్లానింగ్' విభాగం

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు ఆదాయ వనరులు చేకూర్చే టౌన్‌ప్లానింగ్ విభాగం పనులు రోజు రోజుకూ కుంటుపడుతున్నాయి. సరిపడా సిబ్బంది లేకపోవడంలో ఎక్కడి పనులు అక్కడ పడకేస్తున్నాయి. ఈ విభాగానికి వచ్చి పని చేయాలంటే సిటీ ప్లానర్ వంటి అధికారులకు కత్తిమీద సాములా మారిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఓ మహిళా సీపీ ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మూడు రోజులకే ఒకరి పెత్తనం జీర్ణించుకోలేక లాంగ్ లీవ్ పెట్టుకుని మరీ వెళ్లిపోయిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదే అదనుగా భావించిన కొందరు టీపీబీవో, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఆడిందే ఆటగా పాడిందే పాటగా సాగుతున్నట్లు విమర్శలున్నాయి. అలాగే ప్రస్తుతం టౌన్‌ప్లానింగ్‌లో సిటీ ప్లానర్ లేకపోవడంవల్ల డీసీపీ స్థాయి అధికారికి ఇన్‌చార్జి సీపీగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో కింది స్థాయి సిబ్బంది ప్రతీ పనికి చేతివాటం చూపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విభాగంలో పని చేసి ఆరోపణలు ఎదుర్కొని ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన సిబ్బంది తిరిగి ఇక్కడే తిష్టవేసి లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది.

బీఐలే ప్రధాన సూత్రదారులు

బల్దియా పరిధిలో ప్రస్తుతం 16 మంది బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు (బీఐ)లు పని చేస్తున్నారు. వీరిలో చాలామంది గతంలో అవినీతికి పాల్పడి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లగా, ప్రస్తుతం కొద్ది రోజులకే కడిగిన ముత్యాలై ఇక్కడికే డిప్యూటేషన్‌పై వచ్చి పని చేస్తున్నారు. అయితే ప్రస్తుతం కాజీపేట, కాశిబుగ్గలో పనిచేస్తున్న ఇద్దరు ఏసీపీలలో ఒకరు అధికారుల కండ్లు కప్పి అడ్డదారిలో ఇండ్లు నిర్మించుకునేందుకు అనుమతులు జారీ చేస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా సదరు ఏసీపీపై గతంలో వేటు వేసినా అతడిలో మార్పు రాకుండా ఇటీవల హనుమకొండ ప్రకాశ్‌రెడ్డిపేట, న్యూశాయంపేట, భీమారం, పలివేల్పుల, గోపాలపురంలో కోర్టు వివాదంలో ఉన్న భూములకు సైతం దర్జాగా ఇంటి అనుమతులు జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా ఓ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఇటీవల హసన్‌పర్తి, చింతగట్టు విలీన గ్రామాలలో భూమి పహణీపై అక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసి లక్షల్లో డబ్బులు దండుకున్నట్లు తెలిసింది. ఇలా బీఐలు అధికారులను తప్పుతోవ పట్టించి అడ్డదారిలో అక్రమాలకు పాల్పడుతున్నారనే ప్రచారం బల్దియాలో వినిపిస్తోంది. ఇలా కాజీపేట, కాశిబుగ్గలో పాలు బల్దియా ప్రధాన కార్యాలయంలో కొందరు బీఐలు యథేచ్ఛగా డబ్బులు దండుకుని అక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు తేలింది. ఇక ఏసీపీలు, ఇన్‌చార్జి సీపీ ఇంటి అనుమతులు, అక్రమ కట్టడాలకు అనుమతులు ఇస్తూ బల్దియా ఆదాయానికి గండి కొడుతున్నారు.

బ్రోకర్ల హవా

బల్దియా టౌన్‌ప్లానింగ్ విభాగంలో బోకర్ల హవా ఉంటుందనే ప్రచారం ఉంది. గ్రేటర్ వరంగల్ పరిధిలో ఎక్కడి నుంచైనా ప్రజలు ఆన్‌లైన్‌లో ఇంటి నిర్మాణం, అక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నా బ్రోకర్లు రంగంలోకి దిగుతారు. అయితే అంతకుముందే అధికారులు ఏదో కారణం చూపి ఇంటి అనుమతులు ఇవ్వకుండా జాప్యం చేస్తారు. నెలలు గడిచిన తర్వాత అర్జిదారుడి దరఖాస్తులో ఉన్న ఫోన్ నెంబర్‌ను బీఐలు సేకరించి రహస్య ఒప్పందం ప్రకారం మధ్య దళారులకు అందజేస్తారు. ఆ తర్వాత రంగంలోకి దళారులు దిగి దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి తాను పని చేసి పెడతానని, కొంత డబ్బులు ఖర్చు అవుతుందని ముందుగా ముగ్గులోకి లాగుతారు. తర్వాత ఇంటి అనుమతి పత్రం రావాలంటే సీపీ, డీసీపీ, ఏసీపీ, బీఐలకు డబ్బులు ముట్టజెప్పాలని బేరసారాలు ఆడుతారు. జీప్లస్-1 నుంచి 4 వరకు బ్రోకర్లు లక్షల్లో దండుకుని టౌన్‌ప్లానింగ్ అధికారులకు వాటాలు ఇస్తున్నట్లు బహిరంగంగానే ప్రచారం జరుగుతోంది. బ్రోకర్లతో పాటు ఎల్‌వో కార్యాలయం, టౌన్‌ప్లానింగ్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్ చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. టౌన్‌ప్లానింగ్ విభాగానికి పర్మినెంట్ సీపీ లేకపోవడం వల్లనే ఎవరికివారే యమునా తీరే అన్నట్లు పరిపాలన సాగుతోందనే ప్రచారం ఉంది. అంతేకాకుండా ఇద్దరు సూపరింటెండెంట్లకు ఒకరు సస్పెండ్ అయిన తర్వాత ఇటీవల విధుల్లో చేరడం.. ఆయనకు ఇంకా విధులు కేటాయించకపోవడం, మరొకరు హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లినా పోస్టు భర్తీ చేయకపోవడంతో ఇక్కడి పరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటికైనా కమిషనర్ టౌన్‌ప్లానింగ్‌లో పని చేస్తున్న అవినీతి అధికారులను గుర్తించి వేటువేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ సుధారాణి


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 12: గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడారు. ఇప్పటి వరకే స్మార్ట్ సిటీ నిధుల నుంచి చాలా వరకు అభివృద్ధి జరిగిందని, ఇంకా చాలా అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా పిలువబడుతున్న వరంగల్ నగరాన్ని ముందంజలో ఉంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని గుర్తు చేశారు. భద్రకాళి చెరువును అభివృద్ధి చేయడం జలవనరులు వృద్ధి చెంది చుట్టుపక్కల ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు నీటికొరత తప్పుతుందని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ఉత్కృష్ట సేవా పతకాలు

- కమిషనరేట్ కానిస్టేబుళ్లకు దక్కిన గౌరవం
- మల్లారెడ్డి, మహేష్‌లను అభినందించిన సీపీ


మల్లారెడ్డి, మహేశ్వర్

8

కులగణన పూర్తయ్యాకే ఎన్నికలు నిర్వహించాలి

మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్


బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ ప్రతినిధులు

బాలసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కులగణన పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, మాజీ స్పీకర్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.

మార్కెట్లో మాఫియాకు చెక్ పెడతాం..

- అనర్హుల లైసెన్సులను రద్దు చేస్తాం..
- డీపీఆర్ చూసి నిర్ణయాలు తీసుకుంటాం
- నెల రోజుల్లో అన్ని సమస్యలను పరిష్కరిస్తాం
- దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ


వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ వ్యవసాయం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మోడల్ మార్కెట్లో కొందరు మూడు నాలుగు లైసెన్సులు కలిగి దుకాణాలు పెట్టుకుని వాటిని కిరాయిలకు ఇస్తూ దందా నడిపిస్తున్నారని, ఇకపై అలాంటివారికి చెక్ పెడతామని అటవీ, దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం ఆమె లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్ మొత్తం కలియతిరిగారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హోల్‌సేల్, చిరువ్యాపారులు అక్కడ నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మార్కెట్లో పెద్ద మొత్తంలో ఫీజు, కిరాయి చెల్లిస్తున్నామని, కానీ తగినంత గిరాకీ రావడంలేదని తెలిపారు. లైసెన్స్‌లు లేనివారు మార్కెట్ చుట్టూ కూరగాయలు అమ్ముతుండడంతో వినియోగదారులు లోపలికి రావడంలేదని, దీంతో తమ వ్యాపారం నడువడం లేదని హోల్‌సేల్ వ్యాపారులు చెప్పారు. చిరు వ్యాపారులు మాట్లాడుతూ.. అర్హులైన వారికి లైసెన్సులు కేటాయించలేదని, కొందరికి ఒక్కొక్కరికి మూడు, నాలుగు లైసెన్సులు, దుకాణాలు ఉన్నాయని, బినామీలతో నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వాటిని రద్దుచేసి అర్హులైన వారికి కేటాయించాలని విన్నవించుకున్నారు.

అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇక్కడ వ్యాపారులకు మంచి సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో సుమారు రూ.6.3 కోట్లతో మోడల్ కూరగాయల మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఆ తరువాత వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే తనకు అనుకూలమైన వారికి మార్కెట్లో లైసెన్సులు, దుకాణాలు ఇప్పించుకుని అక్రమాలకు తెరతీశారని ఆరోపించారు. కూరగాయల మార్కెట్లో అనర్హులకు షాపులు, ప్లాట్లు కేటాయించారని తెలుస్తోందని, వాటిని రద్దు చేసి అర్హులైన వారికి కేటాయిస్తామని ప్రకటించారు. ఒక స్క్రీనింగ్ కమిటీ వేసి దుకాణాలు, ప్లాట్ల కేటాయింపులో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా మార్కెట్ కమిటీ వారు లేదా 'కుడా' వారు ఒక కన్సల్‌టెన్సీ నియమించుకుని మార్కెట్‌కు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) చేయించుకోవాలని, అప్పుడే పార్కింగ్ ఎక్కడ, ప్లాట్‌ఫామ్స్ ఎక్కడ, ఎలా నిర్మించాలన్నది తెలుస్తుందని, దాన్ని బట్టి సమస్యలను పరిష్కరించవచ్చని అన్నారు. మార్కెట్లో షెడ్లు నిర్మించి వ్యాపారులకు కేటాయిస్తామన్నారు.

కూరగాయల మార్కెట్‌ను శుభ్రంగా ఉంచాలని, అప్పుడే వినియోగదారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తారని మంత్రి సురేఖ సూచించారు. పాడైపోయిన కూరగాయలను డపింగ్‌యార్డుకు తరలించి అక్కడ వర్మీ కంపోస్టు తయారీ చేపడితే మార్కెట్‌కు ఆదాయం వస్తుందని, ఆ దిశగా అధికారులు ఆలోచన చేయాలని సూచించారు. మార్కెట్లో సోలార్ ఎనర్జీ పెట్టాల్సిన అవసరముందని, దాని ద్వారా ఉత్పత్తి అయ్యే కరెంట్‌ను మార్కెట్ వాడుకోవచ్చని అన్నారు. బస్‌స్టాండ్ నుంచి వెంకట్రామ థియేటర్, కాశిబుగ్గకు వెళ్లే రోడ్డులో ఉన్న పాత ఇళ్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కుడా అధికారులను ఆదేశించారు. ఫ్రూట్ మార్కెట్ వ్యాపారులకు మామిడి సీజన్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నందున వారిని ముసలమ్మకుంట వద్ద ఉన్న స్థలంలోకి మార్చేందుకు అవకాశాలను పరిశీలిస్తామని అన్నారు. వారంలోపల కమిటీ వేసి అనర్హులను గుర్తించే పని చేస్తామని, నెల లోపల మళ్లీ సమావేశం ఏర్పాటు చేసి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కుడా ప్లానర్ అజిత్‌రెడ్డి, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్, మీసాల ప్రకాష్, ఎండి ఆయూబ్, సాగర్ల శ్రీనివాస్, జారతి శ్రీనివాస్, బేతి అశోక్, కృష్ణ, కర్ణాకర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.





కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- హనుమకొండ జిల్లాలో 157 సెంటర్ల ద్వారా ధాన్యం కొనుగోలు
- కలెక్టర్ ప్రావీణ్య


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలని, మిల్లులకు తరలించడంలో అలసత్వం వహించొద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం రైస్‌మిల్లర్లు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, ఐకేపీ, పౌరసరఫరాలు, సహకార, మార్కెటింగ్ శాఖ అధికారులతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోలు, చెల్లింపు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. 48 ఐకేపీ సెంటర్లు, 109 పీఏసీఎస్‌లలో కలిపి మొత్తం జిల్లాలో 157సెంటర్ల ద్వారా వానాకాలం ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. 31 రైస్‌మిల్లులకు కొనుగోలు కేంద్రాలను జియో ట్యాగింగ్ చేశామని, జియో ట్యాగింగ్ వల్ల రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం అండర్ టేకింగ్ ఇచ్చిన మిల్లులకు తరలిస్తామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులననుసరించి కొనుగోలు కేంద్రం నుంచి రైతుల ప్రక్రియ గురించి సంబంధించిన 10 శాతం బ్యాంక్ గ్యారెంటీ అండర్ టేకింగ్ జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు ఏఈఓలు టోకెన్లు అందజేయాలన్నారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు. 2023-24 సీజన్‌కు సంబంధించి పెండింగ్ ఉన్న సీఎంఆర్ బియ్యాన్ని వారం రోజుల్లో క్లియర్ చేయాలని మిల్లర్లకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అడిషినల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌డీఓ నాగపద్మజ, వ్యవసాయశాఖ అధికారులు, పౌరసరఫరాలశాఖ అధికారులు, మిల్లర్లు, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఉన్నతీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

అంగన్వాడీలలోని పెయింటింగ్, ఎలక్ట్రికల్, తాగునీరు, టాయిలెట్స్‌కు సంబంధించిన ఉన్నతీకరణ పనులు త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంగన్వాడీల అభివృద్ధి పనులపై మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. అంగన్వాడీల పేర్లు రాసిన బోర్డులు బాగా కనిపించేటట్లు ఏర్పాటు చేయాలని, టాయిలెట్స్ పిల్లలకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలన్నారు. అంగన్వాడీలకు మంజూరు చేసిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని, మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. అంగన్వాడీలకు ఉన్నతీకరణ పనులను గురించి ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయిన వాటికి సంబంధించిన బిల్లులను డీడబ్ల్యూఓకి సమర్పిస్తే వెంటనే డబ్బులు మంజూరుచేస్తామని తెలిపారు. ఈ నెలాఖరులోగా పెయింటింగ్స్, టాయిలెట్స్, ఎలక్ట్రికల్ కనెక్షన్లు, అంగన్వాడీల ఉన్నతీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో డీడబ్ల్యూఓ జయంతి, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంటాలు.. తంటాలు..

తూకానికి నోచుకోని ధాన్యం బస్తాలు ● తూతూ మంత్రంగానే కేంద్రాల ప్రారంభం ● వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో గోదాములో ఉన్న కాంటాలు

వర్ధన్నపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఈ ఏడాది కాంటాల తంటాలు తప్పడం లేదు. నెలరోజుల కిందట వరికోసుకుని ధాన్యంతో వచ్చిన రైతులు.. నేటి వరకు రోజువారిగా ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం తూతూ మంత్రంగా కాంటాలను ప్రారంభించడంతో కేంద్రాల్లోకి ధాన్యాన్ని తెచ్చిన రైతులు ఎదురు చూడాల్సి వస్తోంది. కేంద్రానికి తెచ్చిన ధాన్యం ఇప్పటికే ఓసారి వర్షానికి తడిసి ముద్దయింది. దీంతో అప్రమత్తమైన రైతులు.. రోజువారిగా కేంద్రా ల చుట్టూ తిరుగుతున్నారు. ఇక పంటను కోసుకు న్న మరికొంతమంది రైతులు కల్లాల్లోనే మ్యాచర్ కోసం పెట్టుకుని వేచి చూస్తున్నారు. కాంటాలు ప్రారంభమై బస్తాల్లో తరలించినప్పుడే కేంద్రాలకు రావాలని అధికారులు మౌఖిక ఆదేశాలు ఇవ్వడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తూకానికి నోచుకోని ధాన్యం బస్తాలు

గత నెలలో వరంగల్ జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యాన్ని సేకరించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. కానీ దాదాపు నెల రోజుల సమయం కావొస్తున్నా.. ఇప్పటివరకు ధాన్యం బస్తాలను తూకాలు వేయడం లేదు. ఇప్పటికే రైతులు అనేక విధాలుగా నష్టపోతున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో మరోసారి రైతులు చేతికొచ్చిన పంటతో నష్టపోవాల్సి వస్తోందేమోనని ఆందోళన చెందుతున్నారు. సగానికి పైగా రైతులు ఇప్పటికే కోతలు పూర్తి చేసుకుని కల్లాల్లో, కేంద్రాల్లో ధాన్యం రాశులతో వేచి ఉన్నారు. మిల్లులను కేటాయించకపోవడంతో ధాన్యాన్ని ఎటు పంపించాలో తెలియకపోవడంతో కొనుగోలు కేంద్రాలు ఖాళీ కాంటాలతో వెలవెల బోతున్నాయి.

మిల్లులను కేటాయించకపోవడమే..

రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో నూతన పాలసీని ప్రకటించింది. దీని కోసం మంత్రి మండలి ఉప సంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఈ పాలసీలో కొనుగోలు విధానంలో మిల్లర్ల నుంచి పూచీకత్తు తీసుకోవాలని ఉంది. ధాన్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. మిల్లర్ల చరిత్ర ఆధారంగా మూడు విభాగాలుగా విభజించింది. పూచీకత్తు అడగడంతో మిల్లర్లు ధాన్యాన్ని తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. గతంలో మిల్లర్లు భారీగా రూ.కోట్లలో ప్రభుత్వానికి బకాయిలు పడడంతో ప్రభుత్వం ఈసారి పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. దీంతో ప్రభుత్వానికి, మిల్లర్లకు మధ్య సయోధ్య కుదరకపోవడంతో రైతులు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపరించింది.

దళారుల చేతుల్లోకి ధాన్యం

కాంటాలు ఆలస్యం కావడంతో పాటు మరికొన్ని చోట్ల ఇంకా కేంద్రాలు కూడా ప్రారంభం కాకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దీంతో వారాల తరబడి ధాన్యం రాశులతో నిద్రలేని రాత్రులు గడపాలంటే మా వల్ల కాదంటూ కొందరు దళారులను ఆశ్రయిస్తున్నారు. పచ్చి వడ్లను కల్లాల వద్దే కాంటాలు పెట్టి అమ్మేస్తున్నారు. రూ.1900-2100 వరకు ధర ఇస్తుండడంతో చేసేదేమీ లేక రైతులు అమ్ముకుంటున్నారు. ఓ పక్క రోజువారిగా తిరగడం, మరోపక్క వర్షం కురిస్తే ఇబ్బందులు, ఇంకో పక్క ప్రభుత్వం కాంటాలు ప్రారంభించకపోవడంతో మద్దతు ధర ఆశిస్తే మొత్తానికే మోసం అయ్యేలా ఉందని రైతులు వాపోతున్నారు. దీంతో దళారులు గ్రామాల్లో నుంచి ధాన్యాన్ని తరలించుకు పోతున్నారు. వారం, పదిహేను రోజుల్లో రైతులకు డబ్బులు ముట్టచెబుతామని పూచీకత్తుపై కాంటాలు వేసుకుని ఒప్పందాలు చేసుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

వరంగల్ జిల్లా వ్యాప్తంగా 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు అన్ని మండలాల్లో రెండేసి గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 54 కాగా, 31కేంద్రాలు అధికారికంగా ప్రారంభించారు. మిగతా కేంద్రాలు పీఏసీఎస్ ఆధ్వర్యంలో సేకరించనున్నారు. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలకు ఇప్పటికే కొంత మంది రైతులు ధాన్యాన్ని తీసుకువస్తున్నారు. కొన్నిచోట్ల ఇంకా వరి కోతలు నడుస్తున్నాయి. ప్రభుత్వం, మిల్లర్ల మధ్య సయోధ్య కుదరడం ఆలస్యమైతే ఒకేసారి భారీగా ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు లేకపోలేదు.

కాంటాలు ప్రారంభం కాలేదు..

కన్నెబోయిన దుర్గయ్య, ఇల్లంద



ఇల్లంద మార్కెట్ యార్డులోని ఐకేపీ కేంద్రాన్ని ధాన్యాన్ని తీసుకువచ్చి 20 రోజులకు పైగా అవుతోంది. కేంద్రం ప్రారంభించారు కానీ.. కాంటాలు ఇంకా ప్రారంభం కాలేదు. ఇదేంటని అడిగితే మిల్లులను కేటాయించలేదు. అప్పటి వరకు కాంటాలు వేయమని నిర్వాహకులు చెపుతున్నారు. మరో పక్క వర్షం పడితే, మళ్లీ మ్యాచర్ వచ్చేందుకు ఎన్ని రోజులు పడుతుందో అర్థం కావడం లేదు.

ధాన్యాన్ని గోదాముల్లో వేసుకోవాలి..

భూక్య విజయ, రామోజీ కుమ్మరిగూడెం తండా



మేము 10 ఎకరాల్లో వరి పంటను సాగు చేశాం. అందులో 6 ఎకరాలు సన్నాలే వేశాం. పంట కోసం 20 రోజుల నుంచి ఆరబెడుతున్నాం. కేంద్రాల్లో కాంటాలు ప్రారంభం కాలేదని చెపుతున్నారు. ఇప్పటికే ఒకసారి వర్షం కురిసి ఇబ్బందులు పడ్డాము. భార్యభర్తలిద్దరం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ధాన్యం వద్దే ఉండాల్సి న పరిస్థితి. ధాన్యాన్ని కాంటాలు వేసి బస్తాలను గోదాముల్లో వేసుకోవాలి. లేకపోతే మళ్లీ వర్షం పడితే ఇబ్బందులు తప్పవు.

రైతులకు కొత్త రుణాలివ్వాలి

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పొందిన రైతులకు వెంటనే కొత్త రుణాలు మంజూరు చేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీ బ్యాంకు మేనేజర్లను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంకు అధికారులతో రవీందర్‌రావు సమావేశమయ్యారు. రుణమాఫీ, కొత్త రుణాలు, ఆధార్‌కార్డు లోపాలు, సవరణలు, రైతులకు సత్వర చర్యలు తదితర అంశాలను చర్చిస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుతున్న క్రమంలో రుణాల రికవరీ కూడా వేగవంతంగా ఉండాలన్నారు. టార్గెట్లు పూర్తిచేయని అధికారులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. నిర్దేశించిన రబీ పంట రుణాలను విడుదల చేయాలని, పీఏసీఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్న సెంటర్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశం అనంతరం ఇటీవలే మృతి చెందిన రైతు మజ్జిగ వెంకటనారాయణ ఇన్సూరెన్స్ డబ్బులను ఆయన కుటుంబ సభ్యులకు రవీందర్‌రావు అందచేశారు. ఈ సమావేశంలో సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషా, డీజీఎం అశోక్, ఏజీఎం మధు, గొట్టం స్రవంతి, కృష్ణ, మోహన్, గంప శ్రవంతి, బోడ రాజు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో డైరెక్టర్ వెంకయ్య తదితరులు

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ తైక్వాండో మహిళా జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నవంబరు 11 నుంచి 15 వరకు అమృతసర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ తైక్వాండో మహిళ జట్టును సోమవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో శిరీష, ఎన్.తేజస్విని, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), కె.శ్రావణి, (వాగ్దేవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్, వరంగల్), బి.రుద్ర (ఏకశిల డిగ్రీ కళాశాల, జనగామ), పి.నాగలక్ష్మి, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చెన్నూరు), సీహెచ్, తులసి(నలంద డిగ్రీ కళాశాల, మహబూబాబాద్)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా మహబూబాబాద్ నలంద డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రమేశ్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అబినందించారు.

పత్తి రైతులకు అపోహలు వద్దు

మద్దతుధరతో కొనుగోలు చేస్తాం : సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా

వరంగల్ వ్యవసాయం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పత్తి రైతులు అపోహలు పెట్టుకోవద్దని, సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుఆమర్ గుప్తా ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి సేకరణను నిలిపి వేస్తున్నట్లు సోమవారం మీడియాలో వార్తలు రావడం, 2024-25 పత్తి సీజన్‌కు సబంధించి జీఅండ్‌పీ టెండరు నిబంధనలు, షరతుల ప్రకారం జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలకు జాబ్ వర్క్ కేటాయించడం, పత్తి ప్రాసెసింగ్ కోసం జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలను ఎంపిక చేయడంలో ఏకపక్షంగా వ్యవహరించిందని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధికారులు, జిన్నర్స్ అసోసియేషన్ వారితో చర్చించిన తరువాత జిన్నర్స్ సమ్మెను విరమించారని ఆ ప్రకటనలో లలిత్‌కుమార్ గుప్తా తెలిపారు.

స్వల్పంగా పెరిగిన పత్తి ధర.. క్వింటాకు రూ.7వేలు

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మంగళవారం పత్తి ధర స్వల్పంగా పెరిగింది. కొన్ని రోజులుగా క్వింటాకు రూ. 6900, 6950, 6960 పలికిన ధర మంగళవారం నలభై రూపాయలు పెరిగి ఏడు వేలకు చేరింది. అదే విధంగా పసుపు క్వింటాకు రూ.11781లు, పల్లికాయ (సూక) రూ.5900లు, మక్కలు బిల్టురకం రూ.2465 ధర పలికింది.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేయూ పరిధిలోని బీఏ, బీకామ్, బీఎస్సీ, బీసీఏ ఇతర కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం. తిరుమలదేవిలు విడుదల చేశారు. బీఏ, బీకామ్, బీఎస్సీ ఇతర కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు నవంబరు 26, 28, 30, డిసెంబరు 3, 5, 7, 10, 12వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ ఇతర కోర్సుల మూడవ సెమిస్టర్ పరీక్షలు నవంబరు 27, 29, డిసెంబరు 2, 4, 6, 9, 11, 13,18వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అలాగే బీఏ, బీకామ్, బీఎస్సీ ఇతర కోర్సుల ఐదవ సెమిస్టర్ పరీక్షలు నవంబరు 26, 28, 30, డిసెంబరు 3, 5, 7, 10, 12, 17, 19 21, 23, 24వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

కేయూ దూరవిద్య పీజీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

కేయూ క్యాంపస్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ దూరవిద్య కేంద్రం పీజీ కోర్సుల్లో మంగళవారం ఇద్దరూ విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు గుర్తించి డీబార్ చేసినట్లు కేయూపరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎన్.నరేందర్ తెలిపారు. డీబారైన వారిలో వరంగల్ లాల్ బహదూర్ పరీక్షల కేంద్రంలో ఉన్నారని పేర్కొన్నారని పేర్కొన్నారు. వారిపై వర్సిటీ నిబంధనల మేరకుచర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

కాళోజీ సోదరుల యాది సభ నేడు

హనుమకొండ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాళోజీ సోదరుల యాది సభ బుధవారం సాయంత్రం 5.30 గంటలకు జరగనుంది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అధ్యక్షతన హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల సెమినార్ హాలులో నిర్వహించనున్నట్లు కాళోజీ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్.విద్యార్థి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు స్మారక పురస్కారం సుప్రసిద్ధ దారు శిల్పి మర్రి గోపాల్‌రెడ్డికి కాళోజీ రామేశ్వరరావు స్మారక పురస్కారం, ప్రముఖ ఉర్దూ కవి, పాత్రికేయులు వహీద్ గుల్షన్‌కు ప్రదానం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇదే రోజు ఉదయం 9.30 గంటలకు నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహం వద్ద కాళోజీ సోదరులకు నివాళి ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ బహదూర్ అలీ, డాక్టర్ నాళేశ్వరం శంకరం, ఎన్‌వీఎన్.చారి, పొట్లపల్లి శ్రీనివాసరావు, పందిళ్ల అశోక్ కుమార్, సిరాజుద్దీన్, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

నేడు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ పర్యటన

కేయూ క్యాంపస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో నవంబరు 13న బుధవారం ఉదయం 10.30గంటలకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ పి.కల్యాణ్‌రెడ్డి, ప్రైవేట్ సెక్రటరీ అశోక్‌కుమార్ లక్కర్సులు వర్సిటీలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కేయూ సెనెట్ హాల్‌లో ఎస్టీ ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులతో కలిసి సమావేశం నిర్వహించనున్నారు. వర్సిటీలో ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారని వర్సిటీ ఉన్నతాధికారులు తెలిపారు. ఉద్యోగులందరూ హాజరుకావాలని సూచించారు. కాగా, కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్‌లు మరొక ప్రకటనలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులందరూ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల సమావేశంలో పాల్గొని సమస్యలను విన్నవించాలని కోరారు. అలాగే నూతనంగా బాధ్యతలు చేపట్టిన కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డికి తమ సంఘం తరుపున సన్మానం చేయనున్నారు.

16న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ ఆధ్వర్యంలో ఈ నెల 12న ములుగురోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ హైదరాబాద్‌లోని వివిధ హోదాల్లో పనిచేసేందుకు 50మందిని ఈ జాబ్ మేళా ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన 18 నుంచి 35 ఏళ్లున్న యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు 16న శనివారం వారి సర్టిఫికెట్ జీరాక్స్ కాపీలతో ములుగురోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 7893394393, 8247656356 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠ	క్వింటా కనిష్ఠ
మక్కలు (బిల్టీ రకం)	2465	2080
పల్లికాయ (సూక)	5900	4000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	---	---
పెసళ్లు	6012	5900
పత్తి	7000	6300
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	11781	10565
పసుపు (గోల)	10806	10023
తేజ మిర్చి	---	---
తేజ ఏసీ	17000	14000
వండర్‌హాట్ ఏసీ	14200	11000
యూఎస్341ఏసీ	14000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

మట్టెవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలానగర వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకశుద్ధ ఏకాదశి మంగళవారం రోజున సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. సుమారు వంద మంది దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకట్‌రావు, చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, చందా రఘుశీర్, చంద్రావతి, అర్చకులు, సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

27న కేయూలో సింపోజియం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం నేతృత్వంలో నవంబరు 27న నిర్వహించే సింపోజియం పోస్టర్‌ను మంగళవారం కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. 'అస్పిరేషన్ ప్రామీసెస్ అండ్ పొలిటికల్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై సింపోజియం జరుగుతోందని విభాగాధిపతి సంకినేని వెంకట్ తెలిపారు. బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ క్రిష్ణయ్య అధ్యాపకులు డాక్టర్ వి.నాగరాజు, డాక్టర్ లక్ష్మీనారాయణ,డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ టి.సంజీవ్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సోమలింగం, స్కాలర్లు సురేశ్, ప్రశాంత్, తాళ్లపల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి



సమావేశంలో ప్రసంగిస్తున్న రవి

ఖిలావరంగల్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలిచ్చి పక్కా గృహాలను నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో నిర్వహించిన ఖిలా వరంగల్ మండల సమావేశంలో మాట్లాడారు. సీపీఐ శతజయంతి ఉత్సవాలను పల్లెపల్లెనా ఘనంగా నిర్వహించాల న్నారు. వరంగల్ జిల్లాలో నిరుద్యోగం పోవాలంటే భారీ పరిశ్రమలు తీసుకురావాలన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మామునూరు విమానాశ్రయ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. దీంతో పెద్ద కంపెనీలు ఏర్పడి జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఈ సమావేశంలో ఎమ్డీ యాకూబ్, షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, సంగీ ఏలెందర్, దండు లక్ష్మణ్, ఓర్సు రాజు, జాన్‌పాల్, ఎమ్డీ అక్బర్ పాషా, నల్లతీగల కుమార్, రవిందర్, సౌందర్య, భవాని, విజ యలక్ష్మి, పద్మ, పోచమ్మ, లలిత పాల్గొన్నారు.

దేవాలయాలను అభివృద్ధి చేస్తాం

● రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

ఖిలావరంగల్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. మంగళవారం ఆమె 34వ డివిజన్ శివనగర్‌లోని రామాలయంలో రూ.35లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పురాతన కాలంనాటి రామాలయాన్ని ఆలయ కమిటీ వారు సొంత నిధులతో చాలా అభివృద్ధి చేశారని అన్నారు. ప్రస్తుతం వరంగల్ కార్పొరేషన్ సాధారణ నిధులు, దేవాదాయశాఖతో పాటు, తన సొంత నిధులతో మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఇటీవల యాదగిరి గుట్ట దేవాలయం గోపురం స్వర్ణతాపడం పనులు మొదలయ్యాయని, త్వరలో వేములవాడ దేవాలయం గోపురం స్వర్ణతాపడం పనులను కూడా మొదలవుతాయని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చాలా ఉపయోగపడుతోందని అన్నారు. వారు ఎక్కువగా దైవదర్శనానికి వెళ్తుండడంతో రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధి చెందుతోందన్నారు. ఉదయం హైదరాబాద్‌కు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని సాయంత్రానికల్లా ఇంటికి వస్తున్నారని అన్నారు.

అంతకుముందు మంత్రి కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రేటర్ వరంగల్ నగర కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి, మంత్రి సురేఖను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమార స్వామి, మాజీ కార్పొరేటర్‌లు శామంతుల ఉషశ్రీ-శ్రీనివాస్, కె.కోటేశ్వరమ్మ, కేడల పద్మ, దేవాలయం చైర్మన్ వొడ్నాల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మంచాల కృష్ణమూర్తి, ఆడెపు శ్యామ్, శ్రీరాం రాజేష్, బత్తుల నవీన్, కాంగ్రెస్ నాయకులు రేణికుంట్ల శివ, పగడాల సతీష్, మంద అక్షిత్ పటేల్, మీసాల ప్రకాశ్, పొలెపాక నరేందర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

దోనగుట్ట ఆలయాన్ని తీర్చిదిద్దుతా..

న్యూశాయంపేట: న్యూశాయంపేటలోని దోనగుట్టపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం ఆలయ చైర్మన్ గ్రంధి సత్యవతి ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం, లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సురేఖ హాజరై దేవాలయంలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్తీక మాసంలో దీపాలు వెలిగిస్తే కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉంటాయన్నారు. ఆలయ అభివృద్ధికి చైర్మన్ గ్రంధి సత్యవతి కమిటీ సభ్యుల సహకారం, భక్తుల విరాళాలతో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బల్దియా సాధారణ(జనరల్) నిధులు రూ.54,50,000 అంచనా వ్యయంతో దేవాలయం చుట్టు సీసీ రోడ్డు, డ్రైయినేజీ నిర్మాణం కోసం ప్రొసిడింగ్ కాపీని దేవాలయ చైర్మన్ గ్రంధి సత్యవతి, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజుకు మంత్రి సురేఖ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు, రామారావు, ముప్ప వేణు, ఎస్.బాబురావు, కె. కృష్ణ, దేవాలయ కమిటీ సభ్యులు, న్యూశాయంపేటకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



శివనగర్‌లోని రామాలయంలో కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ

మంత్రిని కలిసిన బల్దియా అదనపు కమిషనర్ జోనా

వరంగల్ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఈసంపెల్లి జోనా మంగళవారం రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యాటక శాఖ మంత్రి కొండా సరేఖను కలిసి పూల మొక్కను అందించారు. వరంగల్ ఓ సిటీలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీ జోనాకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణ మేరకు గ్రేటర్ వరంగల్‌లోని 66 డివిజన్‌లను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని జోనాకు మంత్రి విశ్లేసించారు. మంత్రిని కలిసిన వారిలో సీ-1 సూపరింటెండెంట్ చీకటి ఆనంద్ ఉన్నారు.

కలెక్టర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

టీఎన్‌జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని, వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని టీఎన్‌జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. కలెక్టర్‌పై దాడి చేసిన దోషులు ఎంతటివారైనప్పటికి చట్ట పరిధిలో శిక్ష విధించాలని, జిల్లా కలెక్టర్‌పై దాడి చేయడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా అధికారుల సంఘం అధ్యక్షులు ఆకవరపు శ్రీనివాస్ కుమార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం బాధ్యులు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్య త్‌లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసనలో ట్రెస బాధ్యులు భాస్కర్, డీఆర్‌ఓ వై.వి గణేష్, కలెక్టరేట్ ఏఓ గౌరీశంకర్, టీఎన్‌జీఓస్ కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, టీజీఓస్ జిల్లా కార్యదర్శి సీహెచ్ ప్రవీణ్‌కుమార్, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

వరంగల్ కలెక్టరేట్: విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని వరంగల్ జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు గజ్జల రామ్‌కిషన్ డిమాండ్ చేశారు. మంగళవారం టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామ్‌కిషన్ మాట్లాడుతూ ఉద్యోగులపై దాడికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, జిల్లా ఉపాధ్యక్షులు గద్దల రాజు, దుర్గారావు, ఇంద్రసేనారెడ్డి, సహాయ కార్యదర్శులు రామకృష్ణ, రాజేశ్వరి, మధుచంద్ర, నూతన ప్రసాద్, నాల్గో తరగతి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాంబయ్య, భానుప్రకాశ్, జిల్లా ప్రచార కార్యదర్శి శెంకేసి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

కరాటేలో విశాల్‌కు బంగారు పతకం



బంగారు పతకంతో విశాల్

కాశిబుగ్గ, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కరాటే పోటీల్లో పొడిశెట్టి విశాల్ బంగారు పతకం సాధించి ఔరా అనిపించాడు. వరంగల్‌కు చెందిన దేవరాజ్ కావ్య దంపతుల కుమారుడు విశాల్ 7వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి జూనియర్ కరాటే పోటీల్లో అండర్ - 13 విభాగంలో కజకిస్థాన్ క్రీడాకారుడితో తలపడి గోల్డ్ మెడల్, స్పారింగ్ విభాగంలో రజత పతకం సాధించినట్లు కోచ్ ఎం.డి. రియాజ్ పాషా తెలిపారు. ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు ఈ పోటీలు గోవాలోని పెండెం స్టేడియంలో నిర్వహించినట్లు కోచ్ పేర్కొన్నారు.

'పూర్వ కమిటీనే కొనసాగించాలి'

కాశిబుగ్గ, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని శ్రీ కాశీవిశ్వేశ్వర ఆలయ పూర్వ కమిటీని యథాతథంగా కొనసాగించాలని పూర్వ కమిటీ ప్రతినిధులు మంగళవారం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆలయంలో లక్ష దీపోత్సవం, జ్వాలాతోరణం నిర్వహిస్తున్నామని కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రిని ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, కాశీవిశ్వేశ్వర రంగనాథ ఆలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి గోనే జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మడికొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ బృందం పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండలో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిలువ ఉంచారన్న సమాచారం మేరకు మడికొండలోని బొల్ల వెంకటేశ్వర్‌రావుకు చెందిన వీవీఎస్ పౌల్ట్రీఫామ్‌పై మంగళవారం టాస్క్‌ఫోర్స్ దాడులు చేయగా 4.20 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యం లభించినట్టు తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం మడికొండ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

నాయీబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎన్నిక

కరీమాబాద్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): అండర్ రైల్వేగేటు నాయిబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీని మంగళవారం ఉర్సు బొడ్రాయి వద్ద ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వనపర్తి నవీన్, ప్రధాన కార్యదర్శిగా పూర్ణచందర్, కోశాధికారిగా కొత్తగట్టు మల్లేశం, సహాయ కార్యదర్శి ఆర్గనైజర్‌లుగా మద్దికుంట శ్రీను, శ్రీకాంత్, సతీష్, అన్వేష్, పవన్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వనపర్తి నవీన్ మాట్లాడుతూ నాయిబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

25 మందికి జరిమానా

మట్టెవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 25 మందికి వాహనదారులకు రూ. 32,900 జరిమానాతో పాటు ఒకరికి సామాజిక సేవా శిక్షను మంగళవారం మెజిస్ట్రేట్ ఎ.వెంకటేష్ విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురికి రూ.4000 జరిమానా విధించినట్లు సీఐ వివరించారు.

బాలలపై లైంగిక దాడులను అరికట్టాలి

● సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ విజయ్‌కుమార్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): బాలలపై జరుగుతున్న లైంగికదాడులు నిర్మూలించడానికి స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వంతో కలిసికట్టుగా కృషి చయాలని సైబర్‌క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ కోరారు. మంగళవారం సుబేదారిలోని అనుంత భవన్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలు లైన్‌డిపార్ట్ మెంట్స్‌కు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం, ప్రభుత్వ ఇతర సంస్థలు కలిసికట్టుగా కృషి చేస్తే బాలలపై జరుగుతున్న లైంగికదాడులు, ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న సెక్సువల్ ఎక్స్‌ప్లయిటేషన్ నిర్మూలించవచ్చన్నారు. సమాజంలో రోజురోజుకూ బాలలపై, మహిళలపై లైంగిక దాడులు పెచ్చుమీరుతన్న క్రమంలో అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే లైంగిక దోపిడి, మానవ అక్రమ రవాణా, బాలల హక్కుల ఉల్లంఘనలు తగ్గుతాయన్నారు.

జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ.. బాలల కోసం, యవ్వనస్థుల కోసం, వృద్ధుల బాగోగుల కోసం తమ సంస్థ ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక చైతన్యం, బాలల లైంగిక దోడీ, సెక్సువల్ ఎక్స్‌ప్లయిటేషన్ పట్ల తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. స్వచ్ఛంద సంస్థలను లైన్‌డిపార్ట్‌మెంట్స్‌ను కలిసి సమాజ మార్పుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, మహబూబాబాద్ చైర్‌పర్సన్ నాగవాణి, పూర్వ చైర్‌పర్సన్‌లు మండల పరశురాములు, అనితారెడ్డి, డీసీపీఓలు ప్రవీణ్, రాజు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎర్ర శ్రీకాంత్, డాన్‌బోస్కో నవజీవన్ డైరెక్టర్ ఫాదర్ కోసి, అసిస్టెంట్ డైరెక్టర్ పి.సంతోష్‌కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బావుపేట క్రాస్‌రోడ్డులో చోరీ

రూ.11.80 లక్షల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

హసన్‌పర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లాపూర్ శివారు బావుపేట క్రాస్‌రోడ్డు వద్ద ఆద్దె గదిలో ఉంటున్న పోలు రాజేష్ ఇంట్లో ఈ నెల 7వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.11.80 లక్షల బంగారు నగలు, నగదు ఆపహరించుకొని వెళ్లినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండలం సోమదేవరపల్లి గ్రామానికి చెందిన పోలు రాజేశ్ - మౌనిక దంపతులు బావుపేట క్రాసురోడ్డులోని గంగారపు చిరంజీవి ఇంట్లో అద్దెకుంటున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 6న తన బావమరిది గంగరబోయిన రాజ్‌కుమార్ ట్రాక్టర్ పనిచేస్తుండగా చేతికి గాయంకావడంతో హనుమకొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అతడిని చూసేందుకు వెళ్లిన రాజేశ్ కుటుంబం.. తిరిగి 10న ఇంటికి చేరుకొని చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న బీరువా తలుపులు తెరిచి చూడగా బ్యాగులో ఉన్న రూ.10 లక్షల నగదుతో పాటు రూ.1.80 లక్షల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టే చేరాలు తెలిపారు.

ఫార్మా పేరుతో భూములు లాక్కుంటే ప్రతిఘటిస్తాం



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు

వడ్డెపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా కంపెనీ పేరుతో భూములు లాక్కుంటే ప్రతిఘటిస్తామని లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద లంబాడి హక్కుల పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళశారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు నెలల క్రితం వికారాబాద్ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లాలో లంబాడీలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారని అన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అధికారులపై దాడి జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా లంబాడీలపై దాడులు ఆగడం లేదని, గిరిజన భూములను దోచుకోవడమే తప్ప వేరే పనేమి లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సేవలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు ఇస్లావత్ మోహన్ నాయక్, అఖిల్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు డీఎస్.బాలు నాయక్, బానోతు భద్రు నాయక్, హర్యనాయక్, శ్రీను నాయక్, రాందాస్ నాయక్ పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విజేతలకు ప్రశంసలు



హ్యాండ్‌బాల్ పోటీ విజేత దేవానాయక్‌ను అభినందిస్తున్న విలియం కేరి హైస్కూల్ యాజమాన్యం



వుషు పోటీల్లో విజేతలను అభినందిస్తున్న ఇండియన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ప్రియాంక



విద్యార్థులను అభినందిస్తున్న ఎంజేపీ తిమ్మాపూర్ పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి

హనుమకొండ సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): హనుమకొండ విలియం కేరి బాప్టిస్టు హైస్కూల్ విద్యార్థి జి.దేవనాయక్ హ్యాండ్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన 68వ తెలంగాణ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో వరంగల్ జట్టుకి వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన దేవనాయక్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. వరంగల్ జట్టును ప్రథమ స్థానంలో నిలిపి తన నైపుణ్యతను చాటాడు. దీంతో ఆయన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈక్రమంలో మంగళవారం పాఠశాల ఇన్‌చార్జి కె.విద్యాకర్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం జరిగింది. క్రీడాకారుడు దేవానాయక్‌తోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు పోతుల ప్రవీణ్ కుమార్‌ను ఇన్‌చార్జి విద్యాకర్, ప్రధానోపాధ్యాయుడు టీఎం ప్రభాకర్ అభినందించి సన్మానించారు. విద్యతోపాటు క్రీడల్లో రాణించి పేరు తెచ్చుకోవాలని ఈ సందర్భంగా విద్యాకర్ విద్యార్థులకు సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక ధృఢత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

వుషు పోటీల్లో ఐహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ

హసన్‌పర్తి (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వుషు చాంపియన్‌షిప్ పోటీల్లో పెంబర్తి ఇండియన్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు ఐహెచ్ఎస్ కరస్పాండెంట్ అజ్మీర రమేష్ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన రెండ వ సబ్ జూనియర్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి వుషు క్రీడల్లో ప్రతీక్, లుక్ మన్, సాయిచరణ్, అక్షిత్, హర్షిత వెండి, రజత పతకాలు సాధించి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో కరస్పాండెంట్ అజ్మీర రమేష్, ప్రిన్సిపాల్ ప్రియాంక, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బండ కార్తీక్‌లు విద్యార్థులకు సర్టిఫికెట్లను, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఎస్.నర్సింగరావు, నాగేంద్రబాబు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ

హసన్‌పర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ఎల్లాపూర్ శివారు ఎంజేపీ తిమ్మాపూర్ విద్యార్థిని సమ న్విత ఉత్తమ ప్రతిభ కనబరిచి స్టేట్ లెవల్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభా రాణి తెలిపారు. షాట్‌పుట్‌లో మొదటిస్థానం, డిస్కస్‌త్రోలో ద్వితీయ స్థానం సాధించిన సమన్వితను పాఠశాల ఆవరణలో మంగళవారం అభినందించారు. ఖమ్మం జిల్లాలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు సమన్విత ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ పద్మ, వ్యాయామ ఉపాధ్యాయు రాలు సభద్ర, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఎస్టీలకు పీడీఎఫ్ ఫెలోషిష్ ఇవ్వాలి

కేయూ క్యాంపస్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో వర్సిటీల్లో పోస్టు డాక్టరల్ పరిశోధకులకు ఫెల్లోషిప్ ఇవ్వాలని కేయూ గిరిజన విద్యార్థి సంఘం నేత వెంకట్ నాయక్ అన్నారు. మంగళవారం కేయూలో ఎస్టీ విద్యార్థి నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్‌నాయక్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో పీడీఎఫ్ ఫెల్లోషిప్‌ను కేంద్రప్రభుత్వం ఇచ్చే విధంగా వర్సిటీ పర్యటనకు వస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్‌కు వినతి పత్రాలు అందచేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను కమిటీ దృష్టికి తేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం నేతలు వెంకట్, దేవేందర్, రమేశ్, సుమన్, సతీశ్, రఘు, అశోక్, రాజ్‌కుమార్, నరేశ్, పవన్, నవీన్, చరణ్, రఘురాం, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల్లో మహిళలకు అవకాశం కల్పించాలి

ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా కమిటీ డిమాండ్

వడ్డెపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నీటి పారుదల శాఖ (ఇరిగేషన్)లో నియమించే ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలలో మహిళలకు అవకాశం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం హనుమకొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు లోనికి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేశ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నీటి పారుదల శాఖలో ఉన్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలతోపాటు జిల్లాలోని అన్ని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు అవకాశాన్ని కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని, సీఎస్ శాంతికుమారిని కోరారు. సమావేశంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు బి.రంజిత్, పి.రవి, సాంబయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్ఐ దాతృత్వం

కేయూకు 60 కంప్యూటర్లు అందించిన పులి రవి

కేయూ క్యాంపస్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, ప్రవాస భారతీయుడు పులి రవి సహకారంతో హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ 60 కంప్యూటర్‌లను అందచేసింది. మంగళవారం రాత్రి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్, కేయూ పీఆర్‌వో వల్లాల పృథ్వీరాజ్ వాటిని స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ కృషితో పులి రవి 60 కంప్యూటర్లను అందచేశారని అన్నారు. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పూర్వ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణకు, ఎన్‌ఆర్ఐ రవికి కృతజ్ఞతలు తెలిపారు.




కంప్యూటర్లను పరిశీలిస్తున్నరిజిస్ట్రార్ మల్లారెడ్డి, పీఆర్‌వో వల్లాల పృథ్వీరాజ్

స్టడీ

దూరవిద్యతోనూ ఉజ్వల భవిష్యత్

- అందరికీ అందించడమే లక్ష్యంగా ఎదిగిన ఎస్డీఎల్‌సీఈ
- ఆధునిక పద్ధతుల్లో బోధనకు కసరత్తు
- డిజిటల్ ఎడ్యుకేషన్ దిశగా అడుగులు



ఎస్డీఎల్‌సీఈ కేంద్రం

కేయూ క్యాంపస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చారిత్రక కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్య కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మమైందిగా పేరుతెచ్చుకుంది. పేద, మధ్య తరగతి వర్గాలకు ఉన్నత విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేస్తోంది. 1989లో ఎంఫిల్ కోర్సుతో పురుడు పోసుకున్న కేయూ దూరవిద్య కేంద్రం ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎదిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న డిజిటల్ మోడ్ ఎడ్యుకేషన్‌ను కేయూ దూరవిద్య కేంద్రం పుణికిపుచ్చుకుని దేశంలోని అన్ని వర్సిటీలకు దీటుగా సేవలందిస్తోంది. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ కేతవరపు రామకోటిశాస్త్రి మొదలు ప్రొఫెసర్లు మురళీ మనోహర్, వాసిరెడ్డి భాస్కర్‌రావు, కూరపాటి వెంకట నారాయణ, రవిప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఎన్.లింగమూర్తి, చింతకాయల దినేశ్‌కుమార్, ఎన్.విజయ, ఎర్రగట్టు స్వామి, గుగులోత్ వీరన్న తదితర డైరెక్టర్లు ఈ కేంద్రానికి దశదిశను చూపారు. మారుతున్న కాలానికనుగుణంగా యూజీసీ డెబ్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) నూతన విధానాలను తీసుకొచ్చింది. దేశంలో ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. రెగ్యులర్ కోర్సులతో పాటు దూరవిద్య కేంద్రం అందిస్తున్న కోర్సులకు సమాన ప్రాధాన్యం కల్పించింది. యూజీసీ డెబ్ తీసుకున్న నిర్ణయాలు దేశంలోని దూరవిద్య కేంద్రాలకు గుదిబండగా మారాయి. వెంకటేశ్వర వర్సిటీ దూరవిద్య విధానానికి అనుమతి రద్దు చేసింది.

అలాగే నాగార్జున వర్సిటీకి కొన్ని కోర్సులకు అనుమతి నిరాకరించింది. వీటితో పాటు అనేక వర్సిటీల దూరవిద్య కేంద్రాలకు అనుమతులను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో వరంగల్ ఎస్డీఎల్‌సీఈని కాపాడేందుకు ప్రస్తుత ఎస్డీఎల్‌సీఈ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉన్న కేంద్రాన్ని మూసివేయకుండా పునర్వైభవం తెచ్చేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టారు.

సెమిస్టర్ పుస్తకాల ముద్రణ

యూజీసీ డెబ్ నిబంధనల మేరకు ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ మొదటి సెమిస్టర్ కోర్సులకు ప్రామాణిక పుస్తకాలను ముద్రించింది. సైకాలజీ, ఇంగ్లిష్, సోషియాలజీ, సోషల్ వర్క్స్, సంస్కృతం, హిందీతో పాటు ఇతర అన్ని కోర్సుల పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందిస్తోంది.

తరగతుల నిర్వహణ

కొవిడ్ కారణంగా పనిచేసుకుంటూ చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొనగా.. చదువుపై ఆసక్తి కలిగిన వారు పని చేసుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు సాధిస్తున్నారు. తరగతులకు వెళ్లని వారికి పుస్తకాలు, పాఠ్యాంశాలు అశనిపాతంగా మారాయి. 2023-24 ఏడాది నుంచి తప్పనిసరిగా డిగ్రీ, పీజీ కోర్సుల్లో సెమిస్టర్ విధానాన్ని అనుసరించాలని నిబంధనలు పెట్టింది. గతంలోనూ సెమిస్టర్ బోధన చేయాలని చెప్పినా ఏడాదికేడాది సెమిస్టర్ విధానాన్ని వాయిదా వేస్తోంది. ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన జరుగుతోంది. ఏడాదిలో కోర్సులను బట్టి తరగతులు ఏర్పాటు చేస్తారు.

12 వేల మంది విద్యార్థులకు బోధన

దూరవిద్య కేంద్రంలో ప్రస్తుతం 12 వేల మంది విద్యార్థులకు యూజీ, పీజీతో పాటు ఇతర డిప్లొమా కోర్సుల్లో విద్య అందుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల్లో స్టడీ సెంటర్లు ఉండగా యూజీసీ నిబంధనల మేరకు వర్సిటీ విస్తరించిన ఉన్న ప్రాంతాల్లోనే ఎస్డీఎల్‌సీఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలనే నిబంధనతో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ పరిధిలోనే స్టడీ సెంటర్లు, పరీక్షల కేంద్రాలను కుదించింది. ఒకప్పుడు దేశంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులకు చాలా రకాల కోర్సులను అందించిన కేయూ దూరవిద్య కేంద్రం ప్రస్తుతం బీకాం, బీకాం కంప్యూటర్స్, ఎంఏ, ఎంఎస్సీ అందిస్తోంది. మొత్తం 33 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తోంది. బీఏ, బీకామ్, బీఎస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో తదితర కోర్సులకు నిర్వహిస్తోంది.

ఇక నుంచి అంతా ఆన్‌లైన్‌లోనే..

కేయూ దూరవిద్య కేంద్రం పూర్తిగా ఆన్‌లైన్‌కి అప్‌గ్రేడ్ అవుతోంది. జనవరి మొదటివారంలో ఎస్డీఎల్‌సీఈ నూతన సాఫ్ట్‌వేర్ విధానాన్ని అనుసరించనుంది. వెబ్‌ను రూపొందించారు. ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ వల్లూరి రామచంద్రం, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే అనుభజ్ఞులైన ప్రొఫెసర్లతో అన్ని విభాగాల పాఠ్యాంశాలు, వీడియో పాఠాలను రికార్డు చేసేందుకు ఆధునిక వీడియో ల్యాబ్‌ను ఎస్డీఎల్‌సీఈలో అందుబాటులోకి తెచ్చారు. ఒక్కసారి వీడియో, ఆడియో పాఠాలను రికార్డు చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే విద్యార్థులకు వీలైనప్పుడు చూడవచ్చు. దూరవిద్యలో అడ్మిషన్లు, సర్టిఫికెట్ల జారీ, సమస్త సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తామని డైరెక్టర్ రామచంద్రం వెల్లడించారు. అలాగే ట్రాకింగ్ సిస్టంను అందుబాటులోకి తేనున్నారు. దీంతో తమ దరఖాస్తులు ఏ దశలో ఉన్నాయి. తమకు ఎస్డీఎల్‌సీఈ సేవలు ఎప్పుడు లభిస్తాయో తెలుసుకునే వీలు కలుగుతోంది.

ఎస్డీఎల్‌సీఈలో అన్ని కోర్సులకు అనుమతి

వల్లూరి రామచంద్రం, కేయూఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్



ఎంఏ తెలుగు, సైకాలజీతో పాటు బీఏ కోర్సులకు యూజీసీ డెబ్ నిబంధనల మేరకు అన్ని అర్హతలున్నా కోర్సులకు అనుమతులు తీసుకువచ్చాం. విద్యా రంగంలో వస్తున్న డిజిటల్ టెక్నాలజీ, స్వయం పోర్టల్ కోర్సుల నేపథ్యంలో కేయూ దూరవిద్య కేంద్రాన్ని ఎప్పటికప్పుడూ అప్‌గ్రేడ్ చేస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన, ప్రామాణిక విద్యను అందిస్తున్నాం. దూరవిద్య కోర్సులన్నీ రెగ్యులర్ విద్యకు సమానమని యూజీసీ నిర్ణయించిన నేపథ్యంలో పాత పద్ధతులు పోయి నూతన విధానాలను తీసుకువస్తుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. కేయూ ఎస్డీఎల్‌సీఈకి పునర్వైభవం తీసుకొస్తాం.

కేయూ ఎస్డీఎల్‌సీఈకి అంతర్జాతీయ గుర్తింపు

వరంగల్ కేయూ దూరవిద్య కేంద్రం అంతర్జాతీయ గుర్తింపు పొందింది. యూజీ, పీజీ కోర్సులతో పాటు దేశంలోని ఏ వర్సిటీలో లేని ప్రొఫెషనల్ కోర్సులను అందించింది. న్యాయశాస్త్రం, ఎడ్యుకేషన్ అందించింది. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో అత్యున్నత ఉద్యోగాలు పొందారు. దూరవిద్య సెలబస్ ప్రామాణికంగా ఉంటుందని గుర్తింపు లభించింది. ఎస్డీఎల్‌సీఈలో చదివిన విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1, 2 అధికారులు, టీచర్లు, పోలీసులు, లాయర్లు, ఇతర ఉద్యోగాలు సాధించి ప్రజలకు సేవలందిస్తున్నారు.

డిగ్రీ అడ్మిషన్‌కు తప్పనిసరి ఇంటర్

కేంద్ర ప్రభుత్వం యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు తప్పనిసరిగా ఇంటర్/తత్సమాన విద్యార్హతను నిర్ణయించింది. గతంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించే విధానానికి స్వస్తి పలికారు. రెగ్యులర్/ ఓపెన్ ఇంటర్ చదివిన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తున్నారు. దూరవిద్య కేంద్రంలో డిగ్రీ కోర్సుల్లో చదివే వారి సంఖ్య పడిపోతుంది. అలాగే వర్సిటీ పరిధిలోని జిల్లాల్లోనే స్టడీ సెంటర్లతో పాటు పరీక్షల కేంద్రాల ఏర్పాటు చేయాలనే నిబంధనలు వర్సిటీ దూరవిద్య కేంద్ర అభివృద్ధికి అటంకంగా మారాయి. గతంలో వందల సంఖ్యలో స్టడీ సెంటర్లు వేలాది సంఖ్యలో ఉన్న విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 44 స్టడీ సెంటర్లు ఉన్నాయి.

రావమ్మా మహాలక్ష్మి..

ఆడబిడ్డకు పూలబాటతో స్వాగతం



కేసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వారికి తొలుత ఇద్దరు కుమారులు జన్మించారు. కానీ అమ్మాయి కావాలన్న ఆకాంక్ష నెరవేరకపోవడంతో ఆ దంపతులు మూడోసంతానం కోసం వేచిచూశారు. ఈ క్రమంలో మూడో సంతానంగా అమ్మాయి జన్మించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తమ కుటుంబంలోకి 'మహాలక్ష్మి' ఆడపిల్ల రూపంలో వచ్చిందని ఆ దంపతులు, కుటుంబసభ్యులు పూలబాట వేసి స్వాగతం పలికారు. మహ బూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లికి చెందిన పొడకంటి క్రాంతికుమార్, సుమ దంపతులకు ఈనెల 10న మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో ఆడపిల్ల జన్మించింది. మంగళవారం సుమ డిశ్చార్జి అయి కూతురితో తమ ఇంటికి రాగా కుటుంబస భ్యులు పూలబాట ఏర్పాటు చేసి 'రావమ్మా మహాలక్ష్మి' అంటూ ఆ శిశువుకు స్వాగతం పలకడం విశేషం. ఆడపిల్లపై అంతలా ప్రేమానురాగాలు చూపిస్తున్న ఆ కుటుంబాన్ని చూసి పలువురు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

రైట్.. రైట్.. పోనియ్ బాస్..
కోతుల పని పడదాం



కోతుల నుంచి పంటలను కాపాడుకునేందుకు కేసముద్రం మండలం కల్వలకు చెందిన రైతు ఆకుల సుధాకర్ కొన్నేళ్లుగా కొండెంగను పెంచుతున్నాడు. కొండెంగను చెల్కవద్దకు తీసుకువెళ్లగానే పంటపొలాల పరిసర ప్రాంతాల్లో ఉన్న వానరాలు కంటికి కానరాకుండా పారిపోతున్నాయి. దీంతో ఆయన నిత్యం కొండెంగను ఇంటి నుంచి చెల్క వద్దకు ఇలా బైకుపై తీసుకు వెళుతుంటాడు. ఈ క్రమంలో ఆ కొండెంగ కూడా సుధాకర్ పిలవగానే రైట్.. రైట్ పోనియ్ బాస్... కోతుల పని పడదాం.. పదా..' అన్నట్టుగా బైకుపై వెనుక కూర్చోవడం అలవాటు చేసుకుంది. రోజులాగే మంగళవారం కొండెంగను చెల్కవద్దకు తీసుకెళుతూ కనిపించారు సుధాకర్.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

కానిస్టేబుళ్లకు అతి ఉత్కృష్ట సేవా పతకాలు

హనుమకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే అతి ఉత్కృష్ట సేవా పతకానికి కేయూసీ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మల్లారెడ్డితోపాటు హనుమకొండ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.మహేశ్‌లు ఎంపికయ్యారు. అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన మల్లారెడ్డి దామెర మండలం కొగిలివాయి గ్రామానికి చెందినవారు. 1990లో పోలీసు కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరి గూడూరు, కొత్తగూడ, సంగెం, సుబేదారి పోలీసు స్టేషన్లలో పని చేసి పోలీసు జిల్లా అధికారుల నుంచి పలు రివార్డులు, ప్రశంసాపత్రాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవ, ఉత్తమ సేవా పతకాలను మల్లారెడ్డి అందుకున్నారు. అలాగే హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన మహేశ్ 1996లో కానిస్టేబుల్‌గా చేరి సీసీఎస్, విఎల్స్‌కాలనీ, జనగామ పోలీసు స్టేషన్లలో సమర్థవంతంగా విధులు నిర్వహించి అధికారుల నుంచి పలు రివార్డులతోపాటు జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. అతి ఉత్కృష్ట సేవా పతకాలకు ఎంపికైన మల్లారెడ్డి, మహేశ్‌లను పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా అభినందించారు.


మల్లారెడ్డి


మహేశ్

పట్టుదలే ఆమె మనోధైర్యం

- పేదరికాన్ని అధిగమించి రాణించిన యాకమ్మ
- ఇంటర్‌లో వివాహమైనా నిత్యవిద్యార్థిగా ఎదిగిన పేద మహిళ
- ఉపాధ్యాయురాలిగా విధులు..
- సాహితీ రంగంలోనూ గుర్తింపు

స్ఫూర్తి


డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల... కృషి.. సమయస్ఫూర్తి ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని రుజువు చేశారు నిరుపేద దళిత మహిళ డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ. మహబూబాబాద్ పట్టణానికి చెందిన రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబంలో జన్మించిన యాకమ్మ.. తన తల్లిదండ్రులు అబ్బయ్య, అబ్బమ్మ పడిన కష్టాలను చూస్తూ పెరిగారు. ఎలాగైనా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తల్లిదండ్రుల స్థోమతకు తగ్గట్టుగా ఆమె ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారు. గుమ్ముడూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ నుంచి 5వ తరగతి వరకు, స్థానిక బాలికోన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేశారు. అయితే ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు పూర్తికాగానే తల్లిదండ్రులు 1996లో మహబూబాబాద్ పట్టణానికి చెందిన సోమారపు వీరస్వామితో వివాహం చేశారు. మే నెలలో ఇంటర్ ఫలితాలు రాగా యాకమ్మ ఇంగ్లీష్‌లో ఫెయిల్ అయింది. వెంటనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసిన యాకమ్మ ఉత్తీర్ణత సాధించారు. ఈ క్రమంలో యాకమ్మకు చదువుపై ఉన్న శ్రద్ధ, ఆసక్తిని గమనించిన భర్త వీరస్వామి ఆమెను ప్రోత్సాహించారు. అదేసమయంలో ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సీటు రాగా.. ఆమెతో పాటు అక్కడే గది అద్దెకు తీసుకుని ఆయన ఆటోడ్రైవర్‌గా ఉంటూ ఆమెను చదివించారు. అలా 1996-1999లో డిగ్రీ పూర్తిచేసిన ఆమె 1999-2000 విద్యాసంవత్సరంలో తెలుగు పండిట్‌లో ప్రవేశం పొంది హన్మకొండ ప్రభుత్వ బీఈడీ కళాశాలలో పండిట్ కోర్సు పూర్తిచేశారు. 2000-2002లో కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ తెలుగులో పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తిచేశారు. 2001లో నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యారు. 2002 సంవత్సరం చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల్లో కురవి మండలంలోని కాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధుల్లో చేరారు. అయినా ఆమె పట్టుదలతో నిత్యవిద్యార్థినిగా రాణించారు. కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ బన్న ఐలయ్య ప్రోత్సాహం, ఆశిస్సులతో పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులను పూర్తిచేశారు. తమిళనాడు మధురై కామరాజ్ యూనివర్సిటీలో 2005 సంవత్సరంలో ఎంఫిల్ పట్టా అందుకున్నారు. 2013లో స్టేట్ ఎలిజిబిలిటి టెస్ట్(సెట్), 2014లో నేషనల్ ఎలిజిబిలిటి టెస్ట్(నెట్)కు అర్హత సాధించారు. 2016లో ద్రవిడ యూనివర్సిటీ కుప్పంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. 2017లో కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ (సంస్కృతం) పూర్తిచేశారు.


యాకమ్మను సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు (ఫైల్)

ఆమె కూతురు గాయత్రి ఎంబీబీఎస్ కాకతీయ మెడికల్ కళాశాలలో పూర్తి చేశారు. కుమారుడు కళ్యాణ్ హైదరాబాద్ ఎంజీఐటీలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నారు. ఇంటర్‌లో ఫెయిలైనా నిరుత్సాహ పడకుండా చదువే జీవితంగా పట్టుదలతో ఉన్నత శిఖరాలను అందుకున్న యాకమ్మ నేటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పత్ర సమర్పణలు చేశారు.

ముద్రించిన పుస్తకాలు

2017లో బోయ జంగయ్య సాహిత్య అనుశీలన, 2018లో మమతల మల్లెలు-కథల సంపుటి, 2019లో జగడం ఒక పరిశీలన, 2020లో కెరటం దళిత నవల, రక్షణ కథల సంపుటి, 2021లో మట్టిబంధం కవితా సంపుటి, 2022లో దుఃఖనది కరోనా కథలు.

అందుకున్న అవార్డులు ..

యాకమ్మ చదువులోనే కాదు సాహితీ రంగంలో కూడా తనదైన ముద్ర వేశారు. అనేక కథలు, కవితలు, నవలలు, రచనలు చేసి అవార్డులు అందుకున్నారు. 2017లో మదర్ ఫౌండేషన్ వరంగల్ సేవా రత్న జాతీయ అవార్డు, కాలగమనం కథకు అక్షరాలతోవకు జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి, 2018లో అక్షర శిఖరం కవితలకు జాతీయస్థాయి పురస్కారం, 2019లో బిఎస్ రాములు ప్రతిభా పురస్కారం, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, కెరటం నవలకు ద్వితీయ బహుమతి, మమతల మల్లెలు కథా సంపుటికి డాక్టర్ పుట్ల హేమలత స్మారక పురస్కారం, సాహితీరత్న పురస్కారం, సాహితీసేవ పురస్కారాలు, 2022లో రాష్ట్ర ఉత్తమ రచయిత అవార్డు, కలెక్టర్, ఎంపీల చేతుల మీదుగా ఉత్తమ రచయిత అవార్డు, మంత్రి సత్యవతిరాథోడ్, కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ కవితా పురస్కారం, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2023లో నందివాడ రత్నశ్రీ, పర్సా సైదులు స్మారక పురస్కారాలు, జాతీయస్థాయి కవితల పోటీల్లో ప్రథమ బహుమతి పురస్కారం, వెన్నెల గొడుగు కవితకు జాతీయస్థాయి ఉత్తమ కవిత పురస్కారం, 2024లో కెరటం నవలకు ఉత్తమ గ్రంథ ప్రతిభా పురస్కారం అందుకున్నారు.


రజితను ప్రశంసిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ (ఫైల్)

మహిళా సంఘాలకు గవర్నర్ ప్రశంస

వరంగల్ జిల్లాలో ఉన్న స్వయం సహాయక మహిళా సంఘాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన సెర్ప్ డైరెక్టర్లు, బ్యాంకు రాష్ట్రస్థాయి అధికారులకు నిర్వహించిన సద స్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఇల్లందకు చెందిన కొంగ రజితకు మాట్లాడే అవకాశం వచ్చింది. ఉపాధిలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న రజి తను సెర్ప్ సీఈవో సంపదీప్ సుల్తాన్యా చేతుల మీదుగా సైతం గతంలో రాష్ట్రస్థాయి స్త్రీ శక్తి అవార్డును వర్ధన్నపేట మండలం సొంతం చేసుకుంది. ఇలా జిల్లా, రాష్ట్ర స్థాయిలో వరంగల్ జిల్లా స్వయం సహాయక సంఘాలు ముందంజలో ఉండడం అధికారులు, మహిళల సమన్వయం, చైతన్యమే కారణంగా చెప్పుకుంటున్నారు.

స్వయం ఉపాధితో.. సాధికారత వైపు

- ఉపాధి రంగంలో సుస్థిరత కోసం మహిళల ముందడుగు
- యూనిట్ల ఏర్పాటులో ఇల్లంద మహిళల ముందంజ
- జిల్లా, రాష్ట్రస్థాయిలో పురస్కారాలు
- రుణాల మంజూరులో ఏపీఎం, సీసీల తోడ్పాటు
- ఉమ్మడి జిల్లా ఓరుగల్లు సమాఖ్య పదవుల్లోనూ ఇక్కడి మహిళలే..
- చైతన్యం చాటుతున్న ఇల్లంద అతివకు గవర్నర్ ప్రశంస

స్ఫూర్తి


రాష్ట్రస్థాయి స్త్రీ శక్తి అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఇల్లంద మహిళలు (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. ఉద్యోగాలు చేయడం గొప్పగా భావిస్తున్న సమయంలో వారే యజమానులుగా మారి మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తూ మహిళా లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం తోడవడంతో మరింత మెరుగైన ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్నారు. కుటీర పరిశ్రమల నుంచి వ్యవసాయం, పాడి, ఆధునిక సాంకేతిక ఉపాధి వైపు మళ్లుతున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు కేవలం పొదుపు చేయడం, రుణాలు తీసుకోవడంతోనే సరిపెట్టకుండా తమ కాళ్లపై తాము నిలదొక్కుకునేలా ఉపాధికి బాటలు వేసుకునేందుకు ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా అవకాశాలు కల్పిస్తోంది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఈ అవకాశాలను వినియోగించుకోవడంలో ముందంజలో ఉందనే చెప్పాలి.

ఎస్‌హెచ్‌జీ (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు పొందడంలో సైతం ప్రభుత్వ లక్ష్యానికి దగ్గరగా పని చేస్తున్నారు. జిల్లాలో 11 మండలాలకు గాను 11,438 స్వయం సహాయక సంఘాలు ఉండగా, 435 గ్రామైఖ్య సంఘాలున్నాయి. ఈ సంఘాల్లోని మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన మైక్రో ఎంటర్ ప్రైజెస్ (విలేజ్ న్యూ ఎంటర్‌ప్రైజెస్) పేరుతో ప్రత్యేకంగా వ్యాపారాల ఏర్పాటుకు రుణాలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 6352 మందిని లక్ష్యంగా నిర్ణయించగా వందశాతం స్వయం సహాయకులను గుర్తించి యూనిట్లు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

మహిళల ముందంజ..

వర్ధన్నపేట మండలం ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధిస్తోంది. ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో 427 యూనిట్లకు గాను ఇప్పటికే 300 మందికి పైగా అందించారు. ఇక రూ. లక్ష నుంచి రెండు లక్షల వరకు ఇచ్చే ఇందిరా మహిళా శక్తి పథకంలో సైతం ముందంజలో ఉన్నారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను ఈ ఏడాది రూ. 45 కోట్ల టార్గెట్ పెట్టగా, రూ.18 కోట్ల రుణాలు అందించడంతో పాటు మరో 15 కోట్ల వరకు ప్రాసెస్‌లో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇక మండలంలోని ఇల్లందలో పీఎంఈజీపీ పథకం కింద దాదాపు 10మందికి పైగా రూ.10 లక్షల రుణాలు అందించడంలో అధికారులు సఫలీకృతమయ్యారు. వర్ధన్నపేట ఏపీఎం వేణు, సీసీ గోలి కొమురయ్యలు బ్యాంకు మేనేజర్లతో స్వయంగా మాట్లాడి మహిళలను ప్రోత్సహించడంలో సత్ఫలితాలు సాధిస్తున్నారు.

అధ్యక్ష స్థానాల్లోనూ పెద్దపీట

ఉమ్మడి జిల్లా మహిళా సంఘాల అధ్యక్ష స్థానాల్లోనూ వర్ధన్నపేట మండలం తనదైన ముద్రను వేసుకుంటోంది. మొట్ట మొదటిగా సారిగా ఉమ్మడి జిల్లా మహిళా సమైఖ్య సంఘానికి, ప్రస్తుత మునిసిపాలిటీ కౌన్సిలర్ తోటకూరి రాజమణి అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా ఓరుగల్లు మహిళా సమైఖ్య అధ్యక్షురాలిగా ఇల్లంద గ్రామానికి చెందిన ఎడ్ల అరుణ వ్యవహరిస్తున్నారు.

గతంలో వరంగల్ జిల్లాకు కడారిగూడెం గ్రామానికి చెందిన చెన్న సమ్మక్క, గోలి రజితలు వ్యవహరించారు. ఇలా ప్రతిసారి ఉమ్మడి, జిల్లా స్థాయిలో వర్ధన్నపేట మండలానికి పెద్ద పీట వేస్తూ మహిళలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు.

పీఎంఈజీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


గోలి కొమురయ్య, సీసీ, ఇల్లంద



ఇల్లంద గ్రామ మహిళల్లో ఉపాధి మార్గం ఎంచుకోవాలనే తపన ఉంది. దీని ద్వారా ఉత్పత్తులు, సర్వీస్ అందించే కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం. ఈ క్రమంలో పలు ఉత్పత్తుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయించాం. కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, రెడీమేడ్ గార్మెంట్స్, ఫొటో స్టూడియో, ఇంటర్‌నెట్ సెంటర్, ఆయిల్ మిల్లు, పిండి గిర్ని వంటి వాటిని ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళల్లో చైతన్యం నింపడం సంతోషంగా ఉంది.

మహిళలు ఆర్థిక సాధికారత దిశగా నడవాలి

వేణు, ఐకేపీ ఏపీఎం, వర్ధన్నపేట



మహిళలు ఆర్థిక సాధికారత దిశగా నడవాలి. ఉపాధి మార్గాల్లో మెరుగైన యూనిట్‌ను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలనేదే మా ఆలోచన. ఇందు కోసం జిల్లాస్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు అధికారులు, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. డీఆర్డీఏ పీడీ, ఏపీడీ, డీపీఎం అధికారుల సహకారంతో వర్ధన్నపేట మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ కింద రుణాల లక్ష్యాన్ని కూడా అందుకుని మహిళలను ఆర్థికంగా బలోపేతమయ్యేలా చేస్తాం.

నెలకు రూ.60 వేలు సంపాదిస్తున్నా

కె.రజిత, కంప్యూటర్ ఎంబ్రాయిడర్, ఇల్లంద



గతంలో నేను మిషన్ కుట్టేదాన్ని. 2009లో మణికంఠ మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరి పొదుపులు, రుణాలు తీసుకునేదాన్ని. కానీ మారిన ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలను తీసుకువచ్చాయి. ఆ వివరాలను తెలుసుకుని స్వయం ఉపాధి కోసం కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ షాపు పెట్టాలనుకున్నా. పీఎంఈజీపీ స్కీంలో 35శాతం సబ్సిడీతో రూ.10లక్షల లోన్ మంజూరైంది. ఇప్పుడు నెలకు రూ.40వేల నుంచి 60వేల వరకు సంపాదించడంతో పాటు మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నా.

మహిళలను చైతన్యం చేస్తున్నా..

ఎడ్ల అరుణ, ఓరుగల్లు మహిళా సమాఖ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు



ఈ ఏడాది నిర్వహించిన మహిళా సమాఖ్య ఎన్నికల్లో ఇల్లంద నుంచి నాకు ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలిగా అవకాశం దక్కింది. బృందావన మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్న నేను అందరి ప్రోత్సహించడంతో ఈ పదవి చేపట్టా. నిత్యం మహిళలను చైతన్య వంతులను చేయడంలో ముందుంటా. ఇప్పటికే ఉపాధి మార్గాలు ఎంచుకోవడంతో పాటు ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్నా.

జాలీగా, కులాసాగా షికారు చేసే సమయంలో సౌకర్యంగా ఉండే దుస్తుల మీదే దృష్టి పెడతాం! అలాంటి వాటిలో చెప్పుకోదగినవి 'బటన్ డౌన్' డ్రస్సులు. సింపుల్‌గా, స్టైలిష్‌గా ఉండే ఈ రకం దుస్తుల్లో ఇదిగో ఇలా అదరగొట్టేయాలి.

ఫ్యాషన్



భలే 'బటన్ డౌన్'

బటన్ డౌన్ డ్రస్సుల మూలాలు పురుషుల షర్టుల్లో ఉన్నాయి. ఆ చొక్కాల నుంచే షర్ట్ డ్రస్సులు పుట్టుకొచ్చాయి. వాటికి కొత్త హంగులు జోడించి, పైనుంచి కింది వరకూ వరుస గుండీలుండే షర్ట్ డౌన్ డ్రస్సులు రూపొందాయి. కాలర్, ముందు వైపు గుండీలు కలిగి ఉండడం ఈ దుస్తుల ప్రత్యేకత. కాటన్ సిల్క్ లాంటి బిరుసుగా ఉండే ఫ్యాబ్రిక్‌తో ఈ దుస్తులు తయారవుతూ ఉంటాయి. తాజాగా కాటన్, క్రేప్ మొదలైన మెటీరియల్స్‌ను కూడా ఈ దుస్తుల తయారీలో ఉపయోగిస్తున్నారు.

- సన్నగా, నాజూకుగా కనిపించేలా చేసే షర్ట్ డౌన్ డ్రస్సులు డైలీవేర్‌గా కూడా పనికొస్తాయి. వీటిని ధరించడం, నిర్వహించడం తేలిక కాబట్టి డైలీవేర్‌గా, ఈవినింగ్ వేర్‌గా రెండు విధాలా ఉపయోగించుకోవచ్చు.
- పూల డిజైన్లు, జామెట్రిక్ డిజైన్లు, నిలువు చారలు... ఇలా ఎన్నో రకాల డిజైన్లలో ఈ డ్రస్సులు దొరుకుతూ ఉంటాయి. అలాగే ఎన్నో రకాల ఆకట్టుకునే ప్రింటుల్లో కూడా ఈ దుస్తులు రూపొందుతూ ఉంటాయి. కాబట్టి నచ్చిన డిజైన్‌ను ఎంచుకునే వీలుంటుంది.
- వెడ్జెస్, స్టేట్‌మెంట్ జ్యూవెలరీలను జోడించిన బటన్ డౌన్ డ్రస్సులు చిన్న చిన్న పార్టీలకు బాగుంటాయి. ఫ్లాట్స్ హ్యాట్‌లను జోడించిన బటన్ డౌన్ డ్రస్సు క్యాజువల్ వేర్‌గా నప్పుతుంది.



స్లీవ్స్ పొట్టిగా ఉన్నా, పొడవుగా ఉన్నా, స్లీవ్స్ లేకపోయినా, ఎలాంటి స్లీవ్స్ అయినా బటన్ డౌన్ షర్టుకు నప్పుతాయి. స్లీవ్స్‌ను మడవడం మరొక తాజా ఫ్యాషన్.



ట్రక్కులో..

దేశం చుట్టేస్తున్నారు

మన దేశంలో 22 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలను, కొన్ని విదేశాలను సైతం ట్రక్కులో చుట్టేశారు జలజా రతీశ్. తోటికోడలికి, కుమార్తెలకే కాదు... ఎంతోమందికి ట్రక్ నడపడంలో ప్రేరణగా నిలుస్తున్నారు. మరోవైపు ట్రావెల్ వ్లాగ్ కూడా నిర్వహిస్తున్నారు. 'ట్రక్కు డ్రైవింగ్ మహిళలు చేసే పని కాదనేవారికి మేమే సమాధానం' అంటున్న 42 ఏళ్ల జలజ స్ఫూర్తి మంతమైన ప్రయాణం ఆమె మాటల్లోనే...

"నేను పుట్టి పెరిగింది కేరళలోని కొరుత్తాడ్‌లో. చదువు మధ్యలో ఉండగానే పెళ్ళయింది. ఆ తరువాత ఎట్టుమనూర్‌లోని మా అత్తవారి ఇంట్లోకి అడుగుపెట్టాను. నా భర్త రతీశ్ ట్రక్కు డ్రైవర్. సొంతంగా కొన్ని ట్రక్కులు ఉండేవి. దేశంలోని వివిధ ప్రాంతాలకు సరుకులను రవాణా చేసేవారు. ఇంట్లో ఉన్నప్పుడు తను చూసిన ప్రదేశాల గురించి చెబుతూ ఉంటే... నేను కూడా అవన్నీ చూస్తే బాగుంటుందనిపించేది. ఒకసారి "మన పెళ్లిరోజుకు కశ్మీర్ తీసికెళ్తారా" అని అడిగాను. "అలాగే వెళ్దాం! కానీ నువ్వు ట్రక్కు నడిపితేనే తీసికెళ్తాను" అన్నారు. దాంతో ఆయన దగ్గరే ట్రక్కు డ్రైవింగ్ నేర్చుకున్నాను. ఇచ్చిన మాట ప్రకారం ఆయన కశ్మీర్ తీసుకువెళ్ళారు. కానీ నాకు స్టీరింగ్ అప్పగించలేదు. అక్కడి నుంచి వచ్చాక... డ్రైవింగ్ పరీక్షలకు హాజరై... హెవీ వెహికిల్ లైసెన్స్, ఆ తరువాత అప్పుడప్పుడు తక్కువ దూరాలకు ట్రక్కుల్లో సరుకులు చేరవేసేదాన్ని. దూర ప్రయాణం చేసే అవకాశం 2022 ఫిబ్రవరిలో వచ్చింది. ఆ ఏడాది మా పెళ్లి రోజు సందర్భంగా నాకు ఒక ట్రక్కు తాళాలను మా ఆయన అప్పగించారు. కశ్మీర్ వరకూ నేనే ట్రక్కు నడిపాను. ఇది నాకు ఎంతో సంతోషం కలిగించింది. నాలో ఆత్మస్థైర్యాన్ని పెంచింది.

ఆరు రోజులు రోడ్డు మీదే ...

పన్నెండు టైర్లు ఉన్న వాహనంలో... గతుకులు, గుంతలు, ఇరుకైన మలుపులు ఉన్న రోడ్ల మీద సరుకులను రవాణా చెయ్యడం ఒక పెద్ద సవాలు. ఒకసారి జమ్మూ-కశ్మీర్ మధ్య వెళ్తున్నాను. ఒకవైపు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మార్గమధ్యంలో కొండ చరియలు పడి, వాహనాలు ఆగిపోయాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో... దాదాపు ఆరు రోజుల పాటు వాహనాలను అధికారులు ఆపేశారు. కాలకృత్యాల కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న హోటల్‌కు నడిచి వెళ్ళాల్సి వచ్చేది. ఇలాంటి అనుభవాలు ఎన్నో ఎదురైనా... నేను చేసే ప్రతి ప్రయాణం ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తుంది. సాధారణంగా మా ట్రక్కులో నేను, నా భర్త వెళ్తా ఉంటాం. ఒకరు విశ్రాంతి తీసుకుంటే మరొకరం వాహనం నడుపుతాం. పెట్రోల్ బంకుల్లోని వాష్ రూమ్‌లను వాడుకుంటాం. రోడ్డు పక్కన ఆగి వంట చేసుకుంటాం. దానికోసం ఒక స్టవ్, సరుకులు, పాత్రలను మాతోనే తీసుకువెళ్తాం.

అవకాశం వచ్చినప్పుడల్లా... మా కుటుంబం మొత్తం ట్రక్కుల్లోనే పర్యటనలకు వెళ్తున్నాం. దానికోసం క్యాబిన్లలో ఏసీలు కూడా పెట్టించాం. ఎంతో సరదాగా, ఆహ్లాదంగా సాగే ఆ ప్రయాణాల కోసం అందరం ఎంతగానో ఎదురు చూస్తాం. ఇక, దూరప్రాంతాలకు సరుకులు తీసుకువెళ్ళేటప్పుడు... కనీసం ఇద్దరు కుటుంబ సభ్యులు మాతో ఉంటారు. కాబట్టి సమస్యలేదు. ఇది మహిళలు చేసే పని కాదనే వారికి మేమే సమాధానం. 'మహిళా ట్రక్ డ్రైవర్‌గా ఇబ్బందులు లేవా?' అంటే ఉన్నాయి. ప్రతిచోటా మహిళలకు అనువైన టాయిలెట్ సౌకర్యాలు ఉండవు. ఇంటికి రోజుల తరబడి దూరంగా ఉండాల్సి వస్తుంది. సరైన సమయంలో భోజనం చేసే వీలు ఉండదు. కానీ దేశమంతా చూడాలనే నా ఆకాంక్ష... నేను అనుకున్నదానికన్నా వేగంగానే తీరుతోంది. ఇంకా అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, త్రిపుర, మణిపూర్, సిక్కిం, మిజోరం ప్రాంతాలను సందర్శించాలి. అవి కూడా చూసేస్తే... దేశంలోని ప్రతి రాష్ట్రాన్నీ ట్రక్కు నడుపుతూ సందర్శించిన తొలి మహిళను బహుశా నేనే అవుతాను.



అత్తగారి కోరిక తీర్చాం...

ఈ రెండేళ్ళలో నేను మన దేశంలోని ఇరవై రెండు రాష్ట్రాలు, లడఖ్‌తో సహా ఆరు కేంద్ర పాలిత ప్రాంతాలు, నేపాల్, భూటాన్ దేశాలను కూడా ట్రక్కులో చుట్టేసి వచ్చాను. నన్ను చూసి స్ఫూర్తి పొందిన నా తోటికోడలు సూర్య, బీకామ్ చదువుతున్న మా అమ్మాయి దేవిక కూడా హెవీ వెహికిల్ లైసెన్సులు తీసుకొని నాకు తోడయ్యారు. మా మరో అమ్మాయి గోపిక ఇప్పుడు చెన్నైలో బీబీఏ చదువుతోంది. తను కూడా లైసెన్స్ కోసం ఎదురుచూస్తోంది. ఈమధ్యే మా అత్తగారిని ట్రక్కులో ఋషీకేశ్ తీసుకువెళ్ళాం. ఋషీకేశ్‌లో గంగా హారతి చూడాలనే ఆమె కోరిక తీర్చాం. 23 రోజుల పాటు 11 రాష్ట్రాల్లో సాగిన ఈ యాత్రలో ఆమెకు ఎన్నో ప్రదేశాలు చూపించాం.

ఎక్కడికి వెళ్లినా గుర్తుపడుతున్నారు...

ఒక ట్రక్కుతో ప్రారంభమైన మా 'పుతెట్టు ట్రాన్స్‌పోర్ట్'లో ఇప్పుడు దాదాపు ముప్పై ట్రక్కులున్నాయి. ఇవి కన్యాకుమారి నుంచి నేపాల్ వరకూ, గుజరాత్ నుంచి అసోం వరకూ తిరుగుతాయి. వీటి కార్యకలాపాల్లో నేను, సూర్య, దేవిక ప్రధానపాత్ర పోషిస్తున్నాం. మొదట్లో నా ప్రయాణ అనుభవాలను వీడియోలు, ఫొటోలు తీసి స్నేహితులకి, బంధువులకి పంపించేదాన్ని. ప్రతి ఒక్కరికీ అవి నచ్చడంతో... యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించాలనే ఆలోచన వచ్చింది. 'పుతెట్టు ట్రావెల్ వ్లాగ్' పేరుతో మా కుటుంబ సభ్యుల ప్రయాణ అనుభవాల, అనుభూతుల వీడియోలను యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తున్నాం. ప్రస్తుతం దానికి 4.25 లక్షలమంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. స్పందన కూడా బాగుంది. నేను ఎక్కడికి వెళ్ళినా జనం గుర్తుపడుతున్నారు. నాతో మాట్లాడడానికి ఆసక్తి చూపిస్తున్నారు. "మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని భారీ వాహనాల లైసెన్స్ తీసుకున్నాం" అని ఎంతోమంది అమ్మాయిలు చెబుతున్నారు. 'కొత్త ప్రాంతాలను చూడాలి. అక్కడ ప్రజల జీవన విధానాన్ని చూడాలి' అనే ఆకాంక్ష నన్ను ట్రక్కు డ్రైవర్‌గా మార్చింది. నా ఆకాంక్ష నెరవేరడంతో పాట గుర్తింపు లభించింది. ఇంతకుమించి నేను కోరుకొనేది ఇంకేం ఉంటుంది?"

పాదాలూ చెబుతాయి..

మనకు ఉన్న ఆరోగ్య సమస్యలను మన పాదాలకు సంబంధించిన కొన్ని లక్షణాలు చెబుతాయి. వాటిని వెంటనే గమనించి చర్యలు తీసుకుంటే దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడవచ్చు.

- గుండెకు లేదా కాలేయానికి సంబంధించిన సంబంధించిన సమస్యలు కావచ్చు. మన శరీరంలో రక్తాన్ని శుద్ధి చేయటంలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. కాలేయ సమస్యలు ఉన్నప్పుడు కాళ్లు వాస్తాయి. అదే విధంగా కాళ్లకు రక్తప్రసారం సరిగ్గా జరగకపోయినా కాళ్లు వాస్తాయి.
- మహిళల్లో ఈస్ట్రోజెన్ హార్మోన్ల విలువల్లో తేడాలు వచ్చినప్పుడు కాళ్లు వాచే అవకాశముంది. రసజ్వల అయినప్పుడు.. గర్భవతి అయినప్పుడు.. రుతుస్రావం ఆగిపోయే సమయంలోను కాళ్ల వాపులు కనిపిస్తాయి. ఈ వాపు ముఖ్యంగా పాదాల దగ్గర ఎక్కువగా కనిపిస్తుంది.



- కొందరికి మడమల పైభాగంలో వాపు కనిపిస్తూ ఉంటుంది. ఇది ఎక్కువ కాలం తగ్గకపోతే యూరిక్ యాసిడ్ ఎక్కువ అయినట్లుగా భావించవచ్చు.
- కొందరి కాళ్లను జాగ్రత్తగా చూస్తే చిన్న చిన్న నరాలు పైకి ఉబికి ఉంటాయి. వీటిని వైద్య పరిభాషలో 'స్పైడర్ వీన్స్' అంటారు. కాళ్లలోకి రక్తప్రసారం సరిగ్గా లేకపోతే ఇవి ఏర్పడతాయి.
- కొందరికి ప్రతి రోజూ కాళ్ల తిమ్మిరిలు వస్తూ ఉంటాయి. మధుమేహం సమస్య ఉన్నవారికి ఈ సంకేతాలు కనిపించిన వెంటనే వైద్యులకు చూపించుకోవటం మంచిది.

దినచర్య ఇలా

పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు మంచి దినచర్య అలవాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు పిల్లలు ఏ సమయానికి ఏమి చేయాలన్నదాన్ని నిర్ణయించి వారు దాన్ని పాటించేలా చూడాలి. దీనివల్ల పిల్లలకు సమయ పాలన, క్రమశిక్షణ అలవడతాయి. ఆ దినచర్య ఎలా ఉండాలో చూద్దాం!

ఉదయమే లేవాలి: పిల్లలు రాత్రి త్వరగా నిద్రకు ఉపక్రమిస్తే ఉదయం త్వరగా మేలుకొనడానికి వీలవుతుంది. సాధ్యమైనంతవరకు ప్రతిరోజూ ఒక నిర్దిష్ట సమయానికి పడుకొని లేవడం పిల్లలకు అలవాటు చేయాలి. పాఠశాలకు వెళ్లే పిల్లలకు కనీసం ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. నిర్ణీత సమయంలో నిద్ర నుంచి మేలుకొన్నపుడే అన్ని పనులు సమయానుసారం పూర్తవుతాయని పిల్లలకు చెప్పాలి.

గోరువెచ్చని నీళ్లు తాగాలి: పిల్లలు నిద్రలేచిన వెంటనే పళ్లు, నాలుక, నోరు శుభ్రం చేసుకునేలా చూడాలి. తరవాత పరగడుపున ఒక గ్లాసు గోరువెచ్చని నీరు త్రాగే అలవాటు చేయాలి. దీనివల్ల పొట్ట, ప్రేగులు పరిశుభ్రమవడంతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యం బలపడుతుంది. ఈ అలవాటు పిల్లలకు జీవితాంతం ఉపయోగపడుతుంది.

యోగా: ఉదయాన్నే పిల్లలు ధ్యానం, యోగ, ప్రాణాయామం చేసేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. యోగాసనాలు వేయడం వల్ల పిల్లలు శారీరకంగా బలవంతులవుతారు. ధ్యానం వల్ల ఏకాగ్రత శక్తి పెరుగుతుంది. ప్రాణాయామం వల్ల శరీరానికి కొత్త శక్తి సమకూరుతుంది. ఈ అలవాటు వల్ల పిల్లల్లో క్రమశిక్షణ మొదలవుతుంది.

పేరెంటింగ్



అల్పాహారం: ఉదయం అల్పాహారం తీసుకోవడం వల్ల పిల్లలు రోజంతా ఉత్సాహంగా ఉంటారు. అల్పాహారంలో భాగంగా పండ్లు, డ్రై ఫ్రూట్స్, ఉడికించిన కూరగాయలు తినిపించండి. తల్లిదండ్రులు కూడా ఇవే తింటూఉంటే పిల్లలు మారాం చేయకుండా తినడానికి ఆసక్తి చూపిస్తారు.

పాఠశాలకు వెళ్లే ముందు: తల్లిదండ్రులు పిల్లలకు యూనిఫామ్, టై, బెల్ట్, సాక్స్, షూస్ ధరించడం నేర్పించాలి. స్కూల్ టైమ్ టేబుల్ ప్రకారం పుస్తకాలను బ్యాగ్‌లో చక్కగా సర్దుకోవడం, వాటర్ బాటిల్ సిద్ధం చేసుకోవడం చూపించాలి. లంచ్ బాక్స్ తీసుకెళ్లడం మరచిపోవద్దని హెచ్చరించాలి.

హోం వర్క్: పిల్లలు పాఠశాల నుంచి ఇంటికి రాగానే స్నానం చేసి పరిశుభ్రమైన దుస్తులు ధరించే అలవాటు చేయాలి. సాయంత్రం సమయాల్లో ఆరోగ్యకరమైన పౌష్టికాహారం తినిపించాలి. ఆ రోజు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు చదువుకునేలా చూడాలి. పిల్లలకు ఏవైనా సందేహాలుంటే వాటిని తల్లిదండ్రులు తీర్చే ప్రయత్నం చేయాలి. ప్రతిరోజూ ఉపాధ్యాయులు ఇచ్చిన హోం వర్క్‌ను పిల్లలు ఎప్పటికప్పుడు పూర్తిచేసేలా ప్రోత్సహించాలి.

ఆటలు: పిల్లల మానసిక పరిపక్వతకు ఆటలు దోహదం చేస్తాయి. ప్రతిరోజూ కొంత సమయాన్ని ఆటలకు కేటాయించాలి. తోటి పిల్లలతో కలసి మెలసి ఆడుకునేలా చూడాలి.

ఆరోగ్యం

చలి కాలంలో రోగనిరోధకశక్తికి...



శీతాకాలం వచ్చేసింది. చాలా మందికి అడపాదడపా జ్వరం, జలుబు వస్తూనే ఉంటాయి. దీనికి కారణం రోగనిరోధక శక్తి లేకపోవటం. రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవటానికి ఉన్న ఒక సాధనం జీడిపప్పు, బాదం, అక్రూట్, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్. వీటిలో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ప్రొటీన్స్ మన శరీరానికి ఎంతగానో ఉపకరిస్తాయి. అయితే వీటిని నేరుగా తినకుండా నానబెట్టి తినటం వల్ల ప్రయోజనం ఉంటుందంటున్నారు పౌష్టికాహార నిపుణులు. ఆ వివరాలేమిటో చూద్దాం.

బాదం: ప్రొటీన్, ఫైబర్, విటమిన్-ఈ, మెగ్నిషియం, జింక్, ఐరన్ వంటి అనేక పదార్థాలు బాదంలో ఉంటాయి. అయితే బాదంలో ఫైటెక్ యాసిడ్ ఉంటుంది. ఇది జింక్, ఐరన్ వంటివి మన శరీరంలో చేరకుండా అడ్డుపడుతూ ఉంటుంది. బాదంను తినే ముందు నానబెడితే ఈ యాసిడ్ నిర్వీర్యం అవుతుంది.

జీడిపప్పు: జీడిపప్పులో కూడా అనేక రకాల మినరల్స్ ప్రొటీన్లు ఉంటాయి. తినే ముందు- కొద్ది సేపు జీడిపప్పును నానబెడితే శరీరంలోకి మెగ్నీషియం త్వరగా చేరుతుంది. మన శరీరంలోని కండరాలు, నరాల పనితీరుపై ఇది ప్రభావం చూపుతుంది.

వాల్‌నట్స్: మెదడు చురుకుగా పనిచేయటానికి ఉపకరిస్తాయి. వాల్‌నట్స్‌లో టానిన్స్ అనే పదార్థం ఉంటుంది. ఇది జీర్ణప్రక్రియకు అడ్డం పడుతూ ఉంటుంది. అందువల్ల వాల్‌నట్స్‌ను కొద్దిసేపు నానబెడితే ఈ పదార్థం పనితీరులో మార్పు వస్తుంది.

అంజీర్: అంజీర్‌ను పండుగా తినప్పుడు ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ అంజీర్‌ను ఎండబెట్టినప్పుడు దానిలో ఉండే పీచు పదార్థం గట్టి పడుతుంది. అందువల్ల జీర్ణమవటం కష్టమవుతుంది. ఎండు అంజీర్‌లను కొద్ది సేపు నానబెడితే- దానిలో ఉండే ఫైబర్ మెత్తపడుతుంది. త్వరగా జీర్ణమవుతుంది.

పిస్తాలు: పిస్తాలలో కూడా ఫైటెక్ యాసిడ్ ఉంటుంది. అందువల్ల జీర్ణమవటం కష్టమవుతుంది. వీటిని కొద్ది సేపు నానబెడితే ఫైటెక్ యాసిడ్ నిర్వీర్యం అవుతుంది. అప్పుడు పిస్తాపప్పు సులభంగా జీర్ణమవుతుంది.

విభిన్నం

ఆమె 'కృషి'... నేలకు రక్ష..!

నర్సుగా రోగులకు సేవ చేయాలనుకుంది మహారాష్ట్రకు చెందిన కావ్య ధోబలే. కానీ కొవిడ్ మరణాలతో కలత చెందిన ఆమె ప్రభుత్వోద్యోగాన్ని వదిలి సొంతూర్లో సేంద్రియ ఎరువు తయారీ సంస్థను ప్రారంభించింది. వినూత్నమైన ఆలోచనతో రైతులకు ఆదర్శంగా నిలిచిన కావ్య ధోబలే ప్రయాణం ఇది.

కావ్యకు చిన్నప్పటి నుంచి ఇతరులకు సేవ చేయడమంటే చాలా ఇష్టం. నర్సుగా శిక్షణ పొంది తన ఆశయం నెరవేర్చుకోవాలనుకుంది. జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో డిప్లొమా పూర్తి చేసి ముంబయిలోని లోకమాన్య తిలక్ మునిసిపల్ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ (సియాన్ హాస్పిటల్)లో నర్సుగా చేరింది. తరవాత టాటా క్యాన్సర్ హాస్పిటల్‌లో ఉద్యోగం చేస్తూ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకురాలిగా చేరింది. కొన్నాళ్లకు తిరిగి సియాన్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్స్‌గా చేరింది. అదే సమయంలో దేశమంతటా కొవిడ్ వ్యాప్తి చెందింది. ఆసుపత్రికి ఎంతోమంది బాధితులు వచ్చేవారు. వారికి సేవ చేస్తూ తను కూడా కొవిడ్ బారిన పడింది. చావు అంచుల దాకా వెళ్లి బతికింది. అయినా రోగులకు సేవ చేయడం ఆపలేదు కావ్య. రోజుల వ్యవధిలో పెరుగుతున్న మరణాలు చూసి చలించిపోయింది. ఈ సంఘటనలన్నీ ఆమెను ఆలోచనలో పడవేశాయి.



కొవిడ్‌తో కలత చెంది...

ఆసుపత్రికి వస్తున్న కొవిడ్ బాధితులంతా బలహీనంగా ఉండడం గమనించింది కావ్య. శరీరంలో ఇమ్యూనిటీ వ్యవస్థ సరిగా పని చేయకపోవడంవల్లనే మరణాలు సంభవిస్తున్నాయని తెలుసుకుని దానికి కారణాలు అన్వేషించింది. తీసుకునే ఆహారంలో పోషకాలు లేకుండా రసాయన భరితంగా ఉండడంవల్లే శరీరానికి రోగనిరోధకశక్తి లభించడంలేదని తెలుసుకుంది. రసాయనాలు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతులు అనుసరిస్తే ప్రజలకు రసాయన రహిత పోషకాహారం అందించవచ్చని గ్రహించింది కావ్య. వెంటనే తను చేస్తున్న ప్రభుత్వోద్యోగం వదిలి భర్తతో కలసి సొంత గ్రామానికి వచ్చేసింది.

నర్స్ ఉద్యోగాన్ని వదిలి...

కావ్య భర్త రాజేష్. సొంతూరు పుణెలోని దత్‌ఖిలేవాడి. వీరికి అక్కడ అయిదు గుంటల ఖాళీ స్థలం ఉంది. అక్కడ కావ్య స్థానిక రైతులందరినీ సమావేశపరచి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని, అందులో ప్రధానంగా వర్మీ కంపోస్ట్‌ను ఉపయోగిస్తే నేల సారవంతమవడంతో పాటు పంట మొక్కలకు పోషకాలు అందుతాయని చెప్పడం ప్రారంభించింది. దాంతో రైతులందరూ ముక్త కంఠంతో 'అదేదో మీరే చేసి చూపించండి' అనడంతో కావ్య వర్మీ కంపోస్ట్ తయారీని ఆరంభించాలని నిర్ణయించుకుంది.

గత ఏడాది 'కృషి కావ్య బ్రాండ్' పేరుతో అమ్మకాలు ప్రారంభించింది కావ్య. రైతులకు వీటిని నేరుగా అందించడమే కాకుండా ప్రీ బుకింగ్ సర్వీస్ కూడా అందుబాటులోకి తెచ్చింది. రైతులందరూ వీటిని ఉపయోగించి, సేంద్రియ సాగు వైపు అడుగులు వేయాలన్నదే ఆమె ఆశ. వ్యాపారం ప్రారంభించిన మొదటి ఏడాదే ఆమె 24 లక్షల టర్నోవర్ సాధించింది. అందరికీ ఆదర్శంగా నిలిచింది.


ఐదు వందలతో మొదలై...

'వర్మీ కంపోస్ట్ తయారు చేయాలనుకున్నపుడు నేను పెద్దగా పెట్టుబడి పెట్టలేదు. ఒక చిన్న బెడ్‌లో ఒక కేజీ వానపాములను ఆవు పేడలో కలిపి పెట్టాను. దీనికి కేవలం ఐదు వందల రూపాయలు మాత్రమే ఖర్చయింది. రెండు నెలల్లో వర్మీ కంపోస్ట్ తయారైంది. క్రమంగా పది బెడ్ల వరకు పెంచాం. మరో రెండు నెలల్లో అయిదు టన్నుల వర్మీ కంపోస్ట్ సిద్ధమైంది. దీనిని ఉపయోగించిన స్థానిక రైతులు మంచి దిగుబడి సాధించడంతో క్రమంగా డిమాండ్ కూడా పెరిగింది. అప్పుడే ఈ పరిశ్రమను మరింత పెంచాలని నిర్ణయించుకున్నా. ప్రస్తుతం మావద్ద 70 బెడ్లు ఉన్నాయి. ఒక్కో బెడ్‌లో 500 నుంచి 600 కేజీల వర్మీ కంపోస్ట్ సిద్ధమవుతుంది. అలాగే వానపాములను కూడా విరివిగానే పెంచుతున్నాం.'




శిక్షణ ఇస్తూ

వర్మీ కంపోస్ట్ తయారీకి సంబంధించి ట్రెయినింగ్ సెంటర్‌ను ప్రారంభించింది కావ్య. ఇందులో ఔత్సాహికులకు ఒక రోజు శిక్షణ ఉంటుంది. తనవద్ద శిక్షణ పొందిన 200 మంది ఇప్పటికే వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారని ఇది తనకెంతో ఆనందాన్నిస్తుందని చెప్పుకొచ్చింది. వ్యవసాయ పద్ధతులను వివరిస్తూ యూ ట్యూబ్ ఛానెల్‌ను కూడా నిర్వహిస్తోంది. పలువురు రైతులతో మాట్లాడి వారి అనుభవాలను ఈ ఛానెల్ ద్వారా అందరికీ అందుబాటులో ఉంచుతోంది.










ధనుష్, నాగార్జున హీరోలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మల్టీస్టారర్ 'కుబేర'. సంపద చుట్టూ అల్లుకున్న కథతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న చిత్రమిది. మంగళవారం నాగార్జున పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. తన చుట్టూ సంపదను ప్రతిబింబించే వస్తువులు ఎన్ని ఉన్నా జీవితంలో విలువైనదేదో కోల్పోయినట్లు విషాదంగా

కుబేరుడి కొత్త లుక్

కనిపించారు నాగార్జున. "కుబేర' చిత్రీకరణ చివరి దశలో ఉంది. పాటల చిత్రీకరణ మిగిలి ఉంది. నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నెల 15న 'కుబేర' ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేస్తాం' అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రంలో రష్మిక మందన్న కథానాయిక. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు నిర్మిస్తున్నారు. సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

వీరుడి పేరు... పౌర్ణమి రోజు





పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, నెత్తురంటిన గొడ్డలిని చేతబూని రౌద్రరూపంలో కనిపించారు నందమూరి బాలకృష్ణ. బాబీ కొల్లి దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ('ఎన్‌బీకే 109'- వర్కింగ్ టైటిల్) చిత్రం పోస్టర్‌లోనిదీ దృశ్యం. ఈ భారీ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో బాలకృష్ణ కనిపించనున్నారు. చిత్రబృందం మంగళవారం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసి, ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా 'ఎన్‌బీకే 109' టైటిల్‌ను వెల్లడించనున్నట్లు తెలిపింది. దాంతోపాటు టీజర్‌ను విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ప్రస్తుతం తుదిదశ చిత్రీకరణ జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బాబీడియోల్ ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: విజయ్ కార్తీక్ కన్నన్

జీబ్రా సూపర్‌హిట్ అవుతుంది

చిరంజీవి



'సత్యదేవ్‌లాంటి విలక్షణ నటుల కొరత తెలుగు పరిశ్రమలో ఉంది. తను అద్భుతమైన నటుడే అయినా అతనికి మంచి సినిమాలు పడడం లేదనిపించేది. ఆ లోటును 'జీబ్రా' చిత్రం తీరుస్తుందని నమ్ముతున్నాను. ఈ సినిమా కచ్చితంగా సూపర్ హిట్ అవుతుంది' అని చిరంజీవి అన్నారు. సత్యదేవ్ కథానాయకుడిగా ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన చిత్రం 'జీబ్రా'. ఈ నెల 22న విడుదలవుతోంది. చిత్ర బృందం మంగళవారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించింది. చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై 'జీబ్రా' ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "జీబ్రా చిత్రం మంచి కంటెంట్‌తో వస్తోంది. సత్యదేవ్, ధనంజయ్, సత్యరాజ్ లాంటి ప్రతిభావంతులైన నటులు ఉన్నారు. వినోదంతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి' అని చెప్పారు. సత్యదేవ్ మాట్లాడుతూ 'చిరంజీవి గారు నాపైన నమ్మకంతో 'గాడ్‌ఫాదర్' సినిమాలో అవకాశం ఇచ్చారు. ఆ సినిమా వల్లే మా నిర్మాతలు 'జీబ్రా' సినిమాలో నాకు అవకాశం ఇచ్చారు. ఇక నుంచి ప్రేక్షకులు కొత్త సత్యదేవ్‌ను చూస్తారు' అని అన్నారు. ఈశ్వర్ కార్తీక్ మాట్లాడుతూ 'సత్యదేవ్, డాలీ ఇద్దరూ అద్భుతంగా నటించారు. ప్రేక్షకులకు మంచి సినిమాను అందించబోతున్నాం. పతాక సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయి' అని తెలిపారు. వినూత్నమైన కథతో జీబ్రాని తెరకెక్కించామని నిర్మాత ఎస్.ఎన్ రెడ్డి చెప్పారు. ఇదొక కంప్లీట్ ఫ్యామిలీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అని డాలీ ధనంజయ్ అన్నారు.

మన హీరోలకు ఏం తక్కువ?

డైరెక్టర్ కరుణకుమార్



వరుణ్ తేజ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మట్కా' ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కరుణకుమార్ మీడియాతో మాట్లాడుతూ "మట్కా' కథకి ఆలోచన ఒక మ్యారేజ్ ఫంక్షన్‌లో వచ్చింది. ఇక్కడే ఈ గేమ్ గురించి మొదటి సారి విన్నాను. ఈ గేమ్ ఎవరిదని రీసెర్చ్ చేశాను. వాస్తవానికి దీని గురించి తెలుసుకున్నాక 'వాడి పోయిన పూలు' అని ఒక కథ రాద్దామనుకున్నా. మట్కాలో ఒక వెలుగు వెలిగి బలైపోయిన ఓ వ్యక్తి జీవితంపై షార్ట్ స్టోరీ రాద్దామనుకున్నా. అలా మొదలు పెట్టిన తర్వాత ఇది సినిమా మెటీరియల్ అని నాకు అర్థమైంది. దీనిని తిరిగి సినిమా వర్షన్‌లో కథ రాసుకున్నా. చాలా మంది తమిళ సినిమాలు బాగుంటాయి, కన్నడ సినిమాలు బాగుంటాయి, హిందీ సినిమాలు బాగుంటాయి అని అంటుంటారు. కానీ, మన తెలుగువాళ్లు తీసిన సినిమాలు ఇప్పటి వరకూ ఎవరూ తీయలేదు. ఆ సత్యాన్ని గుర్తించడం లేదు. బెంగాలీ సాహిత్యం తరవాత బెస్ట్ సాహిత్యం ఉన్నది తెలుగులోనే. ఒక తమిళ సినిమా వస్తే మనం సూపర్‌హిట్ చేసి ఆదరిస్తాం. రజనికాంత్ హోదా సూపర్‌స్టార్. ఇక్కడ కూడా ఆయనను సూపర్ స్టార్ హోదాలోనే ఆదరిస్తున్నాం. రజనీకాంత్ కంటే చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్ ఏ విధంగా తక్కువ?. 'మట్కా' పక్కా కమర్షియల్ సినిమా. ఇందులో కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఉంటాయి. ఆ రోజుల్లో టెలిఫోన్ సౌకర్యం సరిగా లేదు, టెలిగ్రామ్ రెండు రోజులు పడుతుంది. ఒక ట్రంకాల్ బుక్ చేయాలంటే ఆరు, ఏడు గంటలు పడుతుంది. కానీ ప్రతి రోజూ ఐదు గంటలకు దేశం మొత్తం ఒకే నంబరు వస్తుంది. ఇదంతా ఒకరు ఆర్గనైజ్ చేస్తారు. ఇదే నాకు ఇంట్రస్టింగ్ పాయింట్ అనిపించింది కథ రాయడానికి. ఈ సినిమాను వరుణ్ తేజ్‌తో చేస్తే బాగుంటుందని వైరా ప్రొడక్షన్స్ వాళ్లే సూచించారు. ఈ సినిమాలో ఆయన అత్యద్భుతంగా నటించారు' అని అన్నారు.

23 పాత్రల ఎర్రచీర



సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ముఖ్య పాత్రలో నటిస్తున్న చిత్రం' ఎర్రచీర-ద బిగినింగ్'. ఈ సినిమాలో నటుడు రాజేంద్ర ప్రసాద్ మనవరాలు తేజస్విని నటిస్తోంది. ఎస్.వి.వి.సుబ్బారెడ్డి, సీహెచ్ వెంకట సుమన్ నిర్మాతలు. మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ సెంటిమెంట్‌తో ఈ సినిమా తెరకెక్కుతోంది. చిత్ర దర్శకుడు, నటుడు సుమన్ బాబు మాట్లాడుతూ 'యాక్షన్, మదర్ సెంటిమెంట్‌తో ఈ సినిమాను రూపొందించాను. చిత్రంలో 22 పాత్రలతో పాటు ఎర్రచీర 23వ పాత్ర పోషిస్తుంది' అని తెలిపారు. హీరోయిన్ కారుణ్య చౌదరి మాట్లాడుతూ 'సినిమా చూసిన వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటారు. అందరూ మాకు సపోర్ట్ చేయాలని కోరుతున్నా' అని అన్నారు. నిర్మాత అంబికా కృష్ణ మాట్లాడుతూ' ప్రస్తుత ట్రెండ్ ప్రకారం ప్రేక్షకులకు కావాల్సినంత కంటెంట్ ఉన్న చిత్రమిది' అని అన్నారు.

'ప్రతి కథపైనా హీరో పేరు రాసి ఉంటుంది'

ప్రశాంత్ వర్మ



అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో అశోక్ గల్లా, వారణాసి మానస హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ఈ మూవీకి హనుమాన్ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్‌వర్మ కథను అందించారు. సినిమా ఈనెల 22న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. 'ఈ భూమి మీద ఎక్కడా లేని విధంగా సుదర్శన చక్రంతో వాసుదేవుడి విగ్రహం ఉంది' అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభం అవుతుంది. యాక్షన్ సీన్స్ బాగున్నాయి. టాలీవుడ్ నటుడు రానా, హీరో సందీప్ కిషన్, దర్శకుడు ప్రశాంత్‌వర్మ, గల్లా జయదేవ్, రచయిత సాయిమాధవ్ బుర్రా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ గల్లా మాట్లాడుతూ 'రానా నాకు ఎప్పుడూ సపోర్ట్‌గా ఉంటారు. ప్రశాంత్‌వర్మ కథతో డైరెక్టర్ అర్జున్ తన విజన్‌తో మరో మెట్టును ఎక్కించారు' అని అన్నారు. 'ఈ సినిమాలో భాగం అయినందుకు చాలా సంతోషంగా ఉంది. అశోక్‌తో కలసి నటించడం ఫన్నీగా ఉంది' అని హీరోయిన్ వారణాసి మానస అన్నారు. 'ప్రతి కథపైనా హీరో పేరు రాసి పెట్టి ఉంటుందని నేను నమ్ముతాను. ఈ కథను ఏడేళ్ల క్రితం రాసుకున్నా. ఈ సినిమాను అశోక్ గల్లా చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. నా తదుపరి సినిమా అప్డేట్ రెండు వారాల్లో ఇస్తాను' అని ప్రశాంత్ వర్మ అన్నారు.

సీనియర్ దర్శకుడు వీఎస్ బోస్ కన్నుమూత



హీరో కృష్ణతో 'వింత కథ', మురళీమోహన్‌తో 'గ్రహణం విడిచింది' చిత్రాలను రూపొందించిన సీనియర్ దర్శకుడు వీఎస్ బోస్ మంగళవారం ఉదయం విజయవాడలో కన్ను మూశారు. 81 ఏళ్ల బోస్ పూర్తి పేరు వీరపనేని సుభాష్‌చంద్ర బోస్. 'పాతాళ భైరవి', 'మాయాబజార్' వంటి పలు చిత్రాలకు కళా దర్శకత్వం వహించిన కళాధర్ మేనల్లుడు బోస్. విఠలాచార్య, బాపు, జి.విశ్వనాథం, దాదా మిరాసీ వంటి దర్శకుల దగ్గర పదిహేను చిత్రాలకు సహాయ దర్శకుడిగా పని చేశారు. ఎన్టీఆర్‌కు సన్నిహితుడిగా పేరు తెచ్చుకున్నారు. హీరో శోభన్‌బాబుతో ఏరా అంటే ఏరా అనుకునేంత స్నేహం ఉండేది. చాలా కాలం క్రితమే విజయవాడకు వచ్చిన బోస్ అక్కడే సెటిల్ అయ్యారు.



లేహ్‌లో పారా శిక్షణ కేంద్రం

హైదరాబాద్: పారా అథ్లెట్ల కోసం ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ప్రదేశం లద్దాక్‌లోని లేహ్‌లో అత్యుత్తమమైన శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య మెహతా ఫౌండేషన్, లద్దాక్ స్వతంత్ర పర్వతాభివృద్ధి మండలి మధ్య ఒప్పందం కుదిరింది. 2028 పారాలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకొని భారత అథ్లెట్లకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్చరీ, టెన్నిస్, అథ్లెటిక్స్, పవర్ లిఫ్టింగ్, షూటింగ్ ఇలా పలుక్రీడల్లో శిక్షణ ఇస్తారు.

పాక్‌లో పర్యటించడానికి అంధుల జట్టుకు క్రీడాశాఖ అనుమతి

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లో ఈనెల 22 నుంచి జరిగే అంధుల టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొనడానికి డిఫెండింగ్ చాంప్ భారత జట్టుకు క్రీడామంత్రిత్వ శాఖ అనుమతి మంజూరు చేసింది. ఇక.. హోం, విదేశాంగ శాఖల నుంచి గ్రీన్ సిగ్నల్ కోసం జట్టు వేచిచూస్తోంది. ఆయా శాఖల నుంచి అనుమతులు రాగానే వాఘా బోర్డర్ నుంచి 17 మంది సభ్యుల జట్టు ఈ నెల 21న పాక్‌కు బయల్దేరనుంది. కాగా, భారత జట్టు రాకపోయినా టోర్నీని ఆపే ప్రసక్తేలేదని పాకిస్థాన్ అంధుల క్రికెట్ మండలి ప్రకటించింది.

భారత్ ఎందుకు రాదో.. కారణాలు చెప్పండి?

ఐసీసీని కోరిన పీసీబీ

దుబాయ్: పాకిస్థాన్‌లో వచ్చే ఏడాది జరిగే చాంపియన్స్ ట్రోఫీలో ఆడలేమని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు ఐసీసీ తెలియజేసింది. అయితే, బీసీసీఐ నిరాకరించడానికి గల కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఐసీసీని పీసీబీ కోరింది. హైబ్రిడ్ విధానంలో చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించడానికి పీసీబీ నిరాకరిస్తోంది. దీంతో మొత్తం టోర్నీని దక్షిణాఫ్రికాకు తరలించాలన్న ఆలోచనలో ఐసీసీ ఉన్నట్టు సమాచారం. అదే జరిగితే ఏకంగా టోర్నీనే బహిష్కరించాలని పాక్ భావిస్తోందట.



అర్జున్ అదరహో

నోయిడా: అర్జున్ దేశ్వాల్ 19 పాయింట్లతో చెలరేగడంతో జైపూర్ పింక్ పాంథర్స్ ఈ సీజన్‌లో నాలుగో విజయం అందుకుంది. మంగళవారం జరిగిన ఈ పోరులో జైపూర్ 39-32తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది. పుణెరి పల్టన్-దబాంగ్ ఢిల్లీ మధ్య జరిగిన మరో మ్యాచ్ 38-38తో టైగా ముగిసింది.

బ్యాటింగ్ మెరుగైతేనే..!

రాత్రి 8.30 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో..

నేడు మూడో టీ20

- బౌలర్లపై అధిక భారం
- విజయమే లక్ష్యంగా టీమిండియా
- జోష్‌లో దక్షిణాఫ్రికా





సెంచూరియన్: నాలుగు టీ20ల సిరీస్ రసవత్తరంగా మారింది. తొలి మ్యాచ్‌లో భారత్.. ఆ తర్వాత ఆతిథ్య దక్షిణాఫ్రికా ఘనవిజయాలతో నువ్వా.. నేనా? అనే రీతిలో చెలరేగుతున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం జరిగే కీలక మూడో టీ20లో ఇరు జట్లు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగబోతున్నాయి. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు సిరీస్ కోల్పోయే అవకాశం ఉండదు. అయితే రెండు మ్యాచ్‌ల్లో భారత్ తరఫున బౌలర్లు మాత్రమే అంతో ఇంతో రాణించగలిగారు. కానీ అనూహ్యంగా బ్యాటింగ్ ఆర్డర్ నుంచి మాత్రం ఎలాంటి సహకారమూ అందలేదు. సంజూ శాంసన్ మెరుపు సెంచరీ కారణంగానే తొలి మ్యాచ్‌లో నెగ్గగలిగాం. కానీ రెండో టీ20లో బ్యాటర్లు ప్రత్యర్థి పేసర్లకు దాసోహమయ్యారు. చివర్లో హార్దిక్ షాట్ల కారణంగా స్కోరు 120 దాటగలిగింది. భారత్ ఇక్కడ ఆడిన ఒకే టీ20 మ్యాచ్ (2018లో)లో ఆరు వికెట్ల తేడాతో ఓడింది. హార్దిక్ మాత్రమే అప్పటి జట్టులో ఉన్నాడు. అటు సఫారీలు మాత్రం రెట్టించిన ఉత్సాహంతో ఉన్నారు. వారి బ్యాటింగ్ కూడా ఫామ్‌లో లేకపోయినా ఆఖర్లో ఒత్తిడిని తట్టుకుని స్టబ్స్, కొట్జీ జట్టును గెలిపించారు. బౌలర్లు సూపర్ ఫామ్‌లో ఉండడంతో మరో విజయంతో ఆధిపత్యం చూపాలనుకుంటోంది.

మార్పులుంటాయా?

ఓపెనర్‌గా అభిషేక్ శర్మ వైఫల్యం జట్టు శుభారంభంపై ప్రభావం పడుతోంది. వరుసగా విఫలమవుతున్న అతడిని కొనసాగించడం సందేహమే. అతడిని పక్కనబెడితే శాంసన్‌కు జతగా తిలక్ వర్మను పంపి.. ఆల్‌రౌండర్ రమణ్‌దీప్ సింగ్‌ను బరిలోకి దించే అవకాశం ఉంది. అతడి రాకతో మిడిలార్డర్‌లో బ్యాటింగ్ బలపడుతుంది. అలాగే కెప్టెన్ సూర్య, రింకూ సింగ్ ఈ సిరీస్‌లో పెద్దగా ప్రభావం చూపలేదు. హార్దిక్ రెండో మ్యాచ్‌లో 39 రన్స్ చేసినా 45 బంతులు తీసుకున్నాడు. తొలి బౌండరీ కోసమే 28 బంతులు ఆడాల్సి వచ్చింది. కాబట్టి శాంసన్‌కు తోడుగా ఈ ముగ్గురు చెలరేగితేనే భారత్ భారీ స్కోరు చేయగలుగుతుంది. పేసర్ అర్ష్‌దీప్ డర్బన్ మ్యాచ్‌లో ఆకట్టుకున్నా.. రెండో టీ20లో దెబ్బతీశాడు. అతడి చివరి రెండు ఓవర్లలో 28 పరుగులివ్వడం స్వల్ప స్కోరు ఛేదనలో తీవ్ర ప్రభావం చూపింది. ఒకవేళ వైశాక్, యష్‌లలో ఒకరిని పరీక్షిస్తారేమో చూడాలి. స్పిన్నర్లు వరుణ్, బిష్ణోయ్‌లను ఎదుర్కోవడంలో సఫారీ బ్యాటర్లు తెగ ఇబ్బందిపడుతున్నారు. నేటి మ్యాచ్‌లోనూ వీరే కీలకం కానున్నారు.

దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఆర్డర్ తమ సొంత గడ్డపై కూడా ఎలాంటి ప్రభావమూ చూపడం లేదు. కెప్టెన్ మార్‌క్రమ్‌తో పాటు క్లాసెన్, మిల్లర్‌పై జట్టు భారీగా ఆశలు పెట్టుకుంది. కానీ రెండు మ్యాచ్‌ల్లోనూ ఈ త్రయం దారుణంగా విఫలమైంది. సన్‌రైజర్స్ రూ.23 కోట్లతో అట్టిపెట్టుకున్న క్లాసెన్ కొంత కాలంగా ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్నాడు. మూడో టీ20లో భారత్‌పై సులువుగా గెలవాలంటే వీరిలో ఇద్దరైనా రాణించాల్సి ఉంటుంది. స్టబ్స్, కొట్జీ పుణ్యమాని రెండో మ్యాచ్‌లో గెలవగలిగారు. బౌలింగ్‌లో పేసర్లు, స్పిన్నర్లు పరుగులను కట్టడి చేస్తూనే వికెట్లను రాబడుతుండడం సానుకూలాంశం కానుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), శాంసన్, తిలక్ వర్మ, హార్దిక్, అక్షర్, రింకూ, రమణ్‌దీప్, అర్ష్‌దీప్, బిష్ణోయ్, అవేశ్, వరుణ్ చక్రవర్తి.

దక్షిణాఫ్రికా: హెన్‌డ్రిక్స్, రికెల్టన్, మార్‌క్రమ్ (కెప్టెన్), స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, కేశవ్, కొట్జీ, సిమలానె, సిపామ్లా.

పిచ్, వాతావరణం

సెంచూరియన్ పార్క్ పేసర్లకు స్వర్గధామం. ఇక్కడి బౌన్స్, పేస్ వికెట్ వారికి అనుకూలంగా ఉంటుంది. అలాగే బ్యాటర్లు పరుగులు సాధించడం కష్టమే. అదనపు బౌన్స్‌తో స్పిన్నర్లు కూడా లాభపడతారు. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంటుంది.

హాకీ అమ్మాయిల రెండో గెలుపు

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ



రాజ్‌గిర్ (బిహార్): ఆసియా హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత మహిళలు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేశారు. మంగళవారం జరిగిన పోరులో భారత్ 3-2తో దక్షిణ కొరియాను ఓడించింది. మలేసియాతో జరిగిన తొలి మ్యాచ్‌లో డబుల్ గోల్స్‌తో విజృంభించిన సంగీతా కుమారి (3వ నిమిషం) కొరియాతో పోరులోనూ సత్తాచాటుతూ ఓ గోల్ కొట్టింది. ఇక, దీపిక (20వ, 57వ) రెండు గోల్స్‌తో చెలరేగింది. ఆతిథ్య భారత్ తమ మూడో మ్యాచ్‌ను గురువారం థాయ్‌లాండ్‌తో ఆడనుంది. ఇక, మంగళవారం జరిగిన ఇతర మ్యాచుల్లో జపాన్, థాయ్‌లాండ్ జట్ల మధ్య పోరు 1-1తో డ్రాగా ముగియగా.. చైనా 5-0తో మలేసియాపై గెలిచింది. చైనాకు ఇది వరుసగా రెండో విజయం.

హైదరాబాద్ X ఆంధ్ర

నేటి నుంచి ఉప్పల్‌లో రంజీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్-ఆంధ్ర జట్ల రంజీ మ్యాచ్ ఇక్కడి ఉప్పల్ స్టేడియంలో బుధవారం నుంచి జరుగనుంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన నాలుగింట్లో ఒక్క మ్యాచ్‌లోనూ రెండు తెలుగు జట్లు స్థాయికి తగిన ప్రదర్శన చేయలేదు. రంజీ ప్లేట్ నుంచి ఈ ఏడాది ఎలీట్ గ్రూప్‌లోకి వచ్చిన హైదరాబాద్ ఆడిన నాలుగింట్లో రెండింట్లో ఓడిపోయి, ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. పసికూన పుదుచ్చేరిపై గెలిచి పరువు దక్కించుకుంది. కెప్టెన్ తిలక్ వర్మ అందుబాటులో లేకపోవడం, ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్, అభిరథ్ రెడ్డి నిలకడ లేమి, ఆరంభ స్పెల్‌లో ప్రత్యర్థి బ్యాటర్లను వణికించే నాణ్యమైన పేసర్ లేని లోటు జట్టులో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అయితే, మిడిలార్డర్‌లో కెప్టెన్ రాహుల్ సింగ్, గత మ్యాచ్ సెంచరీ హీరో హిమతేజ, ఆల్‌రౌండర్ సీవీ మిలింద్, స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ సొంతగడ్డపై చెలరేగితే ఆంధ్రను నిలవరించవచ్చు. మరో వైపు ఆంధ్ర జట్టు హనుమ విహారి, కేఎస్ భరత్, కర్ణ్ షిండే వంటి హేమాహేమీ సీనియర్లతో ఉన్నా విజయాలు మాత్రం వరించడం లేదు. ఈ సీజన్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింట్లో ఓడిపోయి, ఓ మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. రికీ భుయ్ అందుబాటులో లేకపోవడంతో అనూహ్య పరిస్థితుల్లో జట్టు పగ్గాలు అందుకున్న షేక్ రషీద్‌కు సీనియర్లను సమన్వయం చేసుకోవడం కత్తిమీద సాముగా మారింది.



బరిలోకి షమి

బెంగాల్‌కు ప్రాతినిధ్యం

ఇండోర్: దాదాపు ఏడాది తర్వాత పేసర్ మహ్మద్ షమి మైదానంలోకి దిగనున్నాడు. బుధవారం నుంచి మధ్యప్రదేశ్‌తో జరిగే రంజీ మ్యాచ్‌లో అతను బెంగాల్ తరఫున బరిలోకి దిగబోతున్నాడు. గతేడాది వన్డే వరల్డ్ కప్ ముగిశాక ఈ వెటరన్ పేసర్ గాయం కారణంగా క్రికెట్‌కు దూరమయ్యాడు. అయితే వీలైనంత త్వరగా జాతీయ జట్టులో పునరాగమనం చేయాలనే కసితో ఉన్న షమి ఈ మ్యాచ్ ద్వారా ఫిట్‌నెస్ నిరూపించుకోనున్నాడు. ఇందులో రాణిస్తే ఆసీస్ టూర్‌లోని భారత టెస్టు జట్టులోనూ చోటు దక్కే అవకాశం లేకపోలేదు.



స్టార్ల సమరం

టాటా స్టీల్ చెస్ నేటి నుంచే

కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నమెంట్ బుధవారం ఇక్కడ మొదలవనుంది. ఈనెల 17 వరకు జరిగే ఈ మెగా టోర్నీలో అంతర్జాతీయ స్టార్లు పోటీపడుతున్నారు. ఓపెన్, మహిళల విభాగాల్లో ర్యాపిడ్, బ్లిట్జ్ కేటగిరిల్లో పోటీలుంటాయి. ప్రపంచ నెంబర్‌వన్ కార్ల్‌సన్, వెస్లీ సో, విన్సెంట్ కేమర్‌తో పాటు భారత ఏస్ ఆటగాళ్లు అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతి, నిహాల్ సరీన్ బరిలో ఉన్నారు. మహిళల్లో కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి, దివ్యా దేశ్‌ముఖ్, అలెగ్జాండ్రా కోస్తెన్యుక్, వాలెంటినా లాంటి ప్రపంచ క్రీడాకారిణులు తలపడుతున్నారు.

గాయత్రి జోడీ పరాజయం

కుమమొటో (జపాన్): గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ జపాన్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో నిరాశపరిచింది. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి పోరులో ప్రపంచ 20వ ర్యాంక్ ద్వయం గాయత్రి/ట్రీసా 16-21, 16-21తో సూ యిన్ హూ/లిన్ యిన్ హూ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలైంది.

బోపన్న జోడీ.. ఓటమితో మొదలు

ట్యూరిన్ (ఇటలీ): ప్రతిష్ఠాత్మక ఏటీపీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత స్టార్ రోహన్ బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ తమ డబుల్స్ పోరును పరాజయంతో ప్రారంభించింది. తమ గ్రూప్ తొలి మ్యాచ్‌లో ఆరో సీడ్ బోపన్న ద్వయం 2-6, 3-6తో సిమోన్ బొలెల్లి/ఆండ్రీ వవాసొరి (ఇటలీ) చేతిలో ఓటమి పాలైంది.

పసిడి దిగొచ్చింది..

రూ.77,800కు 10 గ్రా. ధర
కిలో వెండి రూ.2,700 డౌన్

ఒక్కరోజే రూ.1,750 తగ్గుదల



న్యూఢిల్లీ: బులియన్ ధరలు క్రమంగా కొండ దిగుతున్నాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మంగళవారం రూ.1,750 తగ్గుదలతో రూ.77,800కు జారుకుంది. కిలో వెండి రూ.2,700 తగ్గి రూ.91,300కు పరిమితమైంది. బంగారం, వెండి రేటు తగ్గడం వరుసగా ఇది రెండో రోజు. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయంగానూ జువెలర్ల నుంచి డిమాండ్ తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. కాగా, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో 2,600 డాలర్లకు పడిపోగా.. వెండి 30.43 డాలర్లకు తగ్గింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ స్పష్టమైన మెజారిటీతో విజయం సాధించడంతో అంతర్జాతీయంగా డాలర్ బలం పుంజుకుంది. ఇందుకు తోడు, ట్రంప్ మలివిడత పాలనలో రష్యా-ఉక్రెయిన్‌తో పాటు పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధాలకు తెరపడేందుకు అవకాశాలు పెరగడంతో అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారం, వెండికి డిమాండ్‌కు ఒక్కసారిగా పడిపోయింది. ఔన్స్ గోల్డ్ ఈ మధ్య నమోదు చేసిన ఆల్‌టైం రికార్డు స్థాయి 2,800 డాలర్ల స్థాయి నుంచి 200 డాలర్ల మేర క్షీణించింది. మున్ముందు మరింత తగ్గి 2,500 డాలర్లకు పడిపోవచ్చన్న అంచనాలున్నాయి.

నాట్కో ఫార్మా లాభం రూ.677 కోట్లు

ఒక్కో షేరుకు రూ.1.5 మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాట్కో ఫార్మా.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. ఆదాయాలు గణనీయంగా పెరగటంతో జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏకంగా 83 శాతం వృద్ధి చెంది రూ.676.50 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.369 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా 35.3 శాతం వృద్ధితో రూ.1,060.80 కోట్ల నుంచి రూ.1,434.90 కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు త్రైమాసికంలో దేశీయ ఫార్మా వ్యాపారం నిలకడగా ఉండటంతో పాటు ఫార్ములేషన్స్ ఎగుమతులు మెరుగ్గా ఉండటం కలిసివచ్చిందని నాట్కో ఫార్మా పేర్కొంది. ఫలితాలు ప్రోత్సాహకరగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.1.50 రెండో మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపులకు నవంబరు 25ను రికార్డు తేదీగా ఖరారు చేసింది. డిసెంబరు 2 నుంచి ఈ డివిడెండ్ చెల్లింపులు ప్రారంభించనుంది.

స్ట్రింగ్ మెటావర్స్ ఆదాయం రూ.138 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్ట్రింగ్ మెటావర్స్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్ధానికి గాను రూ.12.13 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఈ కాలంలో కంపెనీ రెవెన్యూ రూ.137.82 కోట్లుగా ఉంది. కంపెనీ ఈ మధ్యనే బీఎస్ఈలో లిస్ట్ అయ్యింది. దివాలా ప్రక్రియ (ఐబీసీ)లో భాగంగా సీఐఆర్‌పీ ముసాయిదా కింద ఉన్న బయో గ్రీన్ పేపర్స్ లిమిటెడ్‌తో స్ట్రింగ్ మెటావార్స్ ఇటీవల విలీనమైంది. ఈ విలీనానికి ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. వెబ్3 గేమింగ్, కృత్రిమ మేధ (ఏఐ), బ్లాక్‌చెయిన్ టెక్నాలజీల్లో కంపెనీ సాధించిన విజయాలకు ఈ ఫలితాలు నిదర్శనంగా ఉన్నాయని సంస్థ సీఈఓ సంతోష్ అల్తూరు తెలిపారు.

రూ.5.29 లక్షల కోట్లు ఫట్

భారీగా తగ్గిన స్టాక్ మార్కెట్ సంపద

- 23,900 దిగువకి నిఫ్టీ
- బ్యాంకింగ్, పవర్, ఆటో షేర్లు విలవిల

సెన్సెక్స్ 821 పాయింట్లు పతనం



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ 79,000, నిఫ్టీ 24,000 స్థాయిలను కోల్పోయాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ, అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, పవర్, వాహన రంగ షేర్లలో భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణం. ఒక దశలో 948 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్.. చివరికి 820.97 పాయింట్ల (1.03 శాతం) నష్టంతో 78,675.18 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 257.85 పాయింట్లు (1.07 శాతం) పతనమై 23,883.45 వద్ద ముగిసింది.

సూచీ నష్టపోవడం ఇది నాలుగో రోజు. అమ్మకాల హోరులో స్టాక్ మార్కెట్ సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.29 లక్ష కోట్లకు పైగా తగ్గి రూ.437.24 లక్షల కోట్లకు (5.18 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 24 నష్టాలు చవిచూశాయి. ఎన్‌టీపీసీ షేరు 3.16 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఎస్‌బీఐ, టాటా మోటార్స్, మారుతి సుజుకీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్‌గ్రిడ్ షేర్లు రెండు శాతానికి పైగా నష్టపోయాయి.
- బీఎస్ఈలోని చిన్న, మధ్య స్థాయి కంపెనీల ప్రాతినిధ్య సూచీలైన స్మాల్‌క్యాప్ 1.26 శాతం, మిడ్‌క్యాప్ 0.98 శాతం తగ్గాయి. రంగాలవారీ సూచీల్లో పవర్ 2.79 శాతం, యుటిలిటీస్ 2.20 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.14 శాతం నష్టపోయాయి. ఆటో, ఇండస్ట్రియల్స్, మెటల్ ఇండెక్సులు 1.95 శాతం వరకు విలువను కోల్పోయాయి. రియల్టీ, ఐటీ సూచీలు మాత్రం లాభపడ్డాయి.
- బీఎస్ఈలో 4,061 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,791 నష్టపోయాయి. 1,181 కంపెనీల స్టాక్ లాభపడగా.. 89 యథాతథంగా ముగిశాయి. 71 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది కనిష్ఠానికి జారుకున్నాయి.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక పైసా తగ్గి సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి 84.39 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 0.56 శాతం పెరిగి 72.23 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

స్విగ్గీ ఉద్యోగులకు జాక్‌పాట్

ఒక్కో ఉద్యోగికి రూ.1.8 కోట్ల ఈ-సాప్స్

ఫుడ్ డెలివరీ యాప్ 'స్విగ్గీ' పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) లిస్టింగ్ ఆ కంపెనీ ఉద్యోగులను కోటీశ్వరులను చేస్తోంది. ఐపీఓ కంటే ఎంతో ముందే తన 5,000 మంది ఉద్యోగులకు ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్ (ఈ-సాప్స్) కింద పెద్ద మొత్తంలో షేర్లు కేటాయించింది. బుధవారం స్విగ్గీ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టు కానున్నాయి. ఐపీఓ అప్పర్ ప్రైస్ బ్యాండ్ రూ.390 వద్ద లిస్టయినా ఒక్కో ఉద్యోగి వద్ద ఉన్న షేర్ల సగటు విలువ రూ.1.8 కోట్లకు చేరుతుందని (మొత్తం విలువ రూ..9,000 కోట్లు) మార్కెట్ వర్గాల అంచనా.

హైదరాబాద్‌లో గ్లోబల్ లాజిక్ డెలివరీ కేంద్రం

హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ కొలువు తీరింది. హిటాచీ గ్రూప్ కంపెనీ, డిజిటల్ ఇంజనీరింగ్ సేవల్లో పేరొందిన గ్లోబల్‌లాజిక్ హైదరాబాద్‌లో తన డెలివరీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 600 మంది ఇంజనీర్లతో ప్రారంభించిన ఈ కేంద్రాన్ని వచ్చే మూడేళ్లలో 2,000కు విస్తరిస్తామని తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	535
వరంగల్	522	గోదావరి	540
చిత్తూరు	593	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	114
వరంగల్	100	గుంటూరు	110
కరీంనగర్	100	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	102
కర్నూలు	100	నెల్లూరు	102
విశాఖపట్నం	108	అనంతపురం	102
గోదావరి	114		

దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ వేటు

రూ.5 లక్షల వరకు డిపాజిట్లు సేఫ్

ముంబై:ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కేంద్రంగా పనిచేసే దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (డీసీయూబీ) లైసెన్సును భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రద్దు చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని మంగళవారం ప్రకటించింది. బ్యాంకు ఆర్థిక పరిస్థితి క్షీణించడం, తిరిగి గాడిలో పడే అవకాశం లేకపోవడంతో డిపాజిటర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది. అయితే బ్యాంకులో రూ.5 లక్షల వరకు డిపాజిట్లు ఉన్న ప్రతి ఒక్క డిపాజిట్ చెల్లింపునకు.. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) హామీ ఉంటుందని ప్రకటించింది. లిక్విడేటర్‌ను నియమించి బ్యాంక్ మూసివేతకూ చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల రిజిస్ట్రార్, కమిషనర్‌ను ఆర్‌బీఐ కోరింది. లైసెన్సు రద్దుతో దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డిపాజిట్లు సేకరించడం గానీ, రుణాల మంజూరు గానీ చేయకూడదని కూడా ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,290 ▼	70,850 ▼	1,00,000 ▼
ముంబై	74,900 ▼	68,608 ▼	88,252 ▼

బిజినెస్

బిట్‌కాయిన్ బిరబిరా..

- 90,000 డాలర్లకు చేరువైన ధర
- ఒక్కరోజే 10 శాతం పెరుగుదల

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవడం క్రిప్టో కరెన్సీ మార్కెట్‌కు సరికొత్త ఊపునిచ్చింది. ప్రముఖ క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ విలువ 90,000 డాలర్లకు చేరువైంది. సోమవారం ట్రేడింగ్‌లో బిట్‌కాయిన్ ఏకంగా 10 శాతం వృద్ధితో 89,623 డాలర్ల వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసింది. మంగళవారం ట్రేడింగ్‌లో స్వల్పంగా తగ్గినప్పటికీ, మున్ముందు సెషన్లలో బిట్ కాయిన్ సరికొత్త గరిష్ఠాలకు ఎగబాకనుందని క్రిప్టో మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నెల 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగిన రోజు నుంచి ఇప్పటివరకు బిట్‌కాయిన్ విలువ 25 శాతానికి పైగా పుంజుకుంది. మరో క్రిప్టో కరెన్సీ ఈథర్ ఏకంగా 30 శాతం ఎగబాకింది. అమెరికాను క్రిప్టోల రాజధానిగా తీర్చిదిద్దుతానని, బిట్‌కాయిన్‌ల వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటు చేస్తానని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ప్రకటించారు. అంతేకాదు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు అవసరమైన విరాళాలను క్రిప్టోల్లోనూ స్వీకరించారు. ట్రంప్ సానుకూల వైఖరితో ఈ వర్చువల్ కరెన్సీల విలువ మున్ముందు మరింత పెరగవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

మళ్లీ ధరల మంట

అక్టోబరులో 6 శాతం దాటిన ద్రవ్యోల్బణం
14 నెలల గరిష్ఠ స్థాయి

న్యూఢిల్లీ: దేశంలో ఆహార వస్తువుల ధరలు మండిపోతున్నాయి. ఫలితంగా అక్టోబరు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠ స్థాయి 6.21 శాతానికి దూసుకుపోయింది. గత ఏడాది జూలై తర్వాత రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం. ప్రధానంగా పళ్లు, కూరగాయలు, మాంసం, చేపలు, ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ ధరలు కొండెక్కాయి. పప్పులు, అనుబంధ ఉత్పత్తులు, గుడ్లు, చక్కెర, కన్ఫెక్షనరీ విభాగాల్లో మాత్రం ధరలు గణనీయంగా తగ్గాయి. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం అక్టోబరు నెలలో ఉమ్మడి ఆహార ధరల సూచీ (సీఎఫ్‌పీఐ) 10.87 శాతానికి దూసుకుపోయింది. ఇది 15 నెలల గరిష్ఠ స్థాయి. సీఎఫ్‌పీఐ సెప్టెంబరు నెలలో 9.24 శాతం ఉంది. దీంతో వచ్చే నెలలో నిర్వహించనున్న సమీక్షలో కూడా ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించే ఆస్కారం లేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పోకర్ణ ఇంజనీర్డ్ స్టోన్ రూ.440 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పోకర్ణ లిమిటెడ్ అనుబంధ సంస్థ పోకర్ణ ఇంజనీర్డ్ స్టోన్ లిమిటెడ్ (పీఈఎస్ఎల్)..రూ.440 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. తెలంగాణలోని మేకగూడలోని క్వార్ట్జ్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ మొత్తాలను వినియోగించనున్నట్లు తెలిపింది. విస్తరణలో భాగంగా మూడో బ్రెటోన్‌స్టోన్ ఉత్పత్తి లైన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. 2026 మార్చి నాటికల్లా ఈ కొత్త లైన్ వాణిజ్యపరంగా అందుబాటులోకి వస్తుందని తెలిపింది. అంతర్జాతీయంగా ప్రీమియం క్వార్ట్జ్ సర్ఫేస్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేందుకు ఈ విస్తరణ దోహదపడుతుందని పీఈఎస్ఎల్ సీఎండీ గౌతమ్ చంద్ జైన్ తెలిపారు. కాగా ఈ మొత్తాలను పూర్తిగా అంతర్గత వనరులు, రుణాల రూపంలో సమీకరించనున్నట్లు పోకర్ణ వెల్లడించింది.

క్యూ2 లాభం రూ.45 కోట్లు: సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో పోకర్ణ లిమిటెడ్ రూ.253.46 కోట్ల కన్సాలిడేటెడ్ రెవెన్యూపై రూ.44.95 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.33.04 కోట్లుగా ఉండగా రెవెన్యూ రూ.203.86 కోట్లుగా ఉంది.

పంతం వద్దని సీఎంకు గతంలోనే చెప్పా

» లగచర్ల ప్రజలు చేసింది వంద శాతం తప్పే: డీకే అరుణ

» ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రాజెక్టు వద్దు: ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



వికారాబాద్, హైదరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఫార్మా కారిడార్ ఏర్పాటు విషయంలో పంతానికి పోవద్దని ముఖ్యమంత్రికి తాను గతంలోనే చెప్పానని బీజేపీ ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఫార్మా బాధితుల విషయమై తాను కలెక్టర్‌తో ముందే మాట్లాడానని చెప్పారు. లగచర్లలో జరిగిన ఘటన దురదృష్టకరమని, అలాంటి దాడులను ఎవరైనా ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. సీఎం సొంత నియోజకవర్గంలో ఇంత జరుగుతుంటే నిఘా విభాగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి వికారాబాద్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఫార్మా కంపెనీలు తమకు వద్దని లగచర్ల సహా ఐదు గ్రామాలు ఎప్పట్నించో వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. భూసేకరణకు వ్యతిరేకంగా గతంలోనూ ధర్నాలు చేశారని, ఆయా నిరసనల్లో తాను పాల్గొన్నానన్నారు. లగచర్ల ప్రజలు చేసింది వందశాతం తప్పేనని, అసలు ఏం జరిగిందో తెలుసుకునేందుకు బుధవారం తాను లగచర్లలో పర్యటిస్తానని డీకే అరుణ ప్రకటించారు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. లగచర్ల ఘటనలో తప్పు చేసిన వారిని శిక్షించాలని, రైతులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. లగచర్ల ఘటనలో రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. ఫార్మా కంపెనీలకు తాము వ్యతిరేకం కాదని, ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రాజెక్టులు పెట్టొద్దని ఆయన కోరారు.

రైతులపై అక్రమ కేసులు పెడితే ఊర్కోం : ఈటల

లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెడితే ఊరుకోబోమని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫార్మా పరిశ్రమకు భూమి అవసరమైతే ఆ కంపెనీ యాజమాన్యమే సేకరిస్తుందని ప్రభుత్వ మధ్యవర్తిత్వం అవసరం లేదన్నారు. రైతుల ఇష్ట ప్రకారమే భూ సేకరణ చేయాలి తప్ప, బలవంతంగా తీసుకునే అధికారం ప్రభుత్వానికి లేదని ఈటల స్పష్టం చేశారు. కాగా, లగచర్ల ఘటనపై ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తనపై దాడి జరగలేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేసినా గ్రామాల్లో నిర్బంధం విధించి 50 మందిపై అక్రమ కేసులు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కేటీఆర్ ఢిల్లీలో ఉన్నప్పుడే సీఎం రేవంత్ అక్కడికి వెళ్లడం వెనక మతలబు ఉందని కాసం అన్నారు.

రైతుల ముసుగులో బీఆర్ఎస్ నేతల దాడి

» 'అమృత్' టెండర్లపై కేటీఆర్‌వి డొల్ల ఆరోపణలు: మల్లు రవి

న్యూఢిల్లీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో భూసేకరణ కోసం వెళ్లిన కలెక్టర్‌పై బీఆర్ఎస్ నేతలే రైతుల ముసుగులో దాడి చేశారని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఆరోపించారు. ప్రజా ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయాలని బీఆర్ఎస్ పథకం ప్రకారం కుట్రలు చేస్తోందన్నారు. మంగళవారం ఇక్కడ తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్‌పై దాడికి సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆదేశాల ప్రకారమే ఆ పార్టీ నేతలు దాడి చేశారని ఆరోపించారు. దాడి చేయించి, కేటీఆర్ ఢిల్లీ వచ్చి బీజేపీ పెద్దలను కలిశారన్నారు. తెలంగాణలో అమృత్ పథకం టెండర్లపై కేటీఆర్ చేసినవి డొల్ల ఆరోపణలు అని, బీజేపీ నేతలను రెచ్చగొట్టి సీఎం రేవంత్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

బలవంతంగా భూములు లాక్కోవద్దు: తమ్మినేని

హైదరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతుల భూములను బలవంతంగా లాక్కోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో జరిగిన ఘటన రైతుల ఆగ్రహాన్ని సూచిస్తుందని ఆయన అన్నారు. జీవనాధారమైన భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశ్రమలకు ఇవ్వబోమని రైతులు పదే పదే చెబుతున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల ఫార్మా సిటీపై ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట మార్చడంతో అక్కడ కూడా ఆందోళనలు సాగుతున్నాయని తమ్మినేని చెప్పారు. ఈ ఘటనలతోనైనా ప్రభుత్వం భూసేకరణ పట్ల తన వైఖరిని మార్చుకుని పరిశ్రమల కోసం వ్యవసాయానికి పనికిరాని భూములను మాత్రమే సేకరించాలని డిమాండ్ చేశారు.

లగచర్లలో ఫార్మా పరిశ్రమ ఏర్పాటు చేయొద్దు

» తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

లగచర్లలో ఫార్మా పరిశ్రమ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కోరింది. ఈ మేరకు ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మలు మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఫార్మా కంపెనీని రద్దు చేయలేదని కోర్టులో చెప్పిన పాలకులు, వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఫార్మా పరిశ్రమ ఏర్పాటుకు ఎందుకు ప్రయత్నాలు కొనసాగించారని ప్రశ్నించారు. లగచర్లలో రైతులను అరెస్టు చేయవద్దని కోరారు.

కానిస్టేబుల్ చెల్లెలి పెళ్లికి బీఆర్ఎస్ ఆర్థిక సాయం

మానకొండూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల టీఎస్ఎస్‌పీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే రాధారపు శ్రీనివాస్ ఇటీవల సస్పెండు అయ్యాడు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని గంగిపల్లికి చెందిన ఇతడి చెల్లెలి వివాహం త్వరలో ఉంది. సస్పెన్షన్‌లో ఉండటంతో శ్రీనివాస్ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పందించారు. శ్రీనివాస్ చెల్లెలు వివాహానికి మూడు లక్షల రూపాయలు పంపించారు. బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు గంగిపల్లికి వెళ్లి కుటుంబసభ్యులకు ఆ మొత్తం అందజేశారు.

ఐఐటీ రామయ్యకు పద్మవిభూషణ్ ఇవ్వాలి: దిలీప్

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేలాది మంది విద్యార్థులను ఐఐటీయన్లుగా తీర్చిదిద్దిన ప్రముఖ విద్యావేత్త ఐఐటీ రామయ్యకు కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ డిమాండ్ చేశారు. రామయ్యను తెలంగాణ ప్రభుత్వం తరఫున పద్మవిభూషణ్‌కు నామినేట్ చేయాలని త్వరలో సీఎం రేవంత్‌ను కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. ఇక్కడ తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నేపథ్యం ఉన్నా ప్రజల ఆకాంక్షలను గుర్తించిన రామయ్య తెలంగాణ ఉద్యమానికి బహిరంగంగా మద్దతు పలికారని తెలిపారు.

రైతును ముంచిన నకిలీ విత్తనాలు

» ఓ కంపెనీ వంగడం కొని మోసపోయిన రైతులు

» మహబూబాబాద్ జిల్లాలో ఘటన... ఆలస్యంగా వెలుగులోకి

నర్సింహులపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలో నాసిరకం విత్తనాల వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఈ వానాకాలంలో ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు విషయం తెలిసి లబోదిబోమంటున్నారు. జిల్లాలోని నర్సింహులపేట మండలంలోని రామన్నగూడెం, ముంగిమడుగు, కౌసల్యాదేవిపల్లి, జయపురం గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులు మండల కేంద్రంలోని ఓ ఎరువుల దుకాణం నుంచి సదరు కంపెనీకి చెందిన విత్తనాలను 10 కేజీలకు రూ.900 చొప్పున కొనుగోలు చేసి వరి పంట వేశారు. పంట పెరుగుదల ఆశించిన మేరకు లేకపోవడం, అన్నీ బెరుకులు ఉండడంతో నట్టేట మునిగామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు విచారణ జరిపి నాసిరకం విత్తనాలు సరఫరా చేసిన కంపెనీపై కఠిన చర్యలు తీసుకొని, తమకు నష్టపరిహారం అందేలా చూడాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలావుండగా, ఓ కంపెనీకి చెందిన వరి వంగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయంపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని మండల ఏవో వినయ్‌కుమార్ తెలిపారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

లగచర్లలో అర్ధరాత్రి అరెస్టులు

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగడంతో.. మంగళవారం ఈ మూడు గ్రామాల్లో నిర్మానుష్యం రాజ్యమేలింది. ఇక్కడే ఉంటే.. దాడితో సంబంధం లేకున్నా.. పోలీసులు అరెస్టు చేస్తారని, విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తారనే భయంతో పురుషులు.. ముఖ్యంగా యువకులు ఇతర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. దీంతో.. ఈ ప్రాంతాల్లో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తప్పితే.. మంగళవారం పురుషుల జాడ కనిపించలేదు. అర్ధరాత్రి నుంచే ఈ ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. రాజకీయ పరామర్శలు ప్రారంభమవ్వడంతో.. కొడంగల్ నియోజకవర్గంలో నెట్ సేవలను స్తంభింపజేశారు. అటు స్కూళ్లు కూడా పనిచేయలేదు. రోటిబండ తండా, లగచర్లల్లో అంగన్‌వాడీ కేంద్రాలకూ తాళాలు కనిపించాయి. చాలా ఇళ్లకు తాళాలు ఉండడంతో సమగ్ర సర్వే కూడా జరగలేదు. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో.. మీసేవ, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకు సేవల్లో అంతరాయమేర్పడింది. మరోవైపు ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు సోమవారం నాటి దాడిని ఖండిస్తూ పెన్‌డౌన్ నిర్వహించారు. కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల్ తహసీల్దార్ కార్యాలయాలకు తాళాలు వేసి, నిరసన వ్యక్తం చేశారు. రెవెన్యూ కార్యాలయాలు పనిచేయకపోవడంతో.. అధికారులను కలిసేందుకు, వివిధ సేవల కోసం వచ్చిన ప్రజలు చెట్ల కింద కూర్చుని ఎదురుచూడడం కనిపించింది.

వ్యూహాత్మకంగా అరెస్టులు..

దాడి నిందితులను గుర్తించి, అరెస్టు చేసేందుకు పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. సోషల్ మీడియా ఫొటోలు, వీడియోల ఆధారంగా నిందితులను గుర్తించారు. అర్ధరాత్రి మూడు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయించారు. ఇంటింటికీ ప్రత్యేకపోలీసు బలగాలతో వెళ్లి, 55 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం నుంచే అధికారులు ఈ 55 మందిని విచారించారు. వారి సెల్‌ఫోన్లను విశ్లేషించారు. ఈ దాడితో ప్రమేయం లేదని భావించిన వారిని మధ్యాహ్నం 3 గంటల సమయంలో విడిచిపెట్టారు. అలా బయటకు వచ్చిన యువకులు లగచర్లకు నడుచుకుంటూ వచ్చారు. వారిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా.. దాడి జరిగినప్పుడు తీసిన ఫొటోలు, వీడియోలు, సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టిన వీడియోల్లో ఉన్నవారిపై మాత్రమే కేసులు నమోదు చేశారని చెప్పారు. పోలీసులు కూడా అరెస్టులపై మంగళవారం సాయంత్రం ఓ ప్రకటన చేశారు. దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న 16 మందిని కోర్టులో హాజరుపరిచి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.



అధికారుల మీద దాడి ఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేస్తున్న ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, ప్రతినిధులు

రాజకీయ కుట్ర కోణం?

అధికారులపై దాడి వెనక రాజకీయ కుట్రకోణం ఉందా? అనే అంశంపైనా పోలీసులు దృష్టిసారించారు. నిజానికి ప్రజాభిప్రాయ సేకరణను లగచర్లకు రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. అక్కడ అధికారులు టెంట్లు వేసి, రైతులు, ప్రజల కోసం ఎదురుచూశారు. వారు రాకపోగా.. లగచర్లకు చెందిన బొనగాని సురేశ్ అనే వ్యక్తి మరికొందరితో కలిసి అక్కడికి చేరుకున్నారు. రైతులు భూములిచ్చేందుకు విముఖంగా ఉన్నారని, అంతా ఊళ్లోనే అందుబాటులో ఉంటారని చెప్పారు. అధికారులు ఊళ్లోకి వస్తే.. సహాయం చేయడానికి తాము సిద్ధమని చెప్పారు. అయితే.. రైతులు ఆగ్రహంతో ఉన్నారని, ఊళ్లోకి వెళ్తే దాడి చేసే ప్రమాదముందని పోలీసులు హెచ్చరించారు. కలెక్టర్, ఇతర అధికారులు మాత్రం రైతులతో మాట్లాడేందుకు లగచర్లకు చేరుకున్నారు. అధికారులను చూస్తూనే గ్రామస్థులు కోపోద్రిక్తులై.. పెద్దపెట్టున నినాదాలిచ్చారు. కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి సురేశ్ అని పోలీసులు గుర్తించారు. అతడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. అతణ్ని అరెస్టు చేయడానికి నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సురేశ్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడని, దాడికి ముందు.. ఆ తర్వాత కూడా అతడి ఫోన్ నుంచి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో 42 సార్లు మాట్లాడినట్లు కాల్‌డేటా రికార్డ్(సీడీఆర్) ద్వారా గుర్తించారు. దీనిపై పట్నం నరేందర్‌రెడ్డి స్పందిస్తూ.. సురేశ్ తనకు ఫోన్ చేసిన విషయం వాస్తవమేనని, భూసేకరణకు వచ్చిన అధికారులతో శాంతంగా మాట్లాడాలని సూచించినట్లు తెలిపారు. పార్టీ నేతలు.. కార్యకర్తలు తనకు ఎన్నిసార్లు ఫోన్ చేస్తే.. అన్నిసార్లు మాట్లాడతానని వివరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో.. అధికారులపై దాడి వెనక రాజకీయ కుట్ర ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో శాంతిభద్రతల సమస్యను సృష్టించి, ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించేందుకు లగచర్లలో అధికారులపై దాడి చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

వికారాబాద్ కలెక్టర్‌కు సీఎస్ ఫోన్

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి, తెలుసుకున్నారు. ఇతర ఐఏఎస్ అధికారులు కూడా ఆయనకు ఫోన్‌చేసి, సంఘీభావం తెలిపారు. అటు కలెక్టర్‌తోపాటు.. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా స్పెషలాఫీసర్ వెంకటరెడ్డి,వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిని కూడా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పరామర్శించారు.

1,373 ఎకరాల్లో ఫార్మా కారిడార్

ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్ (క్లస్టర్ విలేజ్‌లు) ఏర్పాటు చేసేందుకు దుద్యాల మండలంలో లగచర్ల, పోలేపల్లి, హకీంపేట, పులిచర్ల తండా, రోటిబండ తండాల పరిధిలో 1,373 ఎకరాలు అవసరమవుతాయని అధికారులు గుర్తించారు. ఇందులో 547 ఎకరాల అసైన్డ్ భూములు, 90 ఎకరాల ప్రభుత్వ భూములు పోగా.. 736 ఎకరాలు పట్టా భూములను సేకరించాల్సి ఉంది. 580 మంది రైతులకు చెందిన 632.26 ఎకరాల్లో భూసేకరణ చేపట్టేందుకు అధికారులు ఆగస్టు నెలలో నోటిఫికేషన్ జారీ చేశారు. హకీంపేట్‌లో 366.34 ఎకరాలు, పోలేపల్లిలో 130.21 ఎకరాలు, లగచర్లలో 156.05 ఎకరాలను సేకరించాలని ప్రతిపాదనలు చేశారు.

డీజీపీకి ఉద్యోగుల జేఏసీ ఫిర్యాదు

లగచర్లలో అధికారులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగుల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, మరో జేఏసీ ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో డీజీపీకి వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. అనంతరం సచివాలయంలో లచ్చిరెడ్డి మీడియాతో మాట్లాడారు. అధికారులపై దాడి జరిగితే నోరుమెదపని వారు.. నిందితుల అరెస్టులను ఖండించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. లగచర్లలో దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులు రైతుల ముసుగులో అధికారులపై దాడి చేశారని ఆరోపించారు. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ దాడి ఉద్యోగులపై జరిగింది కాదని, వ్యవస్థపై జరిగిందని పేర్కొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పథకం ప్రకారమే అధికారులపై దాడి జరిగిందని ఆరోపించారు. బాధిత ఉద్యోగులకు న్యాయం జరగని పక్షంలో.. 206 సంఘాలు, పది లక్షల మంది ఉద్యోగులతో జేఏసీ నేతృత్వంలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.



అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ట్రెసా, జేఏసీ ప్రతినిధులు

విద్రోహ శక్తుల్లారా.. ఖబడ్దార్!

» 'లగచర్ల' దోషులను అరెస్టు చేసేదాకా నిరసనలు

» వికారాబాద్ కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల జేఏసీ నేతల ధర్నా

వికారాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "విద్రోహ శక్తుల్లారా.. ఉద్యోగుల జోలికొస్తే ఖబడ్దార్. రాజకీయ సంచలనాల కోసం మాతో పెట్టుకోవద్దు. అధికారులు, ఉద్యోగులు లేకుండా మీకు పూట గడవదు. మేం ఒక్కసారి కళ్లు తెరిస్తే మీ జీవితం ఎక్కడుంటుందో గుర్తుంచుకోండి. లగచర్లలో అధికారులపై దాడిలో కుట్ర కోణాన్ని ఛేదించి దోషులందరినీ అరెస్టు చేసే వరకు నిరసనలు కొనసాగుతాయి" అని తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల వద్ద అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీనికి హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వ్యవస్థను మార్చే శక్తి అధికారులకు, ఉద్యోగులకు ఉందని చెప్పారు. అలాంటి ఉద్యోగులను రాజకీయాల్లోకి లాగొద్దని, అలా చేస్తే తేనెతుట్టెను కదిపినట్లేనని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో పది లక్షల మంది ఉద్యోగులం ఏకతాటిపై ఉంటూ, సహనం పాటిస్తున్నామని చెప్పారు. అధికారులపై దాడి జరిగితే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఉద్యోగులకు రక్షణ కల్పించకపోతే నష్టపోయేది మీరేనని రాజకీయ నేతలను ఉద్దేశించి పేర్కొన్నారు. లగచర్లలో అధికారులపై దాడి రాజకీయ కుట్రతోనే జరిగిందన్నారు. అధికారులు, ఉద్యోగులపై దాడులకు పాల్పడడం ద్వారా ఉద్యోగులను ప్రభుత్వానికి దూరం చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దోషులను అరెస్టు చేసే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. లేకపోతే అన్ని ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించి, సమగ్ర కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ట్రెసా నేతలు రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. అధికారులపై దాడులకు పాల్పడిన వారితో పాటు వారి వెనకున్న వారినీ శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వరకు దోషులందరినీ అరెస్టు చేయాలని, అప్పటిదాకా ఉద్యోగులెవరూ విధులకు వెళ్లొద్దని చెప్పారు. నిందితులను అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందరూ రోడ్డెక్కుతారని స్పష్టం చేశారు. అనంతరం సంఘాల నేతలు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

రేవంత్‌ది అబద్ధాల ప్రచారం

రోడ్లపై ధాన్యం కుప్పలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం: జగిత్యాల రోడ్ షోలో హరీశ్‌రావు



జగిత్యాల/వేములవాడ/హైదరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల సభలకు వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు ప్రచారాలు చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాదయాత్రలో కొద్దిదూరం పాల్గొన్న హరీశ్‌రావు.. జగిత్యాలలో రోడ్ షోలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పండించిన పంటను కొనాలని అడుగుతున్న రైతుల వద్ద లోడును కాదు.. మహారాష్ట్రకు డబ్బుల మూటల లోడును రేవంత్ ఎత్తుతున్నాడని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపై ఉన్న ధాన్యం కుప్పలు రేవంత్ పాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు. అంతకుముందు హరీశ్ వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. రేవంత్‌కు జ్ఞానోదయం కలిగించాలని కోరుకున్నానని చెప్పారు. రుణమాఫీ హామీ నేరవేర్చనందుకు రేవంత్.. వేములవాడ రాజన్న దగ్గరకు వచ్చి తప్పయ్యిందని వేడుకోవాలన్నారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక అర్హత రేవంత్‌కు లేదని, అన్నింటిలో నంబర్ వన్‌గా ఉన్న తెలంగాణ 11 నెలల్లో అన్నింటినీ కోల్పోయిందన్నారు. కాగా, అర్ధరాత్రి 300 మంది పోలీసులు లగచర్ల గ్రామస్థులను అరెస్టు చేయడం దారుణమని, వారిని వెంటనే విడుదల చేయాలని హరీశ్‌రావు 'ఎక్స్'లో డిమాండ్ చేశారు.

'లగచర్ల' దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నాం

» బాధ్యుల్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు: దుద్దిళ్ల

» దాడి చేసినా ఊర్కోవాలా?: పొన్నం

» కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లే సూత్రధారులు

» ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, యాదయ్య

» రాష్ట్రానికి పరిశ్రమలు రావద్దా?: అన్వేష్‌రెడ్డి



హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో కలెక్టర్, ఉన్నతాధికారులపై జరిగిన దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపడతామన్నారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు అధికారులు రైతుల వద్దకు వెళ్లకుండా పథకం ప్రకారమే కొందరు వ్యక్తులు దాడి చేశారని తెలిపారు. సీఎల్పీ మీడియా హాల్లో మంగళవారం మీడియా సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. "లగచర్ల గ్రామానికి కలెక్టర్‌ను రమ్మని చెప్పింది, దాడి చేసింది ఎవరు? ఈ దాడుల వెనక కుట్రదారులు ఎవరున్నారు? అన్న విషయాలపై కచ్చితంగా విచారణ జరుపుతాం. ప్రభుత్వ కార్యక్రమాలకు అడ్డు తగిలే వారిని, రౌడీయిజం చేసి, ప్రభుత్వ అధికారులను బెదిరించే వారిని ఉపేక్షించం. బాధ్యుల్ని వదలం" అని చెప్పారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా ఎవరు కుట్ర చేస్తున్నారన్నదీ బయటపెడతామన్నారు. బీఆర్ఎస్ నేతలు గ్రూప్ 1 పరీక్షనూ అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కేటీఆర్ ఢిల్లీకి ఎందుకు వెళ్లారో అందరికీ తెలుసన్నారు. "బీఆర్ఎస్ నేతలు ఈర్ష్య, ద్వేషంతో మాట్లాడుతున్నారు. ప్రజలకు మేం చేసిన అన్యాయం ఏంటి? రుణమాఫీ చేయడం, ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం, ఉచిత కరెంట్ ఇవ్వడం, 50 వేల ఉద్యోగాలు భర్తీ చేయడం ప్రభుత్వం చేసిన తప్పా?" అని మంత్రి నిలదీశారు. జిల్లా కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి, వేరే ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కలెక్టర్‌పై దాడి జరిగినా ఊరుకోవాలా? అని నిలదీశారు. కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించిన వ్యక్తి వివరాలు తమ వద్ద ఉన్నాయన్నారు. తనపై వస్తున్న ఆరోపణల నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్ ఢిల్లీ వెళ్లారని ఆరోపించారు. కాగా, లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. బీఆర్ఎస్ నేత సురేశ్.. కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి లగచర్ల గ్రామానికి తీసుకెళ్లాడన్నారు.

రూ.కోటి ఇచ్చి దాడులు చేయించారు

లగచర్లలో అధికారులపై దాడికి ప్రోత్సహించింది బీఆర్ఎస్ నేతలేనని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావద్దు.. ప్రజలకు ఉపాధి దొరకొద్దు అన్నది బీఆర్ఎస్ వైఖరా? అని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి నిలదీశారు. ప్రభుత్వాన్ని బద్నాం చేయాలన్న ఉద్దేశంతోనే రైతుల ముసుగులో బీఆర్ఎస్ నేతలు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో కులగణన సర్వేను అడ్డుకునేందుకు కేటీఆర్, హరీశ్ కుట్ర చేస్తున్నారని, వారిని నిలదీయాలని ఓబీసీలు, బహుజనులకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ పిలుపునిచ్చారు. లగచర్లకు చెందిన బీఆర్ఎస్ నేత సురేశ్‌కు ఆ పార్టీ కీలక నేతలు 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఇచ్చి, అధికారులపై దాడులు చేయించారని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మె ల్యే కాలె యాదయ్య ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ల పాత్ర ఉంద న్నారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తావు లేదని, అధికారులు, ఉద్యోగులపై దాడులు చేసి, వారి మనో స్థైర్యాన్ని దెబ్బ తీయొద్దని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి అన్నారు.

10 ఫార్మా విలేజ్‌లు.. 20వేల ఎకరాలు.. 1000 కంపెనీలు!

జాబితా ముందే సిద్ధం చేస్తున్న సర్కారు .. భూసేకరణకు ముందే పెట్టుబడులపై స్పష్టత

» వివాదాలను పరిష్కరించుకుంటూ సేకరణ

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం.. హైదరాబాద్ ఫార్మాసిటీ స్థానంలో ఏర్పాటు చేయదలచిన ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌ల విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఫార్మా విలేజ్‌లకు భూసేకరణలో వివాదాలు తలెత్తినా.. రైతులకు నచ్చజెప్పి ఒప్పించడం ద్వారా ముందుకెళ్లాలని భావిస్తోంది. తాజాగా వికారాబాద్‌లో భూసేకరణ విషయంలో తలెత్తిన వివాదాన్ని కూడా ఇలాగే పరిష్కరించుకునే ప్రయత్నాల్లో ఉంది. అయితే వివిధ ఫార్మా క్లస్టర్‌లలో భూసేకరణ చేపట్టేందుకు ముందే.. అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కలిగిన కంపెనీలు, అవి ఏ మేరకు పెట్టుబడులు పెడతాయి, ఎంత మందికి ఉద్యోగాలు కల్పిస్తాయి వంటి అంశాలపై స్పష్టత తీసుకుంటోంది. మొత్తం 10 ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వంనిర్ణయించిన నేపథ్యంలో.. వాటి కోసం సుమారు 20 వేల ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఈ ఫార్మా క్లస్టర్లలో మొత్తం 1000 కంపెనీలకు భూమిని కేటాయించాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. ఇందులో ఇప్పటికే 500కు పైగా కంపెనీలను గుర్తించారు. కాగా, భూసేకరణలో వికారాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసే క్లస్టర్‌కు సంబంధించిన సేకరణే మొదటిది. మిగతా క్లస్టర్లలో కొన్నిచోట్ల కొంత ప్రభుత్వ భూమి ఉండగా.. మిగిలింది రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. ఈ భూసేకరణ పూర్తయి అనుకున్నమేరకు కంపెనీలన్నీ వస్తే రూ.లక్ష కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి ఊతం లభిస్తుందని సర్కారు అంచనా వేస్తోంది.

గత ప్రభుత్వ హయాంలో నిర్ణయం..

రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల పరిసరాల్లో దాదాపు 20 వేల ఎకరాల్లో హైదరాబాద్ ఫార్మాసిటీని ఏర్పాటుచేయాలని గత ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికోసం సగానికి పైగా భూసేకరణ కూడా పూర్తిచేసింది. అయితే ఫార్మా కంపెనీల కాలుష్యంపై స్థానికులు, రైతుల నుంచి పెద్దఎత్తున ఆందోళన వ్యక్తమైంది. భూసేకరణలో కూడా రైతులు సహకరించలేదు. ఈ క్రమంలో రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. హైదరాబాద్ ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేసింది. ఒకేచోట 20 వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటును రద్దు చేసి.. తొమ్మిది జిల్లాల్లో 1000-2000 ఎకరాల చొప్పున పది ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ దిశగా ప్రభుత్వం ఇప్పటికే తొమ్మిది జిల్లాలను గుర్తించింది. తొలుత వికారాబాద్, మెదక్, నల్లగొండ జిల్లాల్లో మూడు ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు మూడుచోట్ల భూసేకరణ ప్రక్రియను ప్రారంభించారు. అయితే ఎన్నో వ్యయప్రయాసలతో రైతులకు పరిహారం ఇచ్చి, కోర్టు కేసులు ఎదుర్కొని భూములు సేకరించాక.. కంపెనీల పెట్టుబడులు ఏ స్థాయిలో వస్తాయి? ఆశించిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు వస్తాయా? అన్న ప్రశ్నలు మొదలయ్యాయి. అన్నీ అభివృద్ధి చేశాక ఆశించిన పెట్టుబడులు, ఉద్యోగాలు రాకపోతే ఎలా? అన్న అనుమానాలూ తలెత్తడంతో ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు ముందే.. ఆసక్తి కలిగిన కంపెనీలను గుర్తించాలని సర్కారు నిర్ణయించింది. పెట్టబోయే పెట్టుబడులను తెలుపాలని ఫార్మా, లైఫ్ సైన్స్ కంపెనీలను కోరుతోంది.

సిద్ధంగా 500కి పైగా కంపెనీలు..

హైదరాబాద్ ఫార్మాసిటీ ప్రాజెక్టు గత ఐదారేళ్లుగా సాగుతోంది. అక్కడ మౌలిక వసతుల కల్పనకు గత ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లకు పైగా వెచ్చించింది. విమానాశ్రయం వరకు విశాలమైన రహదారులు, నిరంతర విద్యుత్తు సౌకర్యం కోసం సబ్‌స్టేషన్ల ఏర్పాటు పూర్తిచేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మాసిటీ అంటూ గత ప్రభుత్వం భారీగా ప్రచారం చేయడం, జాతీయ ప్రాధాన్యం దృష్ట్యా కేంద్రప్రభుత్వం కూడా దీనికి నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్) హోదా కల్పించింది. దీంతో ఇందులో పెట్టుబడులు పెట్టేందుకు అనేక జాతీయ, అంతర్జాతీయ ఫార్మా కంపెనీలు ఆసక్తి చూపించాయి. 500కు పైగా కంపెనీలు పెట్టుబడులకు సంబంధించి దరఖాస్తులు కూడా సమర్పించాయి. అయితే భూసేకరణకు సంబంధించి కొన్నిచోట్ల కోర్టులో కేసులుండటంతో ఫార్మాసిటీ ప్రారంభంలో జాప్యం జరిగింది. కొత్త ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేసినప్పటికీ.. కంపెనీలు మాత్రం పెట్టుబడులపై వెనకడుగు వేయలేదు. అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరగా ఉండటం, రవాణా, మానవ వనరుల పరంగా అనేక అనుకూలతలు ఉండటంతో పెట్టుబడులకు కంపెనీలు ఇప్పటికీ సిద్ధంగా ఉన్నాయి. వీరందరినీ ప్రభుత్వం సంప్రదిస్తోంది. ఆ 500 కంపెనీలు కూడా ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నాయి. తమ పెట్టుబడుల వివరాలను ప్రభుత్వానికి అందిస్తున్నాయి.

కంపెనీలతో మంత్రి ప్రత్యక్ష చర్చలు

పెట్టుబడుల విషయమై పెద్ద కంపెనీలతో ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్వయంగా సమావేశమవుతున్నారు. గతవారం డాక్టర్ రెడ్డీస్, అరబిం దో, హెటెరో, లారస్, ఎంఎస్ఎన్ వంటి ఐదు దిగ్గజ కంపెనీలతో భేటీ అయ్యారు. ఇవి హైదరాబాద్ నుంచి తమ ఉత్పత్తులను ప్రపంచానికి సరఫరా చేస్తున్నాయి. ఒక్కో కంపెనీకి 50ఎకరాల చొప్పున, ఐదు కంపెనీలకు 250 ఎకరాలు కేటాయించేందుకు మంత్రి సంసిద్ధత వ్యక్తం చేశారు. అయితే పెట్టుబడులు, ఉద్యోగాలపై కంపెనీలు తమ ఆలోచన ప్రభుత్వంతో పంచుకున్నా.. సర్కారు ఆ వివరాలను వెల్లడించలేదు. మొత్తానికి 9 జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లలో వెయ్యి కంపెనీలు పెట్టుబడులు పెడతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కంపెనీల జాబితా సిద్ధమయ్యాక.. పెట్టుబడులు, ఉద్యోగాల వివరాలను ప్రకటించనుంది.

ఢిల్లీలో విద్యుత్‌శాఖ మంత్రుల సమావేశం



» హాజరైన భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యుత్ రంగ పురోగాభివృద్ధి, నూతన సంస్కరణలు, అధిగమించాల్సిన సవాళ్లు తదితర అంశాలపై కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సమావేశం నిర్వహించారు. మంగళవారం ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో సెంటర్‌లో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విద్యుత్‌శాఖ మంత్రులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషరఫ్ ఫరూఖీ హాజరయ్యారు. సమావేశం అనంతరం కేంద్ర మంత్రితో భట్టి విక్రమార్క ప్రత్యేకంగా భేటీ అయి రాష్ట్రంలోని విద్యుత్ సంబంధిత అంశాలపై చర్చించారు.

రైతులకు రాయితీపై యంత్రాలు!

» యాసంగి సీజన్ నుంచి అందజేత: మంత్రి తుమ్మల



హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ నుంచి రైతులకు అవసరమైన ఉపకరణాలు, యంత్రాలను రాయితీపై సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. జిల్లాల వారీగా ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని పనిముట్లు, యంత్ర పరికరాల జాబితా తయారు చేసినట్లు తెలిపారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ బి.గోపి, ఇతర అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. పనిముట్లు, యంత్రాల తయారీ సంస్థల సహకారంతో రైతుల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాల వారీగా ప్రదర్శనలు నిర్వహిస్తామని తుమ్మల చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రోటోవేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, తైవాన్ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, మొక్కజొన్న ఒలిచే యంత్రాలు, ట్రాక్టర్లు, కిసాన్ డ్రోన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. 2018-23 మధ్యకాలంలో యంత్రాలు రాకపోవడంతో రైతులకు ఇబ్బంది కలిగిందని చెప్పారు. తాజాగా రైతుల్లో అవగాహన పెంపొందించడానికి ప్రదర్శనలను ప్రభావవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులకు సీజన్ ప్రారంభంలోనే పనిముట్లను అందజేయాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ఈ ప్రదర్శనల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు.

సోయా సేకరణలో తెలంగాణ టాప్

దేశవ్యాప్తంగా సోయా సేకరణలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. సంప్రదాయ సోయా సాగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ను తెలంగాణ అధిగమించిందని తుమ్మల చెప్పారు. తెలంగాణలో 47 కేంద్రాల ద్వారా సోయా సేకరణ జరుగుతోందని, రూ.4892 మద్దతు ధర చెల్లిస్తూ, ఇప్పటికి 24,252 మెట్రిక్ టన్నుల సోయా చిక్కుడును సేకరించినట్లు తెలిపారు.

పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం

» పత్తి రైతులు అపోహలు పెట్టుకోవద్దు:సీసీఐ చైర్మన్

వరంగల్ వ్యవసాయం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పత్తి రైతులు అపోహలు పెట్టుకోవద్దని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాల్లో మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుమార్ గుప్తా ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పత్తి సేకరణను నిలిపివేస్తున్నట్లు సోమవారం మీడియాలో వార్తలు వచ్చాయి. అలాగే 2024-25 పత్తి సీజన్‌కు సంబంధించి జీఅండ్‌పీ టెండరు నిబంధనలు, షరతుల ప్రకారం జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలకు జాబ్ వర్క్ కేటాయించడంలో, పత్తి ప్రాసెసింగ్ కోసం జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలను ఎంపిక చేయడంలో ఏకపక్షంగా వ్యవహరించిందని సీసీఐపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధికారులు జిన్నర్స్ అసోసియేషన్‌తో చర్చించిన తరువాత వారు సమ్మెను విరమించారని లలిత్‌కుమార్ గుప్తా తెలిపారు.

రాష్ట్రానికి 70 గొర్రెల, కోళ్ల యూనిట్లు

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎం) పథకం కింద 67 గొర్రెలు, మేకలు, 3 కోళ్ల ఫారమ్ యూనిట్లు కలిపి మొత్తం 70 యూనిట్లను కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కేటాయించిందని రాష్ట్ర పశు సంవర్థక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల ఫారాలు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఎన్‌ఎల్‌ఎం కింద కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై రూ.50 లక్షల వరకు రుణం ఇస్తుంది. ఈ పథకానికి సంబంధించి జిల్లా పశు వైద్యాధికారులతో సబ్యసాచి ఘోష్ మంగళవారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్రస్థాయి కార్యనిర్వాహక కమిటీ పరిశీలన అనంతరం ప్రాజెక్టులకు అనుమతి వస్తుందని, సబ్సిడీ మంజూరైన తర్వాత లబ్ధిదారులు ప్రాజెక్టు ప్రారంభించుకోవాలని తెలిపారు.

విజయ్ మద్దూరికి లుకౌట్ నోటీసులు

శంకర్‌పల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల ఫాంహౌస్ పార్టీలో డ్రగ్స్ తీసుకున్నట్లుగా తేలిన విజయ్ మద్దూరిపై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీపావళి ముందు ఫాంహౌస్ వ్యవహారం బయటికొచ్చిన విషయం తెలిసిందే. డ్రగ్స్ టెస్టులో దొరికిన అనంతరం విజయ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అయితే, అతడు విదేశాలకు పారిపోకుండా సంఘటన జరిగిన రెండు, మూడు రోజుల తరువాత పౌర విమానయానశాఖకు పోలీసులు సమాచారం అందించినట్లు తెలిసింది. ఆ మేరకు ఇమ్మిగ్రేషన్ అధికారులు దేశంలోని అన్ని విమానాశ్రయాలకు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. దాంతో విజయ్ మద్దూరి విదేశాలకు వెళ్లకుండా కట్టడి చేశారు. కాగా, విజయ్ తన న్యాయవాదులతో కలిసి ఈ నెల 6వ తేదీన మోకిలా పోలీస్‌స్టేషన్‌లో విచారణ నిమిత్తం హాజరయ్యారు.

సీఎం రేవంత్‌తో నెదర్లాండ్స్ రాయబారి భేటీ

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డితో భారత్‌లోని నెదర్లాండ్స్ రాయబారి మారిసా గెరార్డ్స్ సమావేశమయ్యారు. ఢిల్లీలోని సీఎం రేవంత్ క్యాంపు కార్యాలయానికి మంగళవారం వచ్చిన ఆమె సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, రెసిడెంట్ కమిషనర్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ చర్యలకు రైతులు బలి?

» ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

పరిగి/పూడూరు: ప్రభుత్వ అనాలోచిత చర్యలతో రైతులు బలవుతున్నారని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. లగచర్ల రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న ఆయనను, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పలువురు బీఆర్‌ఎస్ నేతలను పూ డూరు మండలం మన్నెగూడ వద్ద పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. పీఎస్‌లో ప్రవీణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను కవచంగా వాడుకుంటున్నారని ఆరోపించారు.

మోదీ, షాల వల్లే జగన్ బయట తిరుగుతున్నాడు

» సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, హోం మంత్రి అమిషా వల్లనే వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఇంకా బయట తిరుగుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. వారి సహకారం లేకుంటే జగన్ ఎప్పుడో జైలుకు వెళ్లాల్సిన వాడని ఆయన చెప్పారు. మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం కలిగించే రీతిలో మోదీ, అమిత్‌షాలు రాజకీయాలు చేస్తున్నారని నారాయణ దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన మంచి కార్యక్రమమే అయినా అనవసర ప్రశ్నలతో వివాదస్పదం అవుతుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రాజకీయ కుట్ర అనుసరిస్తున్నట్లు కనిపిస్తోందని, పేదల భుజాన తుపాకి పెట్టి రేవంత్ ప్రభుత్వాన్ని కాల్చేందుకు ప్రయత్నిస్తోందని కూనంనేని ఆరోపించారు. కేటీఆర్‌కు రక్షణ కవచం కావాల్సి రావడంతో కమ్యూనిస్టులు గుర్తుకు వస్తున్నారని, తాము ప్రజలకు మాత్రమే కవచంగా ఉంటామని ఆయన పేర్కొన్నారు.

అనుమతి ఆపడానికే!

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చింది. ఆధారాలన్నీ ఉన్నాయి. ఆయన కుటుంబం దోచుకున్న విషయంపై చర్చ జరగకుండా ఉండడానికి నాపై ఆరోపణలు చేస్తున్నారు" అని వివరించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య తేడా లేదని, రెండూ కవల పిల్లలేనని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా కేసీఆర్ ఎందుకు ప్రచారం చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణకు మద్దతునిచ్చిన శరద్ పవార్ తరఫుననైనా ప్రచారం చేయవచ్చు కదా అని అన్నారు. కానీ, మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని కేటీఆర్ చెబుతున్నారని, అంటే బీజేపీకి వేయమనే కదా అని నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం, లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు కోల్పోయారని, ఇప్పుడు మెదడు కూడా కోల్పోయారని ఎద్దేవా చేశారు. వాళ్లను చూసి జాలి పడడం తప్ప, ఆలోచించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

బాబు.. నితీశ్ తలచుకుంటే..

చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్ తలచుకుంటే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఒక్క ఏడాది కూడా అధికారంలో కొనసాగదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. అప్పుడు కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో 400 సీట్లు తెస్తానని మోదీ చెప్పుకొన్నారని, ఆ సంఖ్యను తాము 240కి తగ్గించగలిగామని చెప్పారు. బీజేపీ ఓడిపోయిందని తాను చెప్పడం లేదని, కానీ, మోదీ ఓడిపోయారని అన్నారు. ప్రతి అంశానికీ మోదీకే ఘనత ఆపాదిస్తూ ప్రచారం చేయడమే ఇందుకు కారణమన్నారు. మోదీ గ్యారంటీ వారంటీ పూర్తయిందని, ఇప్పుడు ప్రభుత్వం చంద్రబాబు, నితీశ్ కుమార్ అండతో నడుస్తోందని, కొద్దిగా తేడా వస్తే సంగతి అంతేనని వ్యాఖ్యానించారు.

కుల గణన.. కాంగ్రెస్ 3.0

మోదీ రాకముందు దేశానికి రూ.25 లక్షల కోట్ల అప్పు ఉండేదని, గత పదేళ్లలో మోదీ రూ.188 లక్షల కోట్ల అప్పు చేశారని సీఎం రేవంత్ చెప్పారు. అందులో కొంత డబ్బు వెచ్చించి 16 లక్షల కోట్ల కార్పొరేట్ల అప్పులను మాఫీ చేశారని ఆరోపించారు. "మేం ఆరు గ్యారంటీలను అమలు చేస్తే.. రైతుల రుణాలు మాఫీ చేస్తే.. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తే.. 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇస్తే మమ్మల్ని విమర్శిస్తున్నారు. ధర్నాలు చేయిస్తున్నారు. మహిళలు, రైతులు, నిరుద్యోగ యువతకు మద్దతు ఇస్తే దేశం ఇంకా అభివృద్ధి చెందుతుంది. కానీ, కార్పొరేట్ల రుణాలు మాఫీ చేసే బీజేపీ.. పేదలకు డబ్బులు పంచితే విమర్శిస్తోంది" అని రేవంత్ మండిపడ్డారు. నెహ్రూ, ఇందిరా గాంధీ ఎస్సీ, ఎస్టీలకు 32 శాతం రిజర్వేషన్లు కల్పించారని, అది కాంగ్రెస్ 1.0 అని, పీవీ నరసింహారావు మండల్ కమిషన్ తీసుకొచ్చారని, అది 2.0 అని, రాహుల్ గాంధీ కుల గణన చేస్తారని, అది కాంగ్రెస్ 3.0 అని చెప్పారు. అధికారం ఎస్సీ, ఎస్టీలతోపాటు ఓబీసీలకు కూడా రావాల్సి ఉందని, ఇప్పుడు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని, పదేళ్ల తర్వాత రాజకీయ సమీకరణాలు మారిపోతాయని రేవంత్ అభిప్రాయపడ్డారు.

ఉత్తరాది.. దక్షిణాది వాదన ఇందుకే



ఢిల్లీలో జరిగిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడ్డా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

మోదీ హయాంలో దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ మండిపడ్డారు. "దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఎంతో కంట్రిబ్యూట్ చేస్తున్నాయి. తెలంగాణ నుంచి ఒక రూపాయి దేశానికి చెల్లిస్తే.. కేంద్రం 40 పైసలే వెనక్కి ఇస్తోంది. కానీ, బిహార్ రూపాయి ఇస్తే.. కేంద్రం నుంచి తిరిగి రూ.7.06 పొందుతోంది. జనాభా ఆధారంగా నిధులు పంచుతున్నారు. ఇది సరికాదు. జనాభాకు 50 శాతం, పురోగతిని చూసి 50 శాతం నిధులు ఇవ్వాలని నీతీ ఆయోగ్ తెలంగాణకు వచ్చినప్పుడు చెప్పాను. రిజర్వేషన్ల విషయంలో సుప్రీం కోర్టు కూడా 50 శాతం కోటా.. 50 శాతం మెరిట్‌ను చూడమంటుంది. దానినే అనుసరించాలి. అంతే తప్ప జనాభా ఆధారంగానే ఇస్తే ఎలా!?" అని ప్రశ్నించారు. 2025 జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ సీట్లను పెంచితే.. ఈ దేశంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి దక్షిణాది ఓట్లు అవసరం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు దక్షిణాదిలో 123 సీట్లు ఉన్నాయని, అవి ఇంకా తగ్గుతాయని, అప్పుడు తమ పాత్ర (దక్షిణాది రాష్ట్రాల)తక్కువగా లేదా విమర్శించతగిన స్థితిలో మాత్రమే ఉంటుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తుంటే.. ఆర్థిక వ్యవస్థకు ఇంతగా కంట్రిబ్యూట్ చేస్తుంటే.. మమ్మల్ని శిక్షిస్తే ఎలా అని నిలదీశారు. తాము నోరు ఎత్తకుండా ఎలా ఉంటామని, తమ హక్కులను రక్షించుకునేందుకు సహజంగానే దక్షిణాది-ఉత్తరాది వాదన వస్తుందని స్పష్టం చేశారు.

మోదీ భద్రాచలం వస్తే నేను అయోధ్యకు

ఏబీవీపీ, టీడీపీ, కాంగ్రెస్‌ల్లో ఏయే లక్షణాలు అంటే మీకు ఇష్టమని ప్రశ్నించగా.. ఏబీవీపీకి దేశం పట్ల ఉన్న అంకిత భావం, తెలుగుదేశం పార్టీకి అభివృద్ధి పట్ల ఉన్న దృక్పథం, కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం తనకు ఇష్టమని ముఖ్యమంత్రి రేవంత్ చెప్పారు. ఒకప్పటి ఏబీవీపీ నేతగా అయోధ్యలో రామ మందిరానికి వెళతారా? అని ప్రశ్నించగా.. తనకు అయోధ్య కంటే భద్రాచలం రామ మందిరానికి వెళ్లడమే ఇష్టమని చెప్పారు. ఇంత వరకూ మోదీ, అమిత్ షాలు భద్రాచలం రాకపోవడం బాధాకరమని అన్నారు. భద్రచలానికి మోదీ, అమిత్ షా వచ్చినప్పుడు తాను కూడా అయోధ్యకు వెళతానని చెప్పారు.

కాంగ్రెస్ 20 ట్వంటీ ఆడాలి

కాంగ్రెస్ సుదీర్ఘ ఆలోచన కలిగిన పార్టీ అని, ఇప్పటికీ టెస్టు ఫార్మాట్ ఆడుతోందని, పార్టీ తన విధానాలను మార్చుకుని 20-20 ఆడాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. హరియాణాలో స్థానిక అంశాల ప్రాతిపదికగా ఎన్నికలకు వెళ్లారని, నరేంద్ర మోదీని అడ్డుకునేందుకు రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని, హరియాణాలో గెలిస్తే రాహుల్ దేశ ప్రధాని అవుతారని ప్రచారం చేసి ఉంటే కాంగ్రెస్ గెలిచేదని అభిప్రాయపడ్డారు. దేశంలో ఎక్కడైనా మోదీ వర్సెస్ రాహుల్ అన్నట్లు పోటీ జరగాలన్నారు. బీజేపీ హిందుత్వ కార్డు హిమాచల్ ప్రదేశ్, కశ్మీరుల్లో పని చేయలేదని తెలిపారు. స్థానిక అంశాలను అధిగమించేందుకు బ్రాండ్ అవసరమని, మోదీ పరివార్ వర్సెస్ రాహుల్ పరివార్ పేరుతో ఎన్నికల్లో దిగాలని సూచించారు. కేవలం సంక్షేమంతో ఎన్నికల్లో గెలవలేమని స్పష్టం చేశారు.

ఆ ధర్నా చౌక్‌లోనే కేటీఆర్, హరీశ్ ఆందోళన

తెలంగాణకు గుజరాత్ నమూనా లేదా మరో రాష్ట్రం ఆదర్శం కాదని, హైదరాబాద్‌ను న్యూయార్క్, సియోల్, టోక్యోలా అభివృద్ధిపరచడమే తన లక్ష్యమని సీఎం రేవంత్ చెప్పారు. తాను పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటానని, అభివృద్ధి ఏమిటో చూపిస్తానని తెలిపారు. "కేసీఆర్ పాలనలో ప్రజాస్వామ్యం లేదు. పదేళ్లు సచివాలయానికి రాలేదు. ప్రతిపక్ష నేతగా ఒక్కసారి కూడా అసెంబ్లీకి రాలేదు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు నిరసన ప్రదర్శనలు చేయకుండా ధర్నా చౌక్ వద్ద ఆంక్షలు పెట్టారు. ఇప్పుడదే ధర్నాచౌక్ వద్ద కేటీఆర్, హరీశ్ రావులు రెండు రోజులకోసారి ధర్నాలు చేస్తున్నారు" అనిఎద్దేవా చేశారు.

అటువంటి యాప్ నేటి అవసరం

చిన్న చిన్న మొత్తాలకు ఫైళ్లు కింది నుంచి పై వరకు తిరగడం, రోజుల తరబడి పెండింగ్‌లో ఉండడం తనకు ఇష్టం లేదని, బ్యూరోక్రసీ, రెడ్ టేపిజం లేకుండా ప్రజలు నేరుగా తమ సమస్యలను డాష్ బోర్డ్ ద్వారా తెలిపే యాప్ అవసరమని సీఎం రేవంత్ ఆకాంక్షించారు. ప్రస్తుతం చదువుకోవడం ముఖ్యం కాదని, నైపుణ్యం అవసరమని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. 2 సెంటీ మీటర్ల వర్షం వస్తుందని ఊహించి హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలను నిర్మించారని, కానీ, గత నెలలో కేవలం 3 గంటల్లోనే 19 సెంటీమీటర్ల వర్షం కురిసిందని, ఇలాంటి వాటిని ఎలా ఎదుర్కోవాలో దూరదృష్టితో కూడిన నిర్ణయాలు చేయాలని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య విభజన సమస్యలు ఉన్నమాట నిజమేనని, వాటిని రెండు రాష్ట్రాలూ పరస్పరం ప్రయోజనం కలిగించే విధంగా పరిష్కరించుకోవచ్చని వ్యాఖ్యానించారు. అందుకోసం తాము ఢిల్లీ వచ్చి కేంద్రం మధ్యవర్తిత్వాన్ని కోరాల్సిన అవసరం లేదని చెప్పారు. నాయకులకు దృక్పథం అవసరమని, నేతలు తమ ఆలోచనా విధానం మార్చుకోవాలని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే పదవికి 21 ఏళ్ల యువకులు ఎందుకు పోటీ పడకూడదని, 25 ఏళ్ల వరకూ ఎందుకు వేచి ఉండాలని రేవంత్ ప్రశ్నించారు

మరాఠా ఆత్మ గౌరవాన్ని గుజరాత్ నాశనం చేస్తోంది

మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రస్తుతం గుజరాత్ వర్సెస్ మహారాష్ట్ర అన్నట్లు జరుగుతోందని, మరాఠా ఆత్మ గౌరవాన్ని గుజరాత్ నాశనం చేస్తోందని, వారి నేతలను ఖతం చేస్తోందని సీఎం రేవంత్ ఆరోపించారు. శివాజీ, ఫూలే, అంబేడ్కర్, బాల్ ఠాక్రే, పవార్, చవాన్ వంటి నేతలు ఉన్నచోట్ల ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ వంటి కోవర్టులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. మహారాష్ట్రకు రావాల్సిన ప్రాజెక్టులను గుజరాత్‌కు తీసుకెళ్లిపోతున్నారని ఆరోపించారు. "తెలంగాణను గాంధీ కుటుంబం ఏటీఎం చేసిందని ప్రధాని స్థాయి వ్యక్తి విమర్శలు చేయడం సరికాదు. గాంధీ కుటుంబానికి డబ్బులే కావాలంటే దేశం కోసం ప్రాణాలెందుకు అర్పించేది!? ఇందిరమ్మ పేరుతో ఎంతో మంది పేదలకు ఇండ్లు ఇస్తే.. బీజేపీ ప్రభుత్వం ఆమె మనవడు రాహుల్ గాంధీకి నీడ లేకుండా తుగ్లక్ రోడ్‌లోని నివాసాన్ని ఖాళీ చేయించింది" అని వ్యాఖ్యానించారు.

మోదీ మోడల్ వేరు.. కాంగ్రెస్ నమూనా వేరు

మోదీ మోడల్ వేరు.. కాంగ్రెస్ నమూనా వేరు అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. నవ రత్నాలతో సహా దేశంలో అన్నిటినీ అదానీ, అంబానీలకే మోదీ అప్పగిస్తున్నారని ఆరోపించారు. స్కిల్స్ యూనివర్సిటీకి అదానీ వంద కోట్లు పెట్టుబడులు పెట్టారని, ఈ మొత్తం యువతకు తోడ్పడుతోందని, దానిని తాను ఎలా అడ్డుకుంటానని ప్రశ్నించారు. తానేమీ అదానీకి రేవులు, విమానాశ్రయాలు, ప్రభుత్వ ఆస్తులను ధారాదత్తం చేయలేదని చెప్పారు. అందరు పారిశ్రామికవేత్తల పట్ల సమానంగా వ్యవహరిస్తున్నానని చెప్పారు.

అధికారులపై దాడులను సమర్థిస్తారా!?

అధికారులపై దాడులు చేస్తే పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు ఖండించాల్సింది పోయి సమర్థించడం సరి కాదని సీఎం రేవంత్ మండిపడ్డారు. రాష్ట్రంపై వారికి ఎలాంటి అభిప్రాయం ఉందో దీనినిబట్టే తెలుసుకోవచ్చని చెప్పారు. "భూ సేకరణ చేయాలా? వద్దా? అనేది ఒక అంశం. దానిపై బీఆర్‌ఎస్, నిర్వాసితులు ఎవరైనా అభిప్రాయాలు చెప్పొచ్చు, తప్పులేదు. కానీ, అధికారులను పాశవికంగా చంపాలని చూడడాన్ని బీఆర్‌ఎస్ ఏ విధంగా సమర్థించుకుంటుంది!? ఈ సంస్కృతి సరికాదు. ప్రభుత్వం మీద, ప్రభుత్వ అధికారుల మీద దాడులను ఎవరైనా సమర్థిస్తారా?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. దాడులు చేసిన వాళ్ళ, వాళ్లను ప్రోత్సహించేవాళ్లు, అండగా నిలిచిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న పర్యాటక సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి

గోల్కొండ కోట- కుతుబ్‌షాహీ టూంబ్స్ సందర్శనకు రోప్‌వే!

» సాంకేతిక నిపుణుల బృందంతో కలిసి పరిశీలించిన పర్యాటక సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) కుతుబ్‌షాహీల వాస్తు నిర్మాణాలకు నిలువుటద్దం గోల్కొండ కోట, దానికి సమీపంలోని పాదుషాల స్మృతి సౌధాల నిర్మాణాలను సందర్శించే పర్యాటకుల కోసం రోప్‌వేను నిర్మించనున్నారు. కేంద్ర పురావస్తు శాఖ పర్యవేక్షణలోని గోల్కొండ కోటపై భాగంలోని పలు పురాతన రాజమందిరాలు, రాణివాసాలు, సైనిక స్థావరాలు, ఆయుధగారాలు, మసీదులు, మండపాలు, ధాన్యాగారాలు, గుర్రపు శాలల అద్భుత వాస్తు నిర్మాణాలు ఇప్పటికీ సందర్శకులను ఆశ్చర్యపరుస్తున్నాయి. కోట బురుజులు, ద్వారాలు, రహస్య మందిరాలను పరిశీలించేందుకు సుమారు సుమారు 380 రాతి మెట్లపై నుంచి మీదికి చేరుకోవలిసి ఉంటుంది. అయితే పలువురు పర్యాటకులు కాలి నడకను మెట్లు ఎక్కలేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. అన్ని వయసుల పర్యాటకులు గోల్కొండ కోట చారిత్రాత్మక నిర్మాణాలను సౌకర్యవంతంగా పరిశీలించేందుకు వీలుగా పర్యాటక సంస్థ రోప్‌వేను నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రపర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ అధికారులు, సాంకేతిక నిపుణులతో కలిసి రోప్‌వే నిర్మించనున్న గోల్కొండ కోట, కుతుబ్‌షాహి పాదుషాల స్మృతి సౌధాలు, ఉద్యానవనం ప్రాంతాలను పరిశీలించారు. గోల్కొండ కోట- సమాధుల నిర్మాణాలను అనుసంధానం చేస్తూ రోప్‌వే నిర్మాణం చేపట్టే ప్రదేశాలపై నిపుణులతో చర్చించారు. ఇప్పటికే పర్యాటక సంస్థ భువన గిరి కోటను సందర్శించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రోప్ వే నిర్మాణ పనులు చేపట్టింది. ఈ నేపథ్యంలో గోల్కొండ కోట- కుతుబ్‌షా సమాధులను ప్రాంతాలను సందర్శించేందుకు రెండు వైపులా రోప్ వేను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు పర్యాటక సంస్థ అధికారులు తెలిపారు.

రూ.1000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 15 ఏళ్ల కాల పరిమితి, 7.13 శాతం వార్షిక వడ్డీతో ఈ అప్పు తీసుకుంది. రాష్ట్రంతో సహా దేశంలోని ఐదు రాష్ట్రాలు 5,400 కోట్ల మేర అప్పులు తీసుకున్నాయి.

అధికారంలో అలా.. విపక్షంలో ఇలా!

స్పీకర్ నిర్ణయాలపై బీఆర్‌ఎస్ ద్వంద్వవైఖరి.. ఎర్రబెల్లి కేసులో డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పే శిరోధార్యం

» 'మేఘాచంద్రసింగ్' తీర్పు ఇక్కడ వర్తించదు

» ఎమ్మెల్యేల అనర్హత కేసులో ఏజీ వాదనలు

» తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు ధర్మాసనం

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు.. ఎమ్మెల్యేల అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయాలను సమర్థించిందని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నందున స్పీకర్‌ను తప్పుబడుతోందని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి హైకోర్టు ధర్మాసనానికి తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగు వారాల్లో స్పీకర్ విచారణ ప్రారంభించాలని పేర్కొంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ అసెంబ్లీ కార్యదర్శి. హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవారం విచారణ కొనసాగించింది. అప్పీలుదారు అయిన అసెంబ్లీ కార్యదర్శి తరఫున అడ్వకేట్ జనరల్ రిప్లై వాదనలు కొనసాగించారు. 'ఎర్రబెల్లి దయాకర్‌రావు' కేసు విచారణ సందర్భంగా నాడు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్.. స్పీకర్ నిర్ణయాలను సమర్థించిందని, ఇప్పుడు మాత్రం వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. అనర్హత అంశంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన 'ఎర్రబెల్లి దయాకర్‌రావు' తీర్పే శిరోధార్యమని.. దానినే సింగిల్ జడ్జి అనుసరించాల్సి ఉంటుందని తెలిపారు.



అనర్హత పిటిషన్లను స్పీకర్ గరిష్ఠంగా మూడు నెలల్లో తేల్చాలని చెప్పిన్న కైశం మేఘాచంద్రసింగ్ తీర్పు.. సదరు కేసు తాలూకు ప్రత్యేక సందర్భంలో ఆర్టికల్ 142 కింద ఇచ్చిన తీర్పు అని వివరించారు. కాబట్టి, ప్రస్తుత సందర్భానికి అది వర్తించదన్నారు. స్పీకర్ నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమంటూ ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన 'ఎర్రబెల్లి దయాకర్‌రావు' తీర్పు, సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసిన 'ఎస్‌ఏ సంపత్ కుమార్' తీర్పు ఇక్కడ వర్తిస్తాయని ఏజీ తెలిపారు. అలాగే ఇటీవల మహారాష్ట్ర వ్యవహారంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన 'సుభాష్ దేశాయి' తీర్పులో సైతం వీలైనంత వేగంగా పరిష్కరించాలని మాత్రమే చెప్పారు కానీ.. మూడునెలల్లో పరిష్కరించాలని చెప్పలేదని ఏజీ సుదర్శన్‌రెడ్డి గుర్తు చేశారు. మరోవైపు పార్టీ మారిన ఎమ్మెల్యే దానం నాగేందర్ తరఫున సీనియర్ న్యాయవాది పీ శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ.. ఎమ్మెల్యేల అనర్హత అంశాన్ని సింగిల్ జడ్జి 'అడ్మినిస్ట్రేటివ్ లా' కోణంలో చూస్తూ నాలుగువారాల్లో విచారణ మొదలు పెట్టాలి అని ప్రభుత్వ అధికారులను ఆదేశించినట్లుగా తీర్పు ఇవ్వడం చెల్లదన్నారు. ఈ వ్యవహారాన్ని 'కాన్స్టిట్యూషనల్ లా' కోణంలో చూడాలని చెప్పారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి (బీజేపీ) తరఫున సీనియర్ న్యాయవాది జే ప్రభాకర్ వాదిస్తూ.. స్పీకర్‌కు ఫిర్యాదు చేసి ఆరునెలలు అవుతోందని, కేవలం పది రోజుల్లో కోర్టుకు వచ్చారని ఏజీ చెప్పడం కరెక్ట్ కాదన్నారు. అన్నివైపుల వాదనలు విన్న ధర్మాసనం తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

కొత్తగా 4 డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్

అవసరమైన మేర డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల భర్తీ

కలెక్టరేట్లలో ఫిర్యాదుల కోసం విభాగాలు

అధికారులతో మంత్రి దామోదర



హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాసిరకం, నకిలీ మందులు తయారు చేసే వారితో పాటు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ(డీసీఏ) అధికారులను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఔషధ పరిశ్రమలు, తయారీ కేంద్రాలు, మందుల దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేయాలని సూచించారు. మంగళవారం డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎంఎస్ఐడీసీ) అధికారులతో మంత్రి దామోదర సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ ఒక్కటే ఉందని, దీనివల్ల ఎక్కువ నమూనాలను పరీక్షించలేకపోతున్నామని డీసీఏ అధికారులు మంత్రికి తెలిపారు. పదేళ్లలో కొత్తగా డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్ రాలేదని, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై దామోదర స్పందించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ ఆధునీకరణ, కొత్తగా 4 ల్యాబ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీసీఏ ఉన్నతాధికారులను ఆదేశించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి అవసరమైన పోస్టులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఔషధాలకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్లలో కంప్లయింట్ సెల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రగ్స్‌పై ఫిర్యాదుల స్వీకరణ, ఆకస్మిక తనిఖీల కోసం స్టేట్ విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఔషధాల ధరలు, నాణ్యతలో నిబంధనలు ఉల్లఘించే ఆస్పత్రుల సమాచారాన్ని డీఎంహెచ్‌వోలకు అందజేయాలని.. ఆయా హాస్పిటళ్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. టీజీఎంఎస్ఐడీసీకి మందులు సరఫరా చేసే సంస్థల తయారీ యూనిట్లను డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేయాలని, తరచూ ఔషధాల నమూనాలను పరీక్షించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకపోయినా, నాసిరకం మందులు అని తేలినా ఆయా సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టాలని సూచించారు.

సింగపూర్ ప్లాన్ సిద్ధం!

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టు పనుల కోసం ప్రతిపాదించారు. అభివృద్ధి ప్రణాళికలో భాగంగా.. బాపు ఘాట్ వద్ద ప్రపంచంలోనే అతి పెద్ద గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. గాంధీజీ సిద్ధాంతాలను ప్రబోధించే కేంద్రాన్ని నిర్మిస్తారు. బెంగళూరులోని జిందాల్ ప్రకృతి చికిత్సాలయం తరహాలో ఇక్కడ ఒక ప్రకృతి చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటుచేస్తారు. అదే సమయంలో స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాలకు చెందిన ఒక ఆఫ్ క్యాంపస్ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. లండన్ ఐ తరహాలో ఒక భారీ జెయింట్‌వీల్ ఏర్పాటుచేస్తారు. వీటికి తోడు ఇంకా అనేక హంగులు, ఆకట్టుకునే నిర్మాణాలతో ఒక ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా దీన్ని తయారుచే యాలని సంకల్పించారు. అలాగే.. మల్లన్న సాగర్ నుంచి 15 టీఎంసీల గోదావరి జలాలను తరలించి.. అందులో 5 టీఎంసీల జలాలను మూసీ నదిలో ఉంచేలా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈమేరకు.. మల్లన్న సాగర్ నుంచి పైప్‌లైన్ పనుల టెండర్లను కూడా ప్రభుత్వం ఖరారు చేసింది. మూసీ ప్రక్షాళనతో పాటు గోదావరి జలాలను కూడా తీసుకు రావడం వల్ల బాపూ ఘాట్ వద్ద ఒక స్వచ్ఛమైన దృశ్యాన్ని ఆవిష్కరించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ఉదారంగా పరిహారం

బాపు ఘాట్ అభివృద్ధి పనులకు అవసరమైన భూమిలో సగానికి పైగా ప్రభుత్వం వద్దే ఉంది. సేకరించాల్సిన ప్రైవేటు భూమి 30 ఎకరాలదాకా ఉంటుందని అంచనా ఈ ప్రైవేటు భూమిలో రెండు అపార్ట్‌మెంట్ వెంచర్లు ఉన్నాయని గుర్తించారు. ఆ భూమి సేకరణ విషయంలో ఉదారంగా వ్యవహరించాలని.. వారి నుంచి తీసుకునే భూమికన్నా ఎక్కువ భూమిని వారికి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించినట్టు సమాచారం. కొత్తగా భూ కేటాయింపు చేసిన చోట తిరిగి గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణం కోసం అవసరమైన మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించనుంది. మౌలిక సదుపాయాలను కల్పించనుంది. ఈమేరకు అపార్ట్‌మెంట్ల సంఘాలతో మాట్లాడి, ఒక ప్రత్యేక ఖాతా తెరిచి దానిలో నిర్మాణానికి అవసరమైన నిధులను జమ చేసే ఉద్దేశంతో ఉంది.

ఎన్ఎండీసీపై సీబీ'ఐ'?

- సంస్థలో అవకతవకలంటూ ఫిర్యాదులు
- ప్రాథమిక విచారణ సాగిస్తున్న సీబీఐ

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ)పై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) దృష్టి సారించింది. సంస్థలో అక్రమాలు, అవకతవకలు జరిగాయంటూ అందిన ఫిర్యాదుల ఆధారంగా.. ప్రాథమిక విచారణను కొనసాగిస్తోంది. ఇటీవలే ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయ అధికారులు హైదరాబాద్‌లోని ఎన్ఎండీసీ ప్రధాన కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. పలు ఫైళ్లు, డాక్యుమెంట్లు, టెండర్ ప్రక్రియలను పరిశీలించినట్లు సమాచారం. ముఖ్యంగా ఒక అధికారి నుంచి మరో అధికారికి.. అధికారాల బదలాయింపు, 22 సార్లు చార్టెర్డ్ విమానాల్లో అధికారుల ప్రయాణాలు వంటి అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది. మరి కొన్ని కేసులకు సంబంధించి నిధుల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపైనా దర్యాప్తు చేశారు. తాజాగా ఎన్ఎండీసీ అధికారులను ఢిల్లీకి పిలిపించుకుని, విచారణ జరిపినట్లు తెలిసింది. ఇలా పది మందికి పైగా అధికారులు ఢిల్లీకి వెళ్లినట్లు సమాచారం. సీబీఐ అధికారులు వీరి నుంచి వాంగ్మూలాలను సేకరించినట్లు తెలుస్తోంది.

విధుల నుంచి ట్రిపుల్ ఐటీ సీఐ తొలగింపు

- ఇద్దరు సెక్యూరిటీ గార్డులపై హత్యాయత్నం కేసులు
- సెక్యూరిటీపై దాడి చేసిన ఏబీవీపీ కార్యకర్తలపైనా కేసులు

బాసర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిపుల్ ఐటీ సీఐ (చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్) రాకేశ్‌ను మంగళవారం సాయంత్రం విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు పోలీసు శాఖ నుంచి ఉత్తర్వులు అందాయని యూనివర్సిటీ పరిపాలన అధికారి రణధీర్ తెలిపారు. విద్యార్థి ఆత్మహత్య తర్వాత నిరసన తెలిపేందుకు వచ్చిన ఏబీవీపీ విద్యార్థులపై సెక్యూరిటీ సిబ్బంది కర్రలతో దాడి చేయడంతో పలువురికి తీవ్రగాయాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే పరిస్థితి కర్రలతో దాడుల వరకు వెళ్లిందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనను పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. విచారించి దాడికి పాల్పడిన ఇద్దరు సెక్యూరిటీ గార్డ్‌లపై హత్యాయత్నం కేసులు నమోదు చేయడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐని విధుల నుంచి తప్పించారు. అదేవిధంగా ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసిన ఏబీవీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే, మృతి చెందిన విద్యార్థి స్వాతిప్రియ తల్లి మనోవేదనతో బాసర ఎస్సై గణేష్ చొక్కా కాలర్‌ను పట్టుకున్న ఘటనపై కూడా పోలీసులు కేసు నమోదు చేయనున్నట్లు తెలిసింది.

బీజేపీ లీగల్ సెల్ న్యాయవాదిపై హత్యాయత్నం

ఖైరతాబాద్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): బీజేపీ లీగల్ సెల్ న్యాయవాది కళ్యాణ్ వంశీకర్‌పై హత్యాయత్నం జరిగింది. ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీకి చెందిన కళ్యాణ్ మంగళవారం ఉదయం ఐదున్నర గంటల సమయంలో ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ నుంచి ఐమాక్స్ వైపు మార్నింగ్ వాక్ చేస్తుండగా ఈ దాడి జరిగింది. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఏం చేస్తున్నావని ప్రశ్నించి కత్తితో దాడి చేశారు. దాడిలో కళ్యాణ్ ఛాతీ కింద, మోచేతి కింద భాగంలో గాయాలయ్యాయి. మరో 3 చోట్ల స్వల్ప గాయాలయ్యాయి. దాడి అనంతరం దుండగులిద్దరూ అదే ద్విచక్ర వాహనంపై పారిపోయారు. ఆ వెంటనే కళ్యాణ్ తన సోదరుడైన ఖైరతాబాద్ బీజేపీ అధ్యక్షుడు ఆదర్శ్‌కు ఫోన్ చేసి తనపై హత్యాయత్నం జరిగిందని చెప్పారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కళ్యాణ్‌కు రక్తస్రావం అవుతుండటంతో తొలుత గాంధీకి, అనంతరం గ్లోబల్ ఆస్పత్రికి తరలించారు.

కాజేసిన సొమ్ము గంటల్లోనే వెనక్కి

- రూ. 2.91 లక్షలు నొక్కేసిన నేరగాళ్లు
- సైబర్ క్రైం సిబ్బంది చొరవతో బాధితుడి ఖాతాలో జమ

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ వ్యక్తి పోగొట్టుకున్న డబ్బును సైబర్ క్రైం అధికారులు సత్వరమే స్పందించి బాధితుడి ఖాతాలో జమ చేయించారు. బ్యాంకు అధికారులమంటూ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి కేటుగాళ్లు ఫోన్ చేశారు. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని చెప్పడంతో ఆశ పడిన బాధితుడు వ్యక్తిగత వివరాలతోపాటు బ్యాంకు ఖాతా వివరాలు, కార్డు నెంబర్ చెప్పాడు. అయితే వ్యక్తిగత వివరాలు నమోదు చేయమని చెప్పిన దుండగులు అతని మొబైల్‌కు ఏపీకే ఫైల్ లింక్‌ను పంపారు. అనుమానం రాకపోవడంతో లింక్‌ను తెరిచిన బాధితుడు.. ఖాతా వివరాలు పొందుపరిచాడు. లింక్ ద్వారా పంపిన ఏపీకే ఫైల్‌లోని మాల్‌వేర్ ద్వారా మొబైల్‌ను తమ నియంత్రణలో తీసుకున్న సైబర్ నేరగాళ్లు... పలుదఫాలుగా అతని క్రెడిట్ కార్డు నుంచి రూ.2.91 లక్షలు కాజేశారు. ఓటీపీ రాకుండానే డబ్బులు పోయినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. సత్వరమే స్పందించిన సైబర్ క్రైం సిబ్బంది బాధితుణ్ని ఠాణాకు పిలిపించుకొని అతడి మొబైల్ నుంచి మాల్‌వేర్ తొలగించారు. అనంతరం నిందితులు క్రెడిట్ కార్డు నుంచి అమెజాన్‌లో కొనుగోళ్లు చేసినట్లు గుర్తించారు. దాని ఆధారంగా సంబంధిత అధికారులకు సమాచారమిచ్చి, కొనుగోళ్ల కోసం చేసిన పేమెంట్‌ను నిలిపివేశారు. కేసు వివరాలను సమర్పించి మర్చంట్ రీఫండింగ్ ద్వారా బాధితుడు పోగొట్టుకున్న రూ.2,91,726 డబ్బును క్రెడిట్ కార్డులో జమ చేయించారు.



వీఐటీలో వేడుకలను ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు

గ్రామీణ-పట్టణ ప్రాంతాల
అంతరం తగ్గించేందుకు కృషి

- యువతకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య పిలుపు
- ఘనంగా వీఐటీ నాలుగు దశాబ్దాల వేడుకలు

వేలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు యువత కృషి చేయాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా యువతను సన్నద్ధం చేయాల్సిన బాధ్యతను విశ్వవిద్యాలయాలు తీసుకోవాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం తమిళనాడులో వేలూరులోని 'వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (వీఐటీ) నాలుగు దశాబ్దాల వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య పలువురు విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. అదేవిధంగా వీఐటీ ప్రాంగణంలో నిర్మించిన ఆర్‌జీ టవర్, సరోజిని నాయుడు బ్లాక్‌లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యతో పాటు ఆరోగ్య సేవలను ఉచితంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలని సూచించారు. 40 ఏళ్ల క్రితం ఓ కళాశాలగా ప్రారంభమైన వీఐటీ విశ్వవిద్యాలయం అందుకు నిదర్శనంగా నిలుస్తుందని, ఈ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీఐటీ చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్‌తో పాటు తమిళనాడు మంత్రి దురైమురుగన్, వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీ సెల్వం, ఈడీ డాక్టర్ సంధ్య పి, అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్ కాదంబరి ఎస్.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ టెండర్లు
ఖరారు చేసింది బీఆర్ఎస్సే!

వాటిపై కేటీఆర్ మాట్లాడడం ఈ శతాబ్దపు పెద్ద జోక్

- ఆయన తెచ్చింది నకిలీ ఫార్ములా ఈ రేస్.. అదో స్కాం
- దాన్నుంచి తప్పించమని షాను కోరేందుకే ఢిల్లీ వెళ్లారు
- అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర మంత్రులను కలవలేదేం?
- అప్పుడు చేతకాక ఇప్పుడు కొత్త నాటకం ఆడుతున్నారు..
- ప్రతిపక్షంలోకి మారాక ప్రజాస్వామ్యం గుర్తుకు వచ్చిందా?
- ప్రశ్నించిన మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 టెండర్లలో అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడడం ఈ శతాబ్దపు పెద్ద జోక్ అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తాము అధికారంలోకి వచ్చే నాటికే టెండర్లు ఖరారైనట్లు వివరించారు. అమృత్ 2.0 పనులకు రీ టెండర్ పిలిచేలా చేసిందే కేటీఆర్ అని ఆరోపించారు. తేజా రాజుకు చెందిన గజా కన్‌స్ట్రక్షన్స్‌కు అమృత్-1 టెండర్లు ఇచ్చింది కేటీఆర్ కాదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మంగళవారం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రతిమా శ్రీనివాస్‌రావు, మేఘా కంపెనీకి టెండర్లు ఇచ్చింది కేసీఆర్ కాదా అని నిలదీశారు. రూ.21 వేల కోట్ల విలువైన కాళేశ్వరం పనులను ఆస్పత్రులు నిర్వహించే ప్రతిమా శ్రీనివాస్‌రావుకు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సుజన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి తోక చుట్టం అని, కల్వకుంట్ల కవితకు వ్యాపార భాగస్వామి అని కోమటిరెడ్డి చెప్పారు. నీటి పారుదల శాఖలో టన్నెల్ పనులు వారే చేశారని, ఆ విషయంపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటీఆర్ తెచ్చింది అసలైన ఫార్ములా ఈ కాదని.. అది పెద్ద నకిలీ అని కోమటిరెడ్డి ఆరోపించారు. ఫార్ములా ఈ రేస్‌కు రూ.55 కోట్ల కేటాయింపుపై ఏసీబీ కేసు నమోదు, విచారణకు గవర్నర్ అనుమతి కోరడంతో కేటీఆర్‌లో భయం పుట్టిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు సహకరించినందుకు తనను ఫార్ములా ఈ కుంభకోణం నుంచి తప్పించమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసేందుకే ఢిల్లీ వెళ్లాడని పేర్కొన్నారు. ఫెమా, ఆర్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించి కోట్ల రూపాయలను డాలర్లుగా మార్చి కన్సల్టెన్సీల కడుపు నింపాడని, హైదరాబాద్ పేరు చెప్పి అడ్డగోలు దోపిడీకి తెరతీసిన దోపిడీ రావు కేటీఆర్ అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో కేటీఆర్‌ను ఎవరూ పట్టించుకోరని.. మంత్రిగా ఉన్నప్పుడు మోడీ లేదు బోడీ లేదు అన్న ఆయనకు ఇప్పుడు ప్రజాస్వామ్యం గుర్తొచ్చిందా? అని నిలదీశారు. అధికారంలో ఉండగా రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రులను కలవడం చేతగాని కేటీఆర్, కేసుల మాఫీ కోసం కొత్త నాటకానికి తెరతీశారని అన్నారు.ఆర్ఆర్ఆర్ మంజూరై ఏళ్లు గడిచినా కేంద్ర మంత్రి గడ్కరీని ఒక్కసారి కూడా ఎందుకు కలవలేదన్నారు. గిరిజనులు, ఆదివాసీల సంక్షేమం కోసం పని చేసిన ఐఏఎస్ అధికారి ప్రతీక్‌జైన్‌పై దాడి బీఆర్ఎస్ మానసిక స్థితికి నిదర్శనమని కోమటిరెడ్డి అన్నారు. ఇప్పుడు భూ సేకరణ గురించి మాట్లాడుతున్నవారు.. బీఆర్ఎస్ హయాంలో 14 వేల ఎకరాలను ఫార్మా సిటీ కోసం సేకరించినప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. అధికారంలో ఉంటే రాళ్లు విసరడం, లేకపోతే కాళ్లు పట్టుకోవడం కేసీఆర్ కుటుంబానికి అలవాటేనని వ్యాఖ్యానించారు.

రేవంత్, పొంగులేటి
పదవులు ఊడతాయ్

(మొదటిపేజీ తరువాయి)



కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎంపీలు సురేశ్‌రెడ్డి, రవిచంద్ర, దామోదర్‌రావుతో కలిసి కేటీఆర్ ఢిల్లీలో మాట్లాడారు. సీఎం రేవంత్ తన బావమరిది సృజన్‌రెడ్డికి అమృతం పంచి.. కొడంగల్ ప్రజలకు విషం పంచుతున్నారని మండిపడ్డారు. కేవలం రూ.2 కోట్ల లాభాల్లో ఉన్న సృజన్‌రెడ్డి కంపెనీకి రూ.1,137 కోట్ల టెండర్ ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. అల్లుడి ఫార్మా కంపెనీ కోసం రేవంత్‌రెడ్డి కొడంగల్ ప్రజలను బలిపెట్టి భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. కలెక్టర్‌పై దాడి చేసే పరిస్థితి గతంలో తెలుగు రాష్ట్రంలో మనం ఎప్పుడైనా చూశామా? అని అన్నారు. పొలిటికల్ బాంబులు పేలుతాయంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈడీ కేసులో ఏం చేశారో అందరికీ తెలుసునని వ్యాఖ్యానించారు. "కాంగ్రెస్ వాళ్లు ముందుగా మంత్రి పొంగులేటి నివాసంపై ఈడీ దాడుల కేసు ఏమైందో చెప్పాలి. ఈడీ దాడుల నుంచి బయటపడేందుకు మంత్రి పొంగులేటి.. అదానీ కాళ్లు పట్టుకుంది వాస్తవాం కాదా?" అని కేటీఆర్ అన్నారు.

ఢిల్లీకి బరాబర్ వస్తా..

కాంగ్రెస్ అవినీతిని దేశ ప్రజల ముందు పెట్టేందుకు తాను బరాబర్ ఢిల్లీకి వస్తానని కేటీఆర్ తెలిపారు. "తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు 26 సార్లు ఢిల్లీ వచ్చారు. కానీ, 26 పైసలైనా తెచ్చారా? మేం వస్తే ఎందుకంత భయం?" అని ప్రశ్నించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రజలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేయొద్దని, ప్రాంతీయ పార్టీలకు మద్దతివ్వాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా డబ్బులు తీసుకెళుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల సరిహద్దులో చెక్‌పోస్టులను మరింత పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కోరారు. కేసీఆర్ నామస్మరణ చేయకపోతే రేవంత్‌రెడ్డికి ఒక్కపూట కూడా గడవదన్నారు. రాష్ట్రంలో హామీలు అమలు చేయకుండా మహారాష్ట్రలో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మహారాష్ట్రలో తెలంగాణ ప్రభుత్వం తరఫున రూ.300 కోట్ల ప్రకటనలు ఇచ్చారని తెలిపారు. కుల గణనకు తాము వ్యతిరేకం కాదని, కానీ.. వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం సరికాదని అన్నారు. ప్రైవేటు వ్యక్తులతో సమాచారం సేకరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది 'మాన్యువల్ పెగాసెస్' అని కేటీఆర్ అభివర్ణించారు.

ఆర్ఆర్ ట్యాక్స్‌పై చర్యలెందుకు తీసుకోరు?

తెలంగాణలో ఆర్ఆర్ (రాహుల్-రేవంత్) ట్యాక్స్ నడుస్తోందని స్వయంగా చెప్పిన ప్రధాని మోదీ.. దీనిపై చర్యలెందుకు తీసుకోవడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్ రక్షణ కవచంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేలను గొర్రెల మాదిరిగా కొంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అంటున్నారని, కానీ.. దేశంలో పెద్ద గొర్రెల మండీ తెలంగాణయేనని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేల కొనుగోళ్లపై ఖర్గే స్పందించాలని డిమాండ్ చేశారు. తనపై పదే పదే ఆరోపణలు చేయడం కాదని, ఏ విచారణకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. ఏం చేసుకుంటారో చేసుకోండని సవాల్ చేశారు.

మా భూములు మాకేనని కొడంగల్ కొట్లాడుతోంది: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్.. మా భూములు మాకేనని కొట్లాడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఫార్మా కంపెనీ కోసం తమ భూములను లాక్కోవద్దంటూ అన్నదాతలు కన్నెర్రజేస్తున్నారని, సీఎం కుటుంబ దాహం కోసం కుట్రలు చేస్తే లగచర్ల లగాయించి ఎదురొడ్డుతోందని 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు. పనికిరాని పాగల్ పాలనలో తెలంగాణ ఆగమవుతోందని, అసమర్థపు మూర్ఖ ముఖ్యమంత్రి ఏలుబడిలో అసంతృప్తులు కొనసాగుతున్నాయని తెలిపారు.

జన్యు సంబంధిత
గుండె జబ్బులకు ఉచిత ఆపరేషన్లు

- సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో 100 పడకల ఆస్పత్రి
- రేపు సిద్దిపేట జిల్లా కొండపాకలో ప్రారంభం
- హాజరుకానున్న మాజీ క్రికెటర్ గవాస్కర్

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బులు ఉన్నవారిలో ఎక్కువ మంది ప్రజలు మృత్యువుకు చేరువవుతున్నట్లేనని భావిస్తారు. ఇక జన్మతా గుండె జబ్బులున్న వారి ఆయుష్షు దినదినగండంగా ఉంటుంది. పైగా పుట్టుకతో వచ్చే గుండె జబ్బులకు శస్త్ర చికిత్స అంటే చాలా ఖరీదైన విషయం. సగటున మూడున్నర నుంచి ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఇంతటి ఖర్చును పేదలు, మధ్యతరగతి ప్రజలు భరించడం కష్టమే. అటువంటి ఖరీదైన శస్త్రచికిత్సను ఉచితంగా చేసేందుకు సత్యసాయి ట్రస్టు ముందుకు వచ్చింది. జన్యుసంబంధిత గుండె జబ్బులతో బాధపడే వారికి ఉచిత వైద్య సేవలతో పాటు శస్త్రచికిత్సలు చేయనుంది. ఇందుకోసం సిద్దిపేట జిల్లా కొండపాకలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో 100 పడకల ఆస్పత్రిని నిర్మించింది. దీన్ని నవంబరు 14 బాలల దినోత్సవం సందర్భంగా ప్రారంభించనున్నారు. ప్రముఖ మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. దక్షిణాదిన ఇదే తమ తొలి ఆస్పత్రి అని ట్రస్టు వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో పుట్టపర్తి సత్యసాయి ట్రస్టుకు దీనికి ఎటువంటి సంబంధం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. ఉత్తర భారతదేశంలో ఇప్పటికే మూడు ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకువచ్చి ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. గుండె ఆపరేషన్లు చేసే ఆస్పత్రులే కాకుండా మరో ఐదు మాతాశిశు సంరక్షణ ఆస్పత్రులను కూడా ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. కాగా, తెలంగాణలో కొత్తగా అందుబాటులోకి రానున్న ఆస్పత్రిలో మిషన్ మోడ్‌లో గుండె ఆపరేషన్లు చేస్తామని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కొండపాక ఆస్పత్రిలో కొద్దిరోజుల్లో రోజుకు సగటున 6-7 సర్జరీలు చేస్తామని తెలిపాయి. వంద పడకలతో మొదలయ్యే ఈ ఆస్పత్రి.. రోగుల తాకిడి పెరిగితే 200 పడకల వరకు విస్తరిస్తామని పేర్కొన్నాయి. ఆపరేషన్ చేసుకున్నవారికి ఆ తర్వాతా వైద్యసేవలు, పరీక్షలు కూడా కొనసాగిస్తామని తెలిపాయి. అవసరమైన ఔషధాలను కూడా ఉచితంగా అందిస్తామని ఆ వర్గాలు వెల్లడించాయి.

దేశంలో ఏటా 2 లక్షల మంది గుండె జబ్బుతో జననం

మన దేశంలో పుట్టుకతో జన్యుపరమైన గుండె సంబంధిత జబ్బులతో బాధపడే పిల్లల సంఖ్య ఏటికేడు పెరుగుతున్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ప్రతీ వేయి మందిలో 9 మంది జన్యుపరమైన గుండె జబ్బులతో పుడుతుంటారని వైద్యనిపుణులు చెబుతున్నారు. మనదేశంలో ఏటా 2 లక్షల మంది చిన్నారులు ఈ సమస్యతో జన్మిస్తున్నట్లు కేంద్రవైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కొందరిలో పుట్టిన వెంటనే ఇవి బయటపడితే మరికొందరిలో చాలా ఏళ్ల తర్వాత ఈ సమస్య బైటకొస్తుందని ఆ వర్గాలు వెల్లడించాయి. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే చికిత్స అందించగలిగితే వారికి తీవ్రమైన ముప్పు ఉండదని చెబుతున్నారు.

చిచ్చు పెట్టే ముఠా!

వైసీపీ సోషల్ మీడియా 'ఆర్గనైజ్డ్ క్రైమ్'.. వర్రా రవీంద్రా రెడ్డి అందులో భాగస్వామి

- సజ్జల భార్గవ్, అర్జున్‌రెడ్డి కీలక పాత్ర
- రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి
- వర్రాకు 14 రోజులు రిమాండ్



వర్రా రవీంద్రారెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి , అర్జున్‌రెడ్డి

అమరావతి/పులివెందుల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇది కేవలం సోషల్ మీడియా పోస్టులకు సంబంధించిన కేసు కాదు! ఇదో... వ్యవస్థీకృత నేరం! కులాల మధ్య కుంపట్లు రాజేయడం! సమాజంలో చిచ్చు పెట్టడం! మహిళలను మానసికంగా వేధించడం! బాలికలనూ వదలకుండా కామెంట్లతో హింసించడం! గౌరవంగా బతికే దళితులను అవమానించడం! ప్రభుత్వాన్ని అస్థిరపరచడం! పనిలోపనిగా బలవంతపు వసూళ్లకూ పాల్పడటం! వైసీపీ సోషల్ మీడియా వెనుక ఇంతటి విషం దాగుందని పోలీసులు పేర్కొన్నారు. కూటమి నేతలు, వారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో కాలకూట విషం చిమ్మే ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రా రెడ్డి రిమాండ్ రిపోర్టులో అనేక సంచలన విషయాలు పేర్కొన్నారు. ఈ కేసులో వర్రాను ఏ1గా పేర్కొనగా... వైసీపీ సోషల్ మీడియా విభాగానికి ఇన్‌చార్జిగా వ్యవహరించిన సజ్జల భార్గవ్ రెడ్డిని రెండో నిందితుడిగా (ఏ2)గా చేర్చారు. వర్రాతోపాటు... అతడికి సహకరించిన గుర్రంపాటి వెంకట సుబ్బారెడ్డి, గురజాల ఉదయ్ కుమార్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వర్రా వాంగ్మూలం ఆధారంగా అనేక కీలక అంశాలను గుర్తించామని, ఈ వ్యవస్థీకృత నేరంలో భాగస్వాములైన మొత్తం 45 మందిపై కేసు నమోదు చేశామని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. పులివెందుల కోర్టుకు దీనిని సమర్పించారు. వర్రా రవీంద్రా రెడ్డి తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేసిన 40 నీచమైన వ్యాఖ్యల స్క్రీన్‌షాట్లను కూడా సేకరించామని... అవి తాను పోస్టు చేసినవే అని అంగీకరించాడని చెప్పారు. వైసీపీ సోషల్ మీడియా పేరుతో జరిగే 'ఆర్గనైజ్డ్ క్రైమ్'లో వర్రా రవీంద్రా రెడ్డి భాగస్వామిగా ఉంటూ నీచమైన పనులు చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ (ఎక్స్)లో తప్పుడు వార్తలు సృష్టించడం, నీచమైన వ్యాఖ్యలు చేయడం వ్యవస్థీకృతంగా జరుగుతోందన్నారు. ఇందులో... సజ్జల భార్గవ్ రెడ్డితోపాటు సిరిగిరి అర్జున్ రెడ్డి (ఏ3)ది కీలక పాత్ర అని తెలిపారు. "అనుచిత పోస్టులు వ్యాప్తి చేసే వైసీపీ సోషల్ మీడియా విభాగంలో వర్రా 2012 నుంచే భాగస్వామిగా ఉన్నాడు. తాడేపల్లి నుంచి వచ్చే కంటెంట్‌ను ఎక్కువ మందికి చేరవేసేందుకు ప్రతి నెలా 13వేలు వేతనం తీసుకొంటున్నట్లు వర్రా రవీందర్ రెడ్డి తన వాంగ్మూలంలో చెప్పాడు" అని పోలీసులు తెలిపారు.

ఇదీ కేసు...

2023 డిసెంబరు నుంచి మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో సింహాద్రిపురం మండలానికి చెందిన హరి అనే వ్యక్తి కలత చెందారు. వర్రా రవీందర్ రెడ్డి వద్దకెళ్లి... ఆ వ్యాఖ్యలను తొలగించాలని అడిగారు. అందుకు ఆయన నిరాకరించి, కులం పేరుతో దూషించాడు. చివరికి... రెండు లక్షలిస్తే తొలగిస్తానని డబ్బులు డిమాండ్ చేశాడు. హరి 20వేలు ఇచ్చి మిగతా డబ్బులు విడతల వారీగా ఇస్తానని చెప్పాడు. అయినా కామెంట్స్ తొలగించలేదు. దీంతో ఈనెల 8వ తేదీన పులివెందుల పోలీసులకు హరి ఫిర్యాదు చేశారు. తన సామాజిక వర్గ నాయకుడైన మంద కృష్ణ మాదిగ, హోంమంత్రి వంగలపూడి అనిత తదితరులపై నీచమైన పోస్టులు పెడుతూ, వారి ఇళ్లలోని మహిళల్ని కించ పరుస్తున్న వర్రా రవీందర్ రెడ్డిపై చర్య తీసుకోవాలని కోరారు. దీంతో పోలీసులు వర్రాతోపాటు గుర్రంపాటి వెంకట సుబ్బారెడ్డి, గురజాల ఉదయ్ కుమార్ రెడ్డి ని అరెస్టు చేసి పులివెందుల కోర్టులో హాజరు పరిచారు. వారికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్ రెడ్డిపై ఎల్‌వోసీ..

వైసీపీ సోషల్ మీడియా బాధ్యుడు సజ్జల భార్గవ్ రెడ్డి కోసం పోలీసుల వేట ముమ్మరం చేశారు. ఆయన విదేశాలకు పారిపోయే అవకాశం ఉన్నందున లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ) జారీ చేశారు. కడప జిల్లాలో నమోదైన కేసుల్లో సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్ రెడ్డి కోసం ఎల్‌వోసీ జారీ చేశామని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కోరారు.

జగన్ అక్రమాస్తుల కేసులో 'నాట్ బిఫోర్ మీ'

- విచారణ నుంచి మరోసారి వైదొలగిన జస్టిస్ సంజయ్‌కుమార్
- జస్టిస్ ఓకా ధర్మాసనానికి బదిలీచేసిన సీజేఐ

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ మరోసారి వైదొలిగారు. జగన్ బెయిల్ రద్దు చేయాలని, విచారణను హైదరాబాద్ నుంచి వేరే రాష్ట్రానికి మార్చాలని అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు నిరుడు నవంబరు 1న సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. అవి ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ముందు మంగళవారం విచారణకు వచ్చాయి. విచారణ ప్రారంభం కాగానే.. ఆంధ్రప్రదేశ్‌లో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కౌంటర్ దాఖలు చేయడానికి మరికొంత సమయం కావాలని సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. ఈ క్రమంలో జస్టిస్ సంజయ్‌కుమార్ కేసును తాను విచారించనంటూ 'నాట్ బిఫోర్ మీ' అని అన్నారు. దీంతో విచారణను మరో ధర్మాసనానికి సీజేఐ బదిలీ చేశారు. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు డిసెంబరు 2న విచారణకు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించారు. గతంలోనూ జగన్ అక్రమాస్తులకు సంబంధించిన మరో పిటిషన్ విచారణ నుంచి జస్టిస్ సంజయ్‌కుమార్ వైదొలగడ గమనార్హం.

పోసాని కృష్ణమురళిపై కేసు

విజయవాడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సినీనటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళిపై విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జనసేన నేత ఇచ్చిన ఫిర్యాదుపై ఈ కేసు నమోదు చేశారు. 2021 సెప్టెంబరు 28న హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో పోసాని మీడియాతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ప్రతిష్ఠను దిగజార్చేవిధంగా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ కృష్ణరాజు

- పేరు ఖరారు చేసిన చంద్రబాబు
- ఎన్నిక లాంఛనప్రాయమే



అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుతం ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు శాసనసభ ఉప సభాపతి హోదాలో 'అధ్యక్షా..' అని పిలిపించుకోనున్నారు. టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ పేరును ఖరారు చేశారు. అసెంబ్లీలో ఈ ఎన్నిక ప్రక్రియ జరగాల్సి ఉంది. వైసీపీ కేవలం 11 స్థానాలకే పరిమితం కావడం, ఆ పార్టీ సభ్యులు సభకు దూరంగా ఉంటున్న నేపథ్యంలో... ఉప సభాపతిగా రఘురామ ఎన్నిక లాంఛనప్రాయమే కానుంది. పారిశ్రామిక వేత్త అయిన రఘురామకృష్ణ రాజు కొంతకాలం బీజేపీలో ఉన్నారు. 2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరి... నరసాపురం ఎంపీ అయ్యారు. అతి కొద్దికాలానికే జగన్ వైఖరితో విసిగి వేసారి పోయారు. 'వైసీపీ రెబల్ ఎంపీ'గా నిత్యం జగన్‌పై ఢిల్లీ వేదికగా ప్రెస్‌మీట్లతో విరుచుకుపడ్డారు. ఈ క్రమంలోనే రఘురామను సీఐడీ అరెస్టు చేయడం, కస్టడీలో తీవ్రంగా హింసించడం జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. గత ఎన్నికల ముందు రఘురామ టీడీపీలో చేరారు. ఆయనను తిరిగి లోక్‌సభకు పంపించాలని భావించినా... కూటమిలో సమీకరణలు, సీట్ల సర్దుబాటులో అది కుదరలేదు. దీంతో... రఘురామను ఉండి నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా బరిలో నిలబెట్టారు. కూటమి ఘన విజయం అనంతరం ఆయనకు సముచిత గౌరవం లభిస్తుందని అంతా భావిస్తూ వచ్చారు. ఇప్పుడు ఉప సభాపతి పదవికి ఎంపిక చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.